ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 9440897445, 8074636674

శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 | సంపుటి: 28 సంచిక: 156
Friday 18 Septembar 2026 | Vol.No 28 Issue No .156
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో
# ప్రపంచం గర్వించే తెలంగాణ నిర్మాణం

- తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక రాష్ట్ర నిర్మాణం
- రైతు, మహిళ, పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- విద్య, వైద్యం, ఉద్యోగాలతో యువతకు కొత్త భరోసా
- 2047 నాటికి రూ.3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- ప్రజా పాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు







హైదరాబాద్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తూ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం ప్రజా పాలనకు పునాదులని అన్నారు. రైతుకు భరోసా, మహిళలకు ఆర్థిక స్వావలంబన, అట్టడుగు వర్గాలకు న్యాయం, పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం, యువతకు ప్రపంచస్థాయి



అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో అంతర్భాగంగా మారి రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య

మిగతా 2లో..

## ఆర్థిక వృద్ధిలో రికార్డ్.. సెమీకండక్టర్ రంగంలో దూకుడు..

- భారత్‌పై ప్రపంచానికి విశ్వాసం పెరుగుతోంది
- సెమీకాన్ ఇండియా 2026ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- భారత్ ఆర్థిక వృద్ధి, ప్రపంచ విశ్వాసానికి సెమీకండక్టర్ల రంగం నిదర్శనమని వ్యాఖ్య
- ప్రపంచమంతా భారత చిప్స్ వెళతాయని ధీమా వ్యక్తం చేసిన మోదీ
- సెమీకాన్ 2.0 కింద 200 చిప్-డిజైన్ స్టార్టప్‌లకు మద్దతిస్తామని వెల్లడి
- నాలుగేళ్లలోనే 70,000 మంది డిజైన్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చామన్న అశ్విని వైష్ణవ్




హైదరాబాద్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ భారత

మిగతా 2లో..

## 933 ఎకరాలు ఉన్నట్లు
# నిరూపిస్తే రాసిస్తాం..

- రేవంత్‌కు కేటీఆర్ ఛాలెంజ్
- సిట్టింగ్ జడ్జితో విచారణకు కేటీఆర్ సవాల్
- కేసీఆర్ ఆస్తులపై ఆరోపణలను ఖండించిన కేటీఆర్
- 67 ఎకరాల భూమిపై కేటీఆర్ వివరణ
- 933 ఎకరాలు ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తామని ప్రకటన
- రేవంత్ ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు




హైదరాబాద్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): మాజీ సీఎం కేసీఆర్ ఆస్తులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన

మిగతా 2లో..




## రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా
# వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి

- మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 17, ( విజన్ ఆంధ్ర ) : రైతుల ఆదాయాన్ని గెలిచే దీక్షగా వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర వ్యవసాయ, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని కందుకూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహించిన రైతులు మరియు మహిళా సంఘాల సభ్యులతో ముఖాముఖి ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విశ్వకర్మ జయంతి, హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రజలకు

మిగతా 2లో..

# త్యాగాల చరిత్రకు ప్రతీక తెలంగాణ...

- ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం ప్రజాపాలన...
- ఎందరో త్యాగధనుల పోరాటాల ఫలితమే సెప్టెంబర్ 17
- రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు



హన్మకొండ , సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని హన్మకొండ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి, తెలంగాణ అమరవీరుల త్యాగాలు, పోరాటాలను స్మరించుకోవడం జరిగింది. అనంతరం హనుమకొండ సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ఆవరణలో సెప్టెంబర్ 17 సందర్భంగా నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకల్లో పాల్గొన్నాను. జాతీయ జెండా ఎగరవేసి, పోలీసుల గౌరవ


మిగతా 2లో..

## సెప్టెంబరు 17 చరిత్రకు
# మతం రంగు పులిమే ప్రయత్నం

- సెప్టెంబర్ 17 సందర్భంగా జెండా ఆవిష్కరించిన కవిత
- తెలంగాణ పోరాట స్ఫూర్తిని గుర్తుచేసిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి
- కాంగ్రెస్, బీజేపీలపై కవిత విమర్శలు
- విలీన చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపణ
- మతాలకు అతీతంగా ప్రజలు పోరాడారని వెల్లడి

హైదరాబాద్ సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన చీఫ్

మిగతా 2లో..




# తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షల తేదీలు విడుదల

- నవంబర్ 29న ఎస్ఐ, డిసెంబర్ 20న కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష
- మొత్తం 7,437 పోస్టులకు 5.77 లక్షలకు పైగా దరఖాస్తులు
- ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌కు సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగింపు
- పాత ప్రశ్నపత్రాలు, సిలబస్‌పై దృష్టి పెట్టాలని అభ్యర్థులకు సూచన

హైదరాబాద్ సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర):తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు కీలకమైన ప్రకటన వెలువడింది. ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రాథమిక రాత పరీక్ష (ప్రిలిమినరీ) తేదీలను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (TSL

మిగతా 2లో..

# రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

- కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం
- రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్




తాడేపల్లి సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన

మిగతా 2లో..

- మెయింటెనెన్స్ మాయం
- వార్డెన్ల జేబులకు చిల్లు
- వంటగదిలోకి వార్డెన్లు
- జీతాలు లేక రోడ్డెక్కిన వర్కర్లు

## రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టి
# హాస్టళ్లలో నరకం

### పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం!




తెలంగాణ స్టేట్ బ్యూరో,విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 17,(ప్రత్యేక కథనం): తెలంగాణ రాష్ట్రంలో పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఆశాదీపంగా నిలవాల్సిన సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి నేడు అత్యంత దారుణంగా, దయనీయంగా మారింది. ఉమ్మడి పది జిల్లాల నుండి నేటి 33 జిల్లాల వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 2000కు పైగా హాస్టళ్లలో ఇదే పరిస్థితి నెలకొంది. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా మెయింటెనెన్స్ నిధులు విడుదల కాకపోవడంతో హాస్టళ్లన్నీ శిథిలావస్థకు చేరుకుని నరకకూపాలుగా మారాయి. అసలు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో చూస్తే గుండె తరుక్కుపోతుంది. మహబూబ్ నగర్ నుండి ఆదిలాబాద్ వరకు, ఖమ్మం నుండి నిజామాబాద్ వరకు, వరంగల్, కరీంనగర్, నల్గొండ, రంగారెడ్డి, మెదక్... ఏ జిల్లాకు వెళ్లినా ఒక్కటే కథ, ఒక్కటే బాధ.కొన్ని హాస్టల్ భవనాలన్నీ పెచ్చులూడిపోయి ఉన్నాయి. గదుల్లో ఫ్యాన్లు తిరగడం లేదు, లైట్లు వెలగడం లేదు, కరెంట్ వైర్లు తెగి వేలాడుతున్నాయి. బాత్ రూమ్ లు,

మిగతా 2లో..




## వారణాసిలో చంద్రబాబు
# ప్రసంగానికి జేజేలు..

- దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీకి అండగా నిలవాలని పిలుపునిచ్చిన చంద్రబాబు
- VKS మంత్రంతో భారత్ అభివృద్ధి ప్రస్థానం అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్య
- అయోధ్యలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని యూపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి
- చంద్రబాబు ప్రసంగానికి వారణాసిలో విశేష స్పందన, చప్పట్లతో మార్మోగిన సభా ప్రాంగణం
- ప్రధానిగా మోదీ 25 ఏళ్ల ప్రస్థానం సందర్భంగా వారణాసిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం




వారణాసి సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): "ప్రధాని నరేంద్ర మోదీ సరైన సమయంలో సరైన నాయకుడు (రైట్ టైమ్.. రైట్ లీడర్). ఆయన నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, కేవలం దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీకి మనమందరం అండగా నిలవాలి. ఎన్డీయే ఐక్యతే ఈ దేశానికి బలం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా

మిగతా 2లో..

## .త్యాగాల చరిత్రకు ప్రతీక తెలంగాణ...

వందనం స్వీకరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించాను. దశాబ్దాల నిజాం రాచరిక వ్యవస్థను కూలదోసి, ప్రజాస్వామ్య ప్రస్థానానికి నాంది పలికిన చారిత్రాత్మక ఘట్టం సెప్టెంబర్ 17, 1948. ప్రజాస్వామ్య భారతావనిలో హైదరాబాద్ రాజ్యం విలీనమైన శుభ సందర్భం. తెలంగాణ కోసం అసువులుబాసిన అమరవీరులందరికీ ముందుగా నివాళులు. ఆ తరువాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రజలు ఎన్నో అవమానాలు, అన్యాయాలు, వివక్షతలకు గురయ్యారు. కొన్ని పోరాటాల తర్వాత ఏర్పడిన ప్రత్యేక తెలంగాణను పాలించిన పాలకుడు నయా నిజామయ్యాడు. ఫలితంగా పదేండ్ల నియంత పాలనలో తెలంగాణ మగ్గిపోయింది. ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు, ఉద్యమాలను నిషేధించారు. ప్రజలకు ప్రభుత్వానికి దూరం పెరిగింది. ప్రజల మధ్య ఉండాల్సిన పాలకులు ఇనుపకంచలు చుట్టూ వేసుకొని దొరలపాలన చేశారు. అనంతరం తెలంగాణ ప్రజాఆశీస్సులతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో నయా నియంతను తరిమికొట్టి ప్రజాప్రభుత్వాన్ని తెచ్చుకున్నాం. ఏడు దశాబ్దాలుగా ప్రజలు ఆశించిన స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తూ పనిచేస్తుంది. సకలజనులు ఆత్మగౌరవంతో కూడిన పాలనను నిరంతరం అందిస్తూ ముందుకు సాగుతోంది. ప్రతి సంక్షేమ పథకంలో శాస్త్రీయ దృక్పథం కనిపిస్తుంది. అందుకు ఈ 33 నెలల ప్రజాపాలనే నిదర్శనం.

## తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షల తేదీలు విడుదల

PRB) ఖరారు చేసింది. ఈ వివరాలను టీఎస్ఎల్ పీఆర్బీ ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

షెడ్యూల్ ప్రకారం, ఎస్ఐ (SI) పోస్టులకు 2026 నవంబర్ 2న, కానిస్టేబుల్ పోస్టులకు 2026 డిసెంబర్ 20న ప్రిలిమినరీ రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF), అగ్నిమాపక, జైళ్ల శాఖల పరిధిలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

పోస్టులకు భారీ స్పందన

ఈ ఉద్యోగాలకు రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు కేవలం 28 రోజుల వ్యవధిలో మొత్తం 5,77,064 దరఖాస్తులు అందినట్లు బోర్డు వెల్లడించింది. ఇందులో ఎస్ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సగటున ఒక్కో అభ్యర్థి 1.34 పోస్టులకు దరఖాస్తు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దరఖాస్తుదారుల్లో 74.66 శాతం పురుషులు, 25.33 శాతం మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీ అభ్యర్థులు 49.19 శాతం, ఎస్సీ/ఎస్టీలు 43.60 శాతం, ఓసీలు 7.20 శాతం చొప్పున ఉన్నారు.

పరీక్షల నిర్వహణ, ఇతర వివరాలు

పరీక్షల నిర్వహణకు బోర్డు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షను పాత 10 జిల్లాల కేంద్రాల్లో, కానిస్టేబుల్ పరీక్షను 15 నుంచి 18 ప్రాంతాల్లో నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దరఖాస్తు సమయంలో ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను 97.4 శాతం మంది పూర్తి చేశారని, సాంకేతిక కారణాల వల్ల పూర్తి చేయలేకపోయిన మిగిలిన వారికి సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించినట్లు ఛైర్మన్ తెలిపారు. అభ్యర్థులు గత ప్రశ్నపత్రాలు, సిలబస్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించి పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన సూచించారు. తాజా సమాచారం కోసం అభ్యర్థులు ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్‌ను తనిఖీ చేయాలని బోర్డు కోరింది.

## రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టి హాస్టళ్లలో నరకం

మరుగుదొడ్లు దుర్గంధభరితంగా మారి రోగాలకు నిలయాలుగా మారాయి. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా మూసుకుపోయి మురుగునీరు గదుల్లోకి వస్తోంది. కుళాయిలు పాడైపోయాయి, నీటి కొరత తీవ్రంగా ఉంది. కనీసం శానిటేషన్ చేయించేందుకు కూడా డబ్బులు లేక హాస్టళ్లు దుర్గంధంతో నిండిపోయాయి. ఫ్యాన్ రిపేర్, కరెంట్ రిపేర్, డ్రైనేజీ బాగు చేయడం లాంటి చిన్న చిన్న మైనర్ రిపేర్లకు కూడా ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదు. ఈ దుస్థితిలో హాస్టల్ వార్డెన్ల పరిస్థితి వర్ణనాతీతం. విద్యార్థులు తమ పిల్లల లాంటి వారని భావించి, వారు ఇబ్బంది పడకూడదనే మంచి మనసుతో వార్డెన్లు తమ సొంత జీతం నుంచే డబ్బులు పెట్టి మెయింటెనెన్స్ చేయిస్తున్నారు. ప్రతి నెలా ఐదు వేల నుంచి పది వేల రూపాయల వరకు తమ జేబులోంచి తీసి ఫ్యాన్లు, లైట్లు, డ్రైనేజీలు బాగు చేయిస్తున్నారు. రెండేళ్లుగా ఇలా భరిస్తూ భరిస్తూ వార్డెన్లు ఆర్థికంగా చితికిపోయారు. "ఇంకెంత కాలం మా జీతం డబ్బులతో హాస్టల్ నడపాలి? ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవడం లేదు" అని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇక హాస్టళ్లలో పనిచేసే వంట మనుషులు, స్వీపర్లు, వాచ్ మెన్ ల గోడు వింటే మనసు చలించిపోతుంది. వారికి ఆరు నుంచి ఎనిమిది నెలలుగా జీతాలు రాలేదు. జీతాలు రాకపోవడంతో వారు విధులకు రావడం మానేసి చాలా చోట్ల సమ్మె బాట పట్టారు. దీంతో విద్యార్థులు పస్తులు ఉండకూడదనే మానవత్వంతో కొన్ని హాస్టళ్లలో వార్డెన్లే స్వయంగా వంటగదిలోకి వెళ్లి వంట చేసి విద్యార్థులకు వడ్డిస్తున్న హృదయ విదారక దృశ్యాలు రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. ఇది తెలంగాణ విద్యా వ్యవస్థకే సిగ్గుచేటు. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక వర్కర్లు జిల్లా కలెక్టర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వినతి పత్రాలు ఇస్తూ, "జీతాలు ఇవ్వండి మహాప్రభో" అంటూ వేడుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ కేటాయిస్తారని, తమ కష్టాలు తీరుతాయని ఎంతో ఆశగా ఎదురుచూసిన వార్డెన్లు, వర్కర్లకు ప్రతిసారీ నిరాశే ఎదురవుతోంది. పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమం కోసం ఉన్న హాస్టళ్లకే నిధులు లేకపోతే ఎలా? ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ జీతాలు, మెయింటెనెన్స్ బిల్లులు విడుదల చేయకపోతే హాస్టల్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలి పేద విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం ఉందని విద్యార్థి, ప్రజా సంఘాలు తీవ్రంగా హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరుస్తుందా? లేదా అనేది వేచి చూడాలి.

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## 933 ఎకరాలు ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తాం..

ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీలో కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములపై రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఇన్నాళ్లూ ప్రచారం చేసి.. అసెంబ్లీలో మాత్రం 67 ఎకరాలు ఉన్నట్లు సీఎం చెప్పారని కేటీఆర్ అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు 933 ఎకరాల భూమి ఉందని ప్రభుత్వం నిరూపిస్తే ఆ భూములను రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై పుట్టుపూర్వోత్తరాలతో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారని, తమ తాతకు వందల ఎకరాల భూమి ఉండేదని కేటీఆర్ చెప్పారు. ఇప్పుడు 67 ఎకరాలు ఉండటం తప్పా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తాను అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించుకున్నానని చెబుతున్నా.. రేవంత్‌రెడ్డికి జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ లాంటి ఇల్లు, ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆయన తమ్ముళ్లు ఏరోస్పేస్ కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం అయ్యాక ఆయన చిన్నాన్న ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో వివరించాలని కోరారు. రేవంత్‌రెడ్డి తమ పార్టీ నేతలపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రతి పథకంలోనూ స్కామ్ ఉంటోందని ఆరోపించారు.

# రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి

శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో గతంలో రజాకార్ల దాడుల నుంచి ప్రజలను రక్షించుకునేందుకు గ్రామస్తులు నిర్మించిన బురుజును సందర్శించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలిచిన పూర్వీకులకునివాళులర్పించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను కేంద్ర మంత్రి ప్రస్తావించారు. 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, బ్యాంకు రుణాలు, శిక్షణ మరియు వివిధ ఉపాధి అవకాశాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలించిన ఆయన, ఇంకా లఖ్‌పతి దీదీలుగా మారని మహిళలను కూడా శిక్షణ, బ్యాంకు రుణాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా యంత్రాంగాన్ని సూచించారు. పేదలకు సొంత ఇళ్లు కల్పించేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజనను సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు అందించేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు ఆధునిక, అభివృద్ధి చెందిన వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడంతో పాటు, తెలంగాణలో వ్యవసాయ అభివృద్ధికి సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించనున్నట్లు తెలిపారు. పంట నష్టాల సమయంలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పంట బీమా వంటి పథకాల అమలుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, పేదల గృహ నిర్మాణం వంటి అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతులు, మహిళలు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి, రహదారుల నిర్మాణానికి, రైతులకు ఆర్థిక సహాయానికి, స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గ్రామీణ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకునేందుకు కార్యక్రమానికి హాజరైనందుకు శ్రీ కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన పోరాటాన్ని, గ్రామాల రక్షణ కోసం నిర్మించిన బురుజులను ఆయన ప్రస్తావిస్తూ, సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. రైతులు, మహిళా సంఘాలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లాలో పలు గ్రామాలను అనుసంధానించే రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. తిమ్మాపూర్ పరిసర ప్రాంతాల్లో రూ.17 కోట్లతో రహదారి పనులు, శ్రీశైలం రోడ్డు నుంచి లేమూరు, అగ్రిమల, అవనిగడ్డ, తిమ్మాపూర్ వరకు సుమారు రూ.38 కోట్లతో రహదారి నిర్మాణం, పలు గ్రామాలను కలుపుతూ మరో రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, బ్యాంకులు, కమ్యూనిటీ హాళ్లు, ఆరోగ్య కేంద్రాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, భూసార పరీక్షలు, ఎరువుల సబ్సిడీ, మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు తదితర పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కరోనా సమయంలో ఉచిత వ్యాక్సినేషన్‌తో పాటు దేశవ్యాప్తంగా పేదకుటుంబాలకు ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ కొనసాగించిందన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీ కిషన్ రెడ్డి కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ మాట్లాడుతూ, దేశంలోని పేదలు, రైతులు, మహిళల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పేదలు, రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల ద్వారా అర్హులకు ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నాయకత్వంలో వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని రైతులు, మహిళలు, పేదల అభ్యున్నతి కోసం ఆయన మరింతకాలం సేవలందించాలని ఆకాంక్షించారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో పేదరికాన్ని ఆహారం, దుస్తులు, కనీస వసతులు లేని పరిస్థితులతో నిర్వచించేవారని, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. గతంలో గ్రామాల్లో కొద్ది ఇళ్లకే బ్యాంకు ఖాతాలు, మరుగుదొడ్లు, ద్విచక్ర వాహనాలు వంటి సౌకర్యాలు ఉండేవని, ప్రస్తుతం దాదాపు ప్రతి ఇంటికి బ్యాంకు ఖాతా, మరుగుదొడ్డి, ద్విచక్ర వాహనాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలు, రాజకీయ భేదాలకు అతీతంగా గ్రామస్థులు అభివృద్ధి కార్యక్రమాలకు తమ ఆశీర్వాదం అందించాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ డా. కే. కిరణ్మయి మాట్లాడుతూ, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు గ్రామీణాభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మహిళా సంఘాలకు వివిధ రంగాల్లో ఉపాధి, ఆర్థిక అవకాశాలు కల్పిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28.80 లక్షల మంది గ్రామీణ పేద మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా అనుసంధానమై ఉన్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 17,959 స్వయం సహాయక సంఘాలు, 58,600 మంది లఖ్‌పతి దీదీలు, రూ.535 కోట్ల పెట్టుబడితో 27,021 మహిళా ఆధ్వర్యంలోని సంస్థలు పనిచేస్తున్నాయని వివరించారు. ప్రజా పంపిణీ, ధాన్యం సేకరణ వంటి కార్యకలాపాల్లోనూ మహిళా సంఘాలు చురుకుగా భాగస్వాములవుతున్నాయని, జిల్లాలో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయం సహాయక సంఘాల మహిళలు నిర్వహిస్తూ విజయవంతంగా కార్యకలాపాలు చేపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా మహిళలకు రవాణా వాహనాలు, కుట్టు కేంద్రాల ద్వారా పాఠశాల యూనిఫారాల తయారీ, పశుసంవర్ధక తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో సహజ వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తున్నామని, మహిళా రైతులు ఇతర రైతులకు సహజ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. సహజ వ్యవసాయ పరికరాలను రైతులకు అందించే స్టార్టప్ సంస్థలు కూడా జిల్లాలో అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద జిల్లాలో 1,95,529 మంది రైతులకు 23 విడతల్లో రూ.709 కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందని, రైతుల నమోదు కార్యక్రమం ద్వారా 2,49,610 మంది రైతులను ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రైతులు, మహిళా సంఘాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి డిపిఓ సురేష్ మోహన్ పిడి డిఆర్డిఏ శ్రీలత, గ్రామ సర్పంచ్ అంజమ్మ, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వారణాసిలో చంద్రబాబు ప్రసంగానికి జేజేలు..

చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని వారణాసిలో మంగళవారం నిర్వహించిన 'వారణాసి-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమం నుంచి సాంకేతికత వరకు చోటుచేసుకున్న విప్లవాత్మక మార్పులను సమగ్రంగా వివరించారు.

*VKS మంత్రంతో అభివృద్ధి*

కాశీ క్షేత్రం ప్రధాని మోదీకి కర్మభూమి అని, ఇక్కడి ప్రజలు కేవలం తమ ఎంపీని మాత్రమే కాక, దేశానికి ఓ గొప్ప నాయకుడిని అందించారని చంద్రబాబు అన్నారు. "VKS (వాద్‌నగర్, కాశీ, సెప్టెంబర్) అనేది నేటి భారత అభివృద్ధి మంత్రం. ప్రధాని మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందుతున్నాయి. జల్ జీవన్ మిషన్, అమృత్ వంటి పథకాలతో 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కలిగింది. పీఎం కిసాన్ పథకం ద్వారా 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు అందుతోంది," అని వివరించారు. కరోనా మహమ్మారి సమయంలో 200 కోట్ల వ్యాక్సిన్ డోసులు ఉత్పత్తి చేయించి, 140 కోట్ల మంది ప్రజలను కాపాడటమే కాకుండా, 101 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మోదీ మానవత్వాన్ని చాటారని కొనియాడారు.

*టెక్నాలజీ నుంచి జాతీయ భద్రత వరకు*

ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి విధానాలతో ఒకప్పుడు రక్షణ పరికరాలు దిగుమతి చేసుకునే భారత్, ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరిందని చంద్రబాబు తెలిపారు. "టెక్నాలజీని పూర్తిస్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ. స్పేస్, డ్రోన్, క్వాంటం, సెమీ కండక్టర్ టెక్నాలజీలతో యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నారు. ఆయన దూరదృష్టితో దేశంలో 2.20 లక్షల స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయి. యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగారు," అని అన్నారు. మహిళా సాధికారతకు 'భేటీ బచావో-భేటీ పడావో', 'లఖ్‌పతీ దీదీ' వంటి పథకాలతో పాటు, చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి అధినియమ్' ఒక గేమ్ ఛేంజర్ కాబోతోందని అభిప్రాయపడ్డారు. దేశ భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశంసిస్తూ, "ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారు. దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని దాదాపు అంతమొందించారు. దానికి నేనూ ఒక బాధితుడినే. నక్సలైట్లు నన్ను టార్గెట్ చేశారు. కానీ మోదీ పాలనలో దేశం సురక్షితంగా ఉంది" అని చంద్రబాబు గుర్తుచేశారు.

*భవిష్యత్ ప్రణాళికలు, అయోధ్యలో శ్రీవారి ఆలయం*

దేశంలో నదుల అనుసంధానం కేవలం ప్రధాని మోదీతోనే సాధ్యమవుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "బ్రహ్మపుత్ర, గంగ, మహానది, గోదావరి, కావేరి నదులను అనుసంధానిస్తే భారత్ అభివృద్ధి అన్‌స్టాపబుల్ అవుతుంది," అని ఆయన అన్నారు. శతాబ్దాల కల అయిన అయోధ్య రామమందిర నిర్మాణాన్ని మోదీ నిజం చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా, "త్రేతాయుగ దైవమైన శ్రీరాముని జన్మస్థలం అయోధ్యలో, కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని భావిస్తున్నాం. ఇందుకు 10 ఎకరాల భూమి కేటాయించాలి" అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను వేదికపైనే కోరారు.

*ప్రసంగానికి విశేష స్పందన*

'ఆజ్ మే కాశీకే పవిత్ర ధర్తీ పర్ ఖడా హూ' అంటూ హిందీలో ప్రసంగాన్ని ప్రారంభించిన చంద్రబాబు, సభికులను తన ప్రసంగంలో భాగస్వాములను చేస్తూ ముందుకు సాగారు. 'దేశ్ బదల్ రహా హై, దేశ్ ఆగే బఢ్ రహా హై' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు సభికుల నుంచి పెద్ద ఎత్తున చప్పట్లు, హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. చంద్రబాబు ప్రసంగం ముగిశాక రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా స్పందిస్తూ, "చంద్రబాబు చాలా అద్భుతంగా మాట్లాడారు.. వెరీ వెల్.. వెరీ వెల్" అని ప్రశంసించి, ఆయనకు అభినందనగా చప్పట్లు కొట్టాలని సభికులను కోరారు. దీంతో రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ మొత్తం కరతాళ ధ్వనులతో మార్మోగింది. కార్యక్రమానికి ముందు చంద్రబాబు, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి కాశీ విశ్వనాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 'సేవా సంకల్ప్ యాత్ర'ను జెండా ఊపి ప్రారంభించారు.

## నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో ప్రపంచం గర్వించే తెలంగాణ నిర్మాణం

పాలనకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. రైతు కుటుంబాలను ఆదుకునే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ చేపట్టామని సీఎం తెలిపారు. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం కల్పించామని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించామని తెలిపారు. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.72 లక్షల కోట్లు ఖర్చు చేశామని, భూ భారతి చట్టం ద్వారా భూ పరిపాలనలో సంస్కరణలు చేపట్టామని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయపోరాటం కొనసాగుతోందని, పాలమూరురంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల పథకం, ఎస్-ఎల్‌బీసీ తదితర ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళలకు రూ.12,385 కోట్ల మేర ప్రయాణ ఖర్చు ఆదా అయిందని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం అందించామని వివరించారు. స్వయం సహాయక సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించామని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశామని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. సామాజిక అంతరాలను తగ్గించేందుకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే నిర్వహించామని తెలిపారు. సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించామని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టామని తెలిపారు. విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, పాలు అందించేందుకు రూ.927 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య రంగంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.19 లక్షల మందికి రూ.2,526 కోట్ల సాయం అందించామని వెల్లడించారు. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు. రాష్ట్రంలో 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశామని సీఎం చెప్పారు. యువతకు నూతన సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు. రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించామని, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టామని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నామని, ఆహార కల్తీని అరికట్టేందుకు టీజీ సేఫ్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. 2047 నాటికి తెలంగాణను రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం ప్రకటించారు. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్‌జీరో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్ వంటి ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల సహకారం అవసరమని కోరారు.

## సెప్టెంబరు 17 చరిత్రకు మతం రంగు పులిమే ప్రయత్నం

కల్వకుంట్ల కవిత అన్నారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు, త్యాగాల చరిత్రకు నిదర్శనమన్నారు. అయితే ఈ చారిత్రక రోజును కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ విలీనానికి స్టేట్ కాంగ్రెస్ పోరాటమే కారణమని సీఎం చెబుతున్నారని, అది వాస్తవం కాదని కవిత అన్నారు. సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని అప్పట్లో మహాత్మా గాంధీ చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. నిజాం ప్రభుత్వం పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని భారత యూనియన్‌లో విలీనం తర్వాత కాంగ్రెస్ తిరిగి జమీందార్లకు అప్పగించిందని ఆరోపించారు. బీజేపీ తీరుపైనా కవిత మండిపడ్డారు. ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా ఆనాటి చరిత్రకు మతం రంగు పులిమేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆ పోరాటం జరిగిన సమయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉనికిలోనే లేవని అన్నారు. జాగీర్దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాటం చేశారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి వారు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని గుర్తుచేశారు. కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినుద్దీన్ వంటి కవులు, రచయితలు తమ రచనలతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారని చెప్పారు. వారి స్ఫూర్తితో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వంటి వారు పోరాటంలో ముందుకు వచ్చారని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన కూడా కులమతాలకు అతీతంగా ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని కవిత అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు అంతం పలికే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ఆర్థిక వృద్ధిలో రికార్డ్.. సెమీకండక్టర్ రంగంలో దూకుడు..

ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దేశంపై అంతర్జాతీయ విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ వంటి కీలక రంగాల్లో చోటుచేసుకుంటున్న అభివృద్ధి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం సెమీకాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ప్రపంచం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇటీవలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. ఇది మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను చూపుతోంది. గడిచిన 15 రోజుల్లో జరిగిన పరిణామాలే దీనికి ఉదాహరణ" అని తెలిపారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపై చర్చ జరిగిందని, అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. ఈ కారిడార్లు దేశంలో సరుకు రవాణాను వేగవంతం చేసి, లాజిస్టిక్స్ రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా తయారీ రంగానికి కొత్త ఊపు ఇస్తాయని వివరించారు. సెమీకండక్టర్ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "భారత చిప్ పరిశ్రమ వేగంగా పుంజుకుంటోంది. త్వరలోనే 'భారత్ చిప్స్ ప్రపంచానికి వెళ్తాయి' అన్నది వాస్తవరూపం దాల్చనుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే ఒక ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు సావరిన్ రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం కూడా అంతర్జాతీయంగా మన దేశానికి ఉన్న ఆమోదాన్ని స్పష్టం చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'సెమీకాన్ 2.0' కార్యక్రమం ద్వారా దేశంలో సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఆరు కీలక స్తంభాలపై నిర్మిస్తున్నామని తెలిపారు. చిప్ డిజైన్, యంత్రాలు-ముడి పదార్థాలు, ఫ్యాబ్‌లు, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి ఇందులో భాగమని వివరించారు. సెమీకండక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలి దశలో 105కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయని, వాటిలో 20 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ ద్వారా రూ.800 కోట్ల నిధులను సమీకరించాయని మంత్రి వెల్లడించారు. సెమీకాన్ 2.0 కింద కనీసం 200 చిప్-డిజైన్ స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# రాహుల్ బలమా... బలహీనత

రాహుల్ గాంధీది భారత రాజకీయాల్లో ఒక నిలకడ లేని గ్రాఫ్! అది కొన్ని సార్లు పైకి, మరికొన్నిసార్లు కిందకి చలిస్తూ ఉంటుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ గెలుపు అవకాశాలు సదా అనిశ్చితిలో ఉంటున్నాయి. దాని ప్రతికూల ప్రభావం 'ఇండియా కూటమి' మీద పనిచేస్తోంది. రాహుల్ ప్రాధాన్యతలు, ప్రవర్తన, మిత్రులతో సయోధ్య వంటి అంశాలు ఈ మొత్తాన్ని ప్రభావితం చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మీడియా, సెఫాలజీ సంస్థల అంచనాలకు మించి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలతో ఏర్పడ్డ 'ఇండియా కూటమి' మెరుగైన ఫలితాలు సాధించింది. దేశంలోని 16 ముఖ్య సెఫాలజీ సంస్థలు ఇండియా కూటమి సంఖ్య 150 దాటదని జోస్యం చెప్పినా, 240 స్థానాలు పొంది ఎన్‌డిఎకు గట్టి పోటీ ఇచ్చింది. 400 సీట్ల వారి కలల్ని కల్లలు చేసి, 290కి పరిమితం చేసింది. కానీ, తర్వాత జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పక్షాలు దారుణంగా దెబ్బతిన్నాయి. సానుకూల ఫలితాలకు ఆస్కారమున్న మహారాష్ట్ర, హర్యానా, బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కూడా చతికిలపడ్డాయి. ఇందుకు ప్రధానంగా రాహుల్ ((గ్రాఫ్) నిలకడలేని తనమే కాకుండా మిత్రపక్షాలతో కాంగ్రెస్ అనుసరించే అస్పష్ట వైఖరి, వ్యూహ వైఫల్యాలూ కారణమే! ఇదంతా బిజెపికి, అది నేతృత్వం వహించే ఎన్‌డిఎకి పరోక్షంగా మేలు చేస్తోంది. 'మా స్టార్ క్యాంపెయినర్ రాహుల్ గాంధీయే' అనే కొందరు బిజెపి నేతల వ్యంగ్య వ్యాఖ్యల్లోని 'హాస్యం' కన్నా వాస్తవికతే జనాల్ని ఎక్కువ ఆలోచింపజేస్తోంది. రాహుల్ గాంధీ రాజకీయ ప్రగతి సూచీ స్థిరంగా ఉండకపోవడానికి ఆయన ప్రాధాన్యతలు, ప్రవర్తనే కారణమని మేధావులు, రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తారు. 2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఎక్కువ జనాదరణతో ఉన్నారు. 2019 ఎన్నికల ముందరితో పోల్చి చూస్తే, 2024 ముందర పలు సర్వేల జనాదరణలో ప్రధాని అభ్యర్థిగా మోడీకి కొంత సమీపంలోకి రాహుల్ రాగలిగారు. అప్పటికి దేశాన్ని చుట్టేస్తూ ఆయన అడ్డంగా, పొడువుగా రెండు పాదయాత్రలు చేసి ఉన్నారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా ఎండగడుతూ పార్లమెంటులో చక్కని, ప్రభావవంతమైన ప్రసంగాలు చేస్తున్నారు. ప్రధాని మోడీకి, పారిశ్రామికవేత్త అదానీకి వీడదీయరాని బంధముందని చేసిన పార్లమెంట్ ప్రసంగం ఆకట్టుకుంది. కానీ, ఆ స్థిరత్వం 2024 ఎన్నికల తర్వాత కొనసాగలేదు. మారిన రాజకీయాల్లో నాయకుల అటెన్షన్ 24/7 గంటలు ప్రజలు ఆశిస్తున్న తరుణంలో, రాజకీయ ప్రక్రియ నుంచి రాహుల్ తరచూ 'సెలవుల'పై వెళ్లడాన్ని జనం వింతగా చూస్తున్నారు. 'ఇతనికి సీరియస్‌నెస్ లేదు' అనే వ్యాఖ్య జనంలో తరచూ వినిపిస్తోంది. భారత్‌లో పరిస్థితుల్ని ఎత్తిచూపుతూ విదేశాల్లో చేసిన విమర్శలు, వివాదాస్పద వ్యాఖ్యలు ఆయన పలుకుబడిని, నిబద్ధతని కొంత ఇరకాటంలో పెట్టాయి. ఆ క్రమంలో కిందకు జారిపోయిన రాహుల్ 'ఇమేజ్ గ్రాఫ్' ఇటీవల మళ్లీ ఊర్ధ్వముఖంగా సాగుతోంది. పాలక ఎన్‌డిఎ ఎదుర్కొన్న కొన్ని విపరిణామాలు, 'పేపర్ లీక్, 'చందాచోర్' 'జిడిపి గ్రోత్ రేట్ వివాదం' వంటి వాటిపై ప్రతికూలంగా వచ్చిన విస్తృత ప్రజాభిప్రాయం బిజెపిని ఇరుకున పెట్టడమే కాకుండా కాంగ్రెస్, దాని మిత్రపక్షాల విమర్శలకు కొంత వెయిటేజీ పెంచింది.. ఒకప్పుడు కాంగ్రెస్‌కు ఎంతో దన్నుగా ఉండి, కాలక్రమంలో, ముఖ్యంగా 2014 తర్వాత క్రమంగా దూరమైన దళితవర్గాల్ని పూర్తిగా తమవైపు తిప్పుకునే ప్రయత్నం జరుగుతోంది. 'దేశంలోనే అతిపెద్ద విపక్ష పార్టీ అధినేత (మల్లికార్జున్ ఖర్గే) కే ఈ గతిపడితే, ఇక దేశంలో సామాన్య దళితుల సంగతేమిటి?' అని రాహుల్ ప్రశ్నిస్తున్నారు. ఖర్గే పాల్గొన్న సభా వేదికను 'శుద్ధీకరణ' పేరిట ప్రక్షాళన చేసిన 'బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, దళిత వ్యతిరేక భావజాలం' అంతా ఒకటే అని ఆయన ప్రచారం చేస్తున్నారు. ఆ వరుసలోనే, మహిళా బిల్లు కంటితుడుపు చర్య చేసి, అమలును నిర్లక్ష్యం చేస్తున్న ఎన్‌డిఎది పురుషాధిక్య 'మనుస్మృతి' భావజాలమని, వారు మహిళల రిజర్వేషన్ అమలు చేయరనే వాదనను ఆయన జనంలోకి తెస్తున్నారు. 'క్షాత్రోంకీ గూంజ్' విద్యార్థులు, యువజనుల సదస్సులకు హాజరై బిగ్గరగా వారి అనుకూల స్వరం వినిపించడం ద్వారా జన్-జీ. జన్- ఆల్ఫాను ఆకట్టుకునే ప్రయత్నం రాహుల్ చేస్తున్నారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు దూరమైన యువతను, ముఖ్యంగా కొత్త ఓటర్లను ఆకట్టుకుని, తమవైపు తిప్పుకునే వ్యూహంలో భాగమిది. తమ ఒత్తిడిపై దేశంలో కులగణనకు ఎన్‌డిఎ ప్రభుత్వం సిద్ధపడినా, ఒబిసిలకు న్యాయం చేయటం లేదనే విమర్శను కాంగ్రెస్ నాయకత్వం ఎత్తుకుంది. ఒబిసిలకు తాము అనుకూలమంటూ బిజెపి చేసుకునే ప్రచారం ఉత్తిదేనని, కులగణనలో ఎస్‌సి, ఎస్‌టిల మాదిరి బిసిలకు ప్రత్యేకంగా కాలమ్ పొందుపరచకపోవడాన్ని రాహుల్ తప్పుబడుతున్నారు. టిఎంసి, ఎన్‌సిపి, డిఎంకె, ఆప్.. తదితర పక్షాలతో, వివిధ రాష్ట్రాల్లో ఇది పలు సందర్భాల్లో రుజువయింది. సానుకూల వాతావరణంలో కూడా ప్రతికూల ఎన్నికల ఫలితాలకు ఈ సఖ్యత కొరవడటమే కారణం. ఇక ముఖ్యమైన ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాద్ (ఎస్‌పి) తో కాంగ్రెస్ సఖ్యత ఎలా ఉంటుంది? అన్నది కీలకం. 2029 సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందర అసెంబ్లీ ఎన్నికలు (ఫిబ్రవరి -2027) జరగాల్సిన యుపి ఏ రకంగా చూసినా ఇండియా కూటమికి ముఖ్యమైందే! 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌పి (36.6% ఓటు వాటా), కాంగ్రెస్ నేతృత్వపు యుపిఎ (2.33% ఓటు వాటా) విడివిడిగా పోటీ చేసి దెబ్బతిన్నాయి. 2024 లోక్ సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ఇండియా కూటమి, ఎస్‌పి 37, కాంగ్రెస్ 6, మొత్తం 43 ఎంపి స్థానాల (43.52% ఓటు వాటా) తో లబ్ధి పొందింది. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి వైఖరి అనుసరించనున్నారు? అన్నది కీలకం. ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్ పలు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. పిచ్‌డే- దళిత్- అల్పసంఖ్యాక్/ పిడిఎ వ్యూహం ఆయన చేతిలో అస్త్రంగా ఉంది. బలహీనవర్గాలు (పిచ్‌డే)కు తోడు 'పి' అంటే 'పండిట్' కూడా అని ఇటీవలే ఒక సభలో వివరణ ఇచ్చిన అఖిలేశ్, బ్రాహ్మణ వర్గానికి చేరువ కావాలని చూస్తున్నారు. హిందుత్వ వాదనకు ఎస్‌పి వ్యతిరేకం కాదనే భావన వచ్చేలా.. 'సనాతన ధర్మం' ఈ దేశంలో ఐక్యత సాధించిందని కితాబిచ్చారు. ఒక వేదిక నుంచి 'హనుమాన్ చాలీసా' చదివారు. 'ఇటావా' నియోజకవర్గ పరిధిలో అఖిలేష్ చైర్మన్‌గా ఉన్న ఒక ట్రస్ట్ నిర్మిస్తున్న కేదారేశ్వర్ ఆలయం 2027 ఎన్నికలకు ముందరే ప్రారంభం కానుంది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ వల్లెవేస్తున్న 'మనుస్మృతి' కాంగ్రెస్ అనుసరించే 'హిందూ వ్యతిరేక' వైఖరికి నిదర్శనమని చెప్పేందుకు బిజెపి ప్రచారాస్త్రమవుతుందా? యుపిలో ఇది అఖిలేశ్‌తో పొసగని పొత్తు వ్యూహమవుతుందా? కాంగ్రెస్ కొంచెం ఆలోచించుకోవాలి!.

# ఎర్రవల్లి భూముల్లో 'నిజం' ఎంత?

- సీఎం ఆదేశించిన మరుసటి రోజే రంగంలోకి రెవెన్యూ యంత్రాంగం
- ఫామ్‌హౌస్ చుట్టూ కొలతలురికార్డులపై ఆరా.. సర్వే నం.325పై ప్రత్యేక దృష్టి
- 295 ఎకరాల రికార్డు భూమి.. 388 ఎకరాల ప్రభుత్వ భూమిపై ఆరోపణ
- పాత రికార్డుల నుంచి శాటిలైట్ మ్యాపుల వరకు పరిశీలన
- 30 రోజుల్లో తేలనున్న లెక్క.. తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్




సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 17 : ఒకవైపు అసెంబ్లీలో ఆరోపణలు.. మరోవైపు మరుసటి రోజే రెవెన్యూ అధికారుల కదలికలు! మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంబంధించిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర భూముల వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లోనే కాకుండా రెవెన్యూ వర్గాల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. సెప్టెంబర్ 16న శాసనసభలో 22-ఏ భూములపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూములపై పలు ఆరోపణలు చేస్తూ సమగ్ర విచారణకు ఆదేశించారు. ఫామ్‌హౌస్ పరిధిలో వాస్తవంగా ఎంత పట్టా భూమి ఉంది? ప్రభుత్వ లేదా అసైన్డ్ భూమి ఎంత? రికార్డుల్లో మార్పులు జరిగాయా? అనే అంశాలను తేల్చి 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు జాతీయ, రాష్ట్రస్థాయి మీడియా సంస్థలు వెల్లడించాయి.

**ఆదేశాలు వచ్చాయి.. అధికారులు కదిలారు!**

ముఖ్యమంత్రి ప్రకటన వెలువడిన మరుసటి రోజే రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయి పరిశీలనకు దిగడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యత తెచ్చింది. గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, ఏడీ సుదర్శన్, మర్కూక్ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజుపూర్ ప్రాంతాలకు సంబంధించిన భూరికార్డులను పరిశీలిస్తున్నట్లు తాజా కథనాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా సర్వే నంబర్ 325 పరిధిలో ప్రభుత్వ/అసైన్డ్ భూమి ఎంత ఉందన్న అంశంపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. ఇది కేవలం కాగితాల పరిశీలనకే పరిమితం కాకుండా పాత భూరికార్డులు, గ్రామ సరిహద్దులు, ప్రస్తుత భౌతిక పరిస్థితిని సరిపోల్చే ప్రక్రియగా సాగుతున్నట్లు కథనాలు చెబుతున్నాయి.

**శాటిలైట్ మ్యాపులూ సాక్ష్యాలే!**

ఈ విచారణలో మరో ఆసక్తికర అంశం సాంకేతిక పరిజ్ఞానం వినియోగం. పాత శాటిలైట్ చిత్రాలు, గూగుల్ ఎర్త్ మ్యాపుల ఆధారంగా గతంలో భూమి ఎలా ఉండేది? ఇప్పుడు పరిస్థితి ఏమిటి? సరిహద్దుల్లో మార్పులు కనిపిస్తున్నాయా? అనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు ఆంధ్రజ్యోతి కథనం తెలిపింది. ప్రభుత్వ భూమి, పట్టా భూమికి సంబంధించిన వివరాలను కూడా సేకరిస్తున్నట్లు పేర్కొంది.

అంటే చివరకు తేలాల్సింది ఒక్కటే
రికార్డులో ఉన్న భూమి ఎంత?
క్షేత్రస్థాయిలో ఆధీనంలో ఉన్న భూమి ఎంత?
రెండింటి మధ్య తేడా ఉందా?
295 ఎకరాలు వర్సెస్ 388 ఎకరాలు!

ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారిన రెండు సంఖ్యలు 295 ఎకరాలు, 388 ఎకరాలు. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ప్రకారం, కేసీఆర్ కుటుంబ సభ్యుల పేర్లపై రికార్డుల్లో సుమారు 295 ఎకరాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అదే ప్రాంతంలోని సర్వే నం.325లో సుమారు 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాని పరిస్థితిని తేల్చాలని అధికారులను ఆదేశించారు.

**అయితే ఇక్కడ ఒక విషయం అత్యంత కీలకం.**

388 ఎకరాలూ కేసీఆర్ ఆక్రమించారని అధికారిక సర్వే ఇప్పటివరకు తేల్చలేదు. అది ముఖ్యమంత్రి చేసిన ఆరోపణ, ఇప్పుడు జరుగుతున్న విచారణలో నిర్ధారించాల్సిన అంశం. అందువల్ల తుది రెవెన్యూ నివేదిక వచ్చే వరకు దీనిని నిర్ధారిత ఆక్రమణగా పేర్కొనడం సముచితం కాదు.

**1944 రికార్డు నుంచి 1957 వివాదం వరకు..!**

ఈ భూవివాదానికి చారిత్రక నేపథ్యం కూడా ఉందని ముఖ్యమంత్రి అసెంబ్లీలో వివరించారు. ఆయన ప్రకటన ప్రకారం, 1944 నాటి సర్వే రికార్డుల్లో ఎర్రవల్లి గ్రామానికి ఆనుకుని 2,447 ఎకరాల భూమి ఉందని, పక్కనే శివార్ వెంకటాపూర్ గ్రామం ఉందని పేర్కొన్నారు. ఈ రెండు గ్రామాల సరిహద్దుల్లో సుమారు 295300 ఎకరాల భూమి ఏ గ్రామానికి చెందుతుందన్న వివాదం 1957 నుంచి కొనసాగుతోందని ఆయన చెప్పారు. 2017లో చేపట్టిన భూరికార్డుల నవీకరణ ప్రక్రియపైనా సీఎం ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణల నిజానిజాలు కూడా ప్రస్తుత విచారణలో పరిశీలించాల్సిన అంశాలే. 700 ఎకరాల ప్రశ్నకు సమాధానం ఎవరు చెబుతారు? ఫామ్‌హౌస్ పరిధి దాదాపు 700 ఎకరాలు ఉందన్నది ముఖ్యమంత్రి చేసిన మరో ప్రధాన ఆరోపణ. కేసీఆర్ కుటుంబానికి చట్టబద్ధంగా ఎంత భూమి ఉంది? ప్రభుత్వ భూమి అందులో కలిసిందా? ఉంటే ఎంత? అన్నది తేల్చాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

**ఇక్కడే ప్రస్తుత విచారణకు అసలు పరీక్ష ఎదురవుతుంది.**

కేవలం రాజకీయ ఆరోపణలతో కాకుండా సర్వే నంబర్ వారీగా విస్తీర్ణం, యాజమాన్య చరిత్ర, పహాణీలు, మ్యాపులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ప్రభుత్వ/అసైన్డ్ భూముల రికార్డులు, క్షేత్రస్థాయి హద్దులు సరిపోల్చినప్పుడే అసలు చిత్రం బయటపడుతుంది.

**30 రోజుల గడువు.. రాష్ట్రం ఎదురు చూస్తోంది**

ఈ వ్యవహారంపై అధికారులకు ముఖ్యమంత్రి 30 రోజుల గడువు విధించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి, ఎంత భూమి కొనుగోలు చేశారు? ఎంత ప్రభుత్వ భూమి ఉంది? అనే అంశాలను నిర్ధారించాలని ఆదేశించినట్లు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. అందుకే ఇప్పుడు రాజకీయ ఆరోపణల కంటే అధికారిక సర్వే నివేదికే కీలకం. తేలాల్సిన ప్రశ్నలు ఇవే కేసీఆర్ కుటుంబ సభ్యుల పేర్లపై చట్టబద్ధంగా నమోదైన భూమి మొత్తం ఎంత? సర్వే నం.325లో ప్రభుత్వ/అసైన్డ్ భూమి ఖచ్చితంగా ఎంత? అందులో ఏదైనా భాగం ఫామ్‌హౌస్ హద్దుల్లోకి వచ్చిందా? 2017 భూరికార్డుల నవీకరణలో ఏమైనా మార్పులు జరిగాయా? అవి చట్టబద్ధమేనా? పాత మ్యాపులుప్రస్తుత క్షేత్రస్థాయి హద్దుల మధ్య తేడా ఉందా? చివరకు ప్రభుత్వం పేర్కొంటున్న 388 ఎకరాలపై యాజమాన్యం ఎవరిది? ఈ ప్రశ్నలకు రాజకీయ వేదికలపై వచ్చే ఆరోపణలు కాదురెవెన్యూ రికార్డులు, సర్వే మ్యాపులు, చట్టబద్ధ పత్రాలే సమాధానం చెప్పాలి.

# ఎస్.సి, ఎస్ టి .ల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## - రాష్ట్ర ఎస్ సి ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**ఎస్.ఎస్.టి సబ్‌ప్లాన్ నిధులను నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించాలి**

**రోస్టర్, రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి**




మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర) భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎస్.సి.,ఎస్.టి సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, ఉద్యోగుల పదోన్నతులు, నియామకాల్లో రోస్టర్ పాయింట్ల అమలు, రిజర్వేషన్ల తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్,కొంకటి లక్ష్మీనారాయణలతో కలిసి జిల్లా అధికారులతో ఎస్.సి, ఎస్.టి.లకు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ముఖ్యంగా ఎస్.సి.ఎస్.టి సబ్‌ప్లాన్‌కు సంబంధించిన నిధులను నిబంధనల ప్రకారం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సబ్‌ప్లాన్ నిధులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర అవసరాలకు మళ్లించకుండా వారి ఆవాస ప్రాంతాలలోనే ఆయా సామాజిక వర్గాల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో (గూఎఅఅఅర్తీక్అజవ ఝఅవ్అశీఅం), ఇంజినీరింగ్ అనుమతులు తదితర ప్రక్రియల్లో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనుల అమలులో లోపాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు ఇంజనీరింగ్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆర్అండ్‌బీ, ఇంజినీరింగ్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ తదితర శాఖల పనులను నిర్దేశిత ప్రమాణాలు, నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు సానుకూలంగా, మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు. ప్రజా సంక్షేమం, ప్రజా సేవకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అధికారులు పనిచేయాలని అన్నారు. తరతరాలుగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పేద వర్గాల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి, న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

**సంక్షేమ మౌలిక వసతులకు ప్రాధాన్యత**

ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి సంబంధించిన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని చైర్మన్ సూచించారు. అవసరమైన చోట అంగన్‌వాడీ భవనాలు, భవనాలు, మౌలిక వసతుల పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు.వి.బి.జి రామ్ కింద చేపట్టే పనుల్లో గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ కనెక్షన్, ఫ్యాన్లు, లైట్లు వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చేరేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**సివిల్ రైట్స్ డే సమావేశాలకు అధికారులు హాజరుకావాలి**

ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న ఎస్.సి.,ఎస్. టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీలను కమిషన్ చైర్మన్ అభినందించారు. అయితే సివిల్ రైట్స్ డే సమావేశాల్లో సంబంధిత అధికారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సివిల్ రైట్స్ డే సమావేశాలకు తహసీల్దార్లు, పోలీస్ శాఖ నుంచి సంబంధిత ఎస్ఐలు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా స్థాయిలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్, ఎస్పీలను కోరారు. సంబంధిత అధికారులు గైర్హాజరై వారి స్థానంలో కింది స్థాయి సిబ్బందిని పంపితే సమావేశాల ఉద్దేశం నెరవేరదని అన్నారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను కేవలం ఎస్సీ కాలనీలు, తండాలు లేదా ఒక వర్గానికే పరిమితం చేయకుండా గ్రామంలోని అందరికీ అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నిర్వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణ, సామాజిక గౌరవం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

**సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం**

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు అవగాహన కల్పించాలని కోరారు. విదేశీ విద్యా పథకం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, అంతర్‌కుల వివాహ ప్రోత్సాహకం, భూమి కొనుగోలు పథకం తదితర పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. మూఢనమ్మకాలను విడనాడి విద్య, ప్రభుత్వ పథకాల ద్వారా అభివృద్ధి సాధించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

**రోస్టర్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలి**

ప్రతి ప్రభుత్వ శాఖలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన రోస్టర్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించి, రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని చైర్మన్ సూచించారు. నియామకాలు, పదోన్నతులు తదితర అంశాల్లో రిజర్వేషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో బ్యాక్‌లాగ్ ఖాళీలు ఉన్నట్లయితే వాటికి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపట్టాలని ఆదేశించారు.

**పేద ఎస్సీల భూములకు మౌలిక వసతులు**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి అనుసూచిత్ అభ్యుదయ యోజన (ఫీఎంజీఏ) పథకం కింద పేద ఎస్సీ వర్గాలకు కేటాయించిన రెండు ఎకరాల వరకు ఉన్న భూమి కొనుగోలు పథకం కింద కొనుగోలు చేసిన భూములకు బోర్‌వెల్స్, పంపుసెట్లు, విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఎం.పి.డి.ఓ ల ద్వారా ఎస్.సి.కార్పొరేషన్ ఈ.డి.కి వెంటనే పంపించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ కేసులకు సంబంధించిన పరిహారం, అంతర్‌కుల వివాహ ప్రోత్సాహకం, విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ తదితర పథకాలకు జిల్లాలో అవసరమైన నిధులు, పెండింగ్ అంశాల వివరాలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని రిపోర్ట్ పంపించాలని సూచించారు సెప్టెంబర్ 22న ముఖ్యమంత్రితో జరిగే రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ అంశాలను ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

**ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలి**

ఎస్సీ, ఎస్టీల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా మానవతా దృక్పథంతో పరిష్కరించాలని చైర్మన్ కోరారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలతో మర్యాదగా, గౌరవంగా వ్యవహరించాలని ఎస్పీని కోరారు. ఫిర్యాదుదారులను కూర్చోబెట్టి వారి సమస్యలను ఓపికగా తెలుసుకుని, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటే బాధితుల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు.

**శాఖల వారీగా సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష**

సమావేశంలో ముందుగా వివిధ శాఖల జిల్లా అధికారులు ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను కమిషన్ సభ్యులకు వివరించారు. జిల్లా పోలీస్ శాఖ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 22 కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. వాటిని వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అడ్మిషన్లు, వారికి కల్పిస్తున్న వసతుల వివరాలను అధికారులు తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యలక్ష్మి పథకం, పోక్సో బాధితులకు అందిస్తున్న సహాయ సహకారాలు, వికలాంగులకు అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి సంబంధిత అధికారి వివరించారు. జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి, ముఖ్య ప్రణాళిక అధికారి తమ శాఖల్లో ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న పథకాలు, వాటి పురోగతిని కమిషన్ సభ్యులకు వివరించారు. మెప్మా, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్, వివిధ మున్సిపాలిటీల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన కార్మికులకు అమలు చేస్తున్న బీమా సదుపాయాల గురించి చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కార్మికులకు వేతనాలను సకాలంలో చెల్లించాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వి.బి.జీ. రామ్‌జీ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు అందించిన జాబ్ కార్డులు, వారికి కల్పించిన పని దినాలకు సంబంధించిన వివరాలను అధికారులు వివరించారు. జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై కూడా అధికారులు వివరించారు.

**డి.వి.ఎం.సి సభ్యుల సూచనలు**

సమావేశంలో పాల్గొన్న డీవీఎంసీ సభ్యులు ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అట్రాసిటీ కేసుల గణాంకాలు, పెండింగ్ పరిహారం, పోక్సో కేసుల వివరాలను 2014 నుంచి ప్రామాణిక రూపంలో అందించాలని కోరారు. వైద్య విద్యలో నకిలీ ధ్రువపత్రాలు, కేటగిరీ మార్పులపై విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని, అట్రాసిటీ కేసులో మృతుడి కుటుంబానికి ఉద్యోగం కల్పించడం, ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణ సహాయం పెంపు, సబ్‌ప్లాన్ నిధుల సమర్థ వినియోగంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా పురోగతిపై తదుపరి సమావేశంలో నివేదిక సమర్పించాలని కోరారు. చివరగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సమావేశానికి హాజరైన పిటిషనర్ల నుంచి వారి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి. జానకి, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్వో నిర్మల, జిల్లా ఎస్సీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి సునీత,, జిల్లా అధికారులు, ఎం.పి.డి.ఓ.లు,తహశీల్దార్ లు,మున్సిపల్ కమిషనర్ లు,పబ్లిక్,అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, పిటిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నాలుగవ రోజు గణనాధునికి ప్రత్యేక పూజలు



కాప్రా/సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : కాప్రా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాధునికి గురువారం నాలుగవ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె. సీతారాంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాప్రా ప్రెస్ క్లబ్‌లో వరుసగా రెండవ సంవత్సరం గణనాధుని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు తెలియజేయడమే కాకుండా, ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావడం ప్రశంసనీయమని అన్నారు. గణనాధుని ఆశీస్సులతో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదర భావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. జర్నలిస్టులు తమ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజంలో సానుకూల మార్పుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు, భక్తులు పాల్గొని గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్ర మోహన్, సలహాదారులు బెలిదె అశోక్, ఎంపల్లి పద్మారెడ్డి ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు శనిగరం అశోక్, పటేల్ నరసింహ, మాజీ కోశాధికారి యాట రాజు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, ఉపాధ్యక్షులు యావాపురం రవి, గోవిందుకుంట్ల ఆంజనేయులు, కోశాధికారి రామచంద్ర మూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు తొడుపునూరు బాలకృష్ణ, నరేష్ నాయి, మధు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడి పూజలో అఖిలేష్..!



కాప్రా/సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : చిక్కడపల్లి వివేక్ నగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శంఖ చక్ర వరసిద్ధి వినాయకుడి కి పూజలు చేస్తున్న జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి, సాక్షి సీనియర్ జర్నలిస్ట్ చిలుకూరి అఖిలేష్

## జిల్లా అదనపు కలెక్టర్ ను మర్యాదపూర్వకముగా కలిసిన కాగజ్ నగర్ సబ్ కలెక్టర్



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17,(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన హర్ష చౌదరి గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ ను మర్యాదపూర్వకముగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కాగజ్ నగర్ డివిజన్ లో భూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో మమేకమై, నిబంధనలకు లోబడి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ సేవలు అందించాలని తెలిపారు.

## సమాజ నిర్మాణంలో విశ్వకర్మల పాత్ర ఎంతో విశిష్టమైనది

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17,(విజన్ ఆంధ్ర ) : సమాజ నిర్మాణంలో విశ్వకర్మ పాత్ర ఎంతో విశిష్టమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి లతో కలిసి హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ పురాణాలు, ఇతిహాసాలు, సంప్రదాయాలలో విశ్వకర్మను దైవ శిల్పిగా, నిర్మాణకర్తగా గౌరవిస్తారని తెలిపారు. అనేక దివ్య నిర్మాణాలు, ఆయుధాలు, నగరాలు, శిల్పాలను రూపొందించినవారిగా పురాణాలలో విశ్వకర్మ ప్రస్తావన ఉందని, భారతీయ శిల్పకళ, వాస్తుకళ, నిర్మాణ నైపుణ్యాల సంప్రదాయానికి ప్రతీకగా భావిస్తారని తెలిపారు. విశ్వకర్మ సమాజానికి చెందిన వృత్తిదారులు వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, కంచరి, శిల్పకళ తదితర సంప్రదాయ వృత్తులను కొనసాగిస్తూ సమాజానికి అవసరమైన వస్తువులు, పనిముట్లు, నిర్మాణాలు, కళాఖండాలను రూపొందిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నిర్మాణ రంగంతో పాటు వివిధ వృత్తులు, కళలు కాలానుగుణంగా ఎంతో అభివృద్ధి చెందాయని, నేటి తరం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని తెలిపారు. సంప్రదాయ కళలు, వృత్తులను పరిరక్షించడంతో పాటు కొత్త కళలు, నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు వంటి సాంకేతిక, వృత్తి విద్యా సంస్థల ద్వారా అందిస్తున్న శిక్షణా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.డి.సి.పి. మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో వివిధ వృత్తుల వారి సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. సంప్రదాయ వృత్తులను కొనసాగిస్తూ సమాజానికి సేవలందిస్తున్న విశ్వకర్మ వృత్తిదారుల పాత్ర అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు, వృత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈల గ్రీనింగ్‌కు క్లీన్‌టెక్ కీలకం



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : భారతదేశాన్ని నెట్-జీరో ఆర్థిక వ్యవస్థ వైపు తీసుకెళ్లేందుకు ఎనర్జీ ఎఫిషియెన్సీ, విద్యుదీకరణ, క్లీన్‌టెక్, డిజిటల్ పరిష్కారాలపై హైదరాబాద్‌లో జరిగిన సిఐఐ 25వ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్-2026లో చర్చించారు. పరిశ్రమలు విద్యుదీకరణ, ప్రాసెస్ మెరుగుదల, వ్యర్థ ఉష్ణ పునరుద్ధరణ, ఏఐ, ఎల్‌ఓటీ, డిజిటలైజేషన్ రంగాల్లో రూ.3,590 కోట్ల పెట్టుబడులకు కట్టుబడ్డాయి. బిఈఈ డైరెక్టర్ జనరల్ కృష్ణ చంద్ర పాణిగ్రాహి ఎనర్జీ ఎఫిషియెన్సీ, విద్యుదీకరణ కీలకమని పేర్కొనగా, సిఐఐ సమ్మిట్ చైర్మన్, బిఎల్పీ-ఇండస్ట్రీ ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ తేజ్‌ప్రీత్ సింగ్ చోప్రా ఎంఎస్ఎంఈలకు ఏఐ, డిజిటల్ టెక్నాలజీలతో శక్తి సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. సిఐఐ గోద్రెజ్ జీబీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి.కిరణ్ అనంత్ గత మూడేళ్లలో 720 పరిశ్రమలు రూ.5,700 కోట్ల పెట్టుబడులతో రూ.7,100 కోట్లకు పైగా పొదుపు సాధించాయని తెలిపారు. సమ్మిట్‌లో సిఐఐ-బీఈఈ సంయుక్తంగా ‘ఇండియన్ హీట్ పంప్ అట్లాస్‘ను ఆవిష్కరించారు.

## ఏఐతో మానవ మేధస్సు కలయికే భవిష్యత్ నాయకత్వం



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్(ఐడబ్ల్యుఎన్) తెలంగాణ 12వ లీడర్‌షిప్ కాంక్లేవ్ ‘పవర్ ఆఫ్ ఏఐ : ఓన్ యువర్ ఐ‘ను హైదరాబాద్‌లో నిర్వహించింది. తెలంగాణ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కార్యదర్శి హరిచందన దాసరి, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ ఎం.గౌతమ్ రెడ్డి, సైయంట్ వ్యవస్థాపక ఛైర్మన్, బోర్డు సభ్యుడు డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి ప్రసంగించారు. మహిళల శ్రామిక భాగస్వామ్యం, సమ్మిళిత వృద్ధి, ఏఐతో కొత్త నైపుణ్యాల అవసరాన్ని వక్తలు వివరించారు. ఏఐని మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా దానికి బలాన్నిచ్చే సాధనంగా వినియోగించాలని డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి అన్నారు. ఐడబ్ల్యుఎన్ తెలంగాణ ఛైర్‌వుమన్ సోనియా శ్రీకాంత్ స్వాగతం పలుకగా, వైస్ చైర్‌వుమన్ తనుజ అబ్బూరి కృతజ్ఞతలు తెలిపారు.

## అలంపూర్ రైతులకు సాగునీరు అందించాలి

**- జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను కలిసి చర్చించిన ఎమ్మెల్యే విజయుడు**



గద్వాల సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో) : అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు గురువారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తో , ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) తో రైతులతో కలిసి సమావేశమై నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ జూరాల మెయిన్ కెనాల్‌తో పాటు నెట్టెంపాడు 100, 106 ప్యాకేజీల పరిధిలోని రైతులకు ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు, సాగు చేయనున్న పంటలకు అవసరమైన మేరకు నీటిని అందించాలని జిల్లా కలెక్టర్ తో, ఇరిగేషన్ శాఖ అధికారులకి విన్నవించారు. రైతులు వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులు తిరిగి పొందడంతో పాటు పంటల ద్వారా లాభాలు పొందేలా సకాలంలో పంటలకు అవసరమైన సాగునీరు అందించాలని అధికారులను కోరారు. రైతుల సాగునీటి సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జ్ఞాన భారతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలో జ్ఞాన భారతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జ్ఞాన భారతం సంబంధిత జిల్లాస్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ అధికారులు, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, అరుదైన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి భద్రపరచే ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రంథాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, మఠాలు, పరిశోధనా సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, చారిత్రక ప్రాధాన్యత కలిగిన మాన్యుస్క్రిప్ట్‌లను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో గుర్తించి భద్రపరిచే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ప్రజల వద్ద ఉన్న అరుదైన గ్రంథాలు, పాత పత్రాలు, తాళపత్ర గ్రంథాల సమాచారాన్ని అధికారులకు అందించాలని తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు, నాగరికత సంబంధిత గ్రంథాలు, ఇన్స్క్రిప్షన్స్ , శిలా శాసనాలు సంబంధిత పత్రాలు ఎవరి దగ్గరైనా ఉన్నట్లయితే జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు సమర్పించాలని తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సంబంధిత కళాశాలల విద్యార్థులకు జ్ఞాన భారతం కార్యక్రమం సంబంధించి అవగాహన కల్పించి, జిల్లాలోని మారుమూల ప్రాంతాల సంబంధిత గ్రంథాలు ఏమైనా ఉన్నట్లయితే వారి ద్వారా సేకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పురాతన దేవాలయాలు, మసీదులు, చర్చిలలో అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలను కుల, మత, వర్గ భేదాలకతీతంగా సమాచారాన్ని అందించాలని, సంబంధిత పత్రాలను డిజిటలైజేషన్ చేసి భద్రపరచడం జరుగుతుందని, తద్వారా జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయాలు, స్థానిక వారసత్వానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ గొప్పతనాన్ని చాటేందుకు జ్ఞాన భారతి కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను శాస్త్రీయ పద్ధతులలో డిజిటలైజేషన్ చేసి, వాటి సమాచారాన్ని రక్షించడం జరుగుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కేంద్రీకృత ప్రదేశంలో భద్రపరిచి, కేంద్రీకృత డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన భారతం జిల్లా స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అంజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**- కృష్ణా నది నిమజ్జన ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ**




మాగనూర్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. కృష్ణ మండల పరిధిలోని కృష్ణా నది వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం నిర్వహించే ప్రదేశాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... నిమజ్జనం సమయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నది వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ప్రదేశంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేసి, నిరంతరం ప్రజలకు భద్రతా సూచనలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణా నది వద్ద నీటి ప్రవాహం, లోతు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా ఫైర్ సిబ్బంది, ఎలక్ట్రికల్ శాఖ అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు.గణేష్ విగ్రహాలు నిమజ్జన ప్రదేశానికి చేరుకునే సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్, బారికేడింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. భారీ విగ్రహాలు పెద్ద సంఖ్యలో కృష్ణా నది వరకు వచ్చే అవకాశం ఉన్నందున, ఆయా మార్గాల్లో క్షేత్రస్థాయిలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. “ఒక నిండు ప్రాణం ఎంతో విలువైనది. నిమజ్జనం సందర్భంగా చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరి భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి అపశృతి జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి” అని ఎస్పీ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు కూడా పోలీసు అధికారులు సూచించే భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నది లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కోరారు.నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా రిసోర్స్‌లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద గణేష్ విగ్రహాలు కృష్ణా నది వద్దకు వచ్చే అవకాశం ఉన్నందున, నిమజ్జన మార్గాలు, నది పరిసర ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ పాయింట్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. గణేష్ నిమజ్జనం శాంతియుతంగా, భక్తి భావంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సురక్షితంగా పూర్తయ్యేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతుందని ఎస్పీ తెలిపారు. ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్ నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్ ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐ లు నవీద్, భాగ్యలక్ష్మి రెడ్డి, లోకల్ ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## వినాయక నిమజ్జనానికి కృత్రిమ బేబీ కుంటలను వినియోగించాలి

**- ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**





మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర): వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, తమకు సమీపంలో ఏర్పాటు చేసిన కృత్రిమ బేబీ కుంటలను వినియోగించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. చిన్న, మధ్య తరహా వినాయక విగ్రహాలను ఆయా కృత్రిమ కుంటల్లో నిమజ్జనం చేసి జిల్లా యంత్రాంగం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జిల్లాలో వినాయక చవితి వేడుకలు శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు ఎండిపోవడంతో మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జడ్చర్ల, దేవరకద్ర, భూత్పూర్ మున్సిపాలిటీల పరిధిలో కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో అప్పన్నపల్లి సమీపంలోని మయూరి పార్క్ ఎదురుగా గంగోస్కుంట వద్ద రెండు పెద్ద కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. పంచవటి స్కూల్ సమీపంలోని పార్క్ స్థలంలోనూ కృత్రిమ కుంటలను ఏర్పాటు చేశారు. చిన్న, మధ్య తరహా విగ్రహాల నిమజ్జనానికి అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఐదు అడుగులకు పైగా ఎత్తు ఉన్న పెద్ద గణపతి విగ్రహాలను బైపాస్ రోడ్డు సమీపంలో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన వాహనాల వద్దకు తీసుకురావాలని అధికారులు సూచించారు. అక్కడి నుంచి ప్రభుత్వ వాహనాల్లో విగ్రహాలను బీచుపల్లికి తరలించి నిమజ్జనం చేయనున్నారు. మహబూబ్‌నగర్ సమీపంలోని చిన్నదర్పల్లి చెరువులోనూ వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో స్టేషన్ రోడ్‌లోని చర్చి సమీపంలో బేబీ కుంటను ఏర్పాటు చేశారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కార్యాలయం వద్ద, బీసీ హాస్టల్ వెనుక ఉన్న మూడో వార్డు పార్కులో, 8వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్ తండాలోనూ కృత్రిమ బేబీ కుంటను ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజలు జిల్లా యంత్రాంగం సూచించిన నిబంధనలను పాటిస్తూ, తమకు సమీపంలోని కృత్రిమ బేబీ కుంటలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. కృత్రిమ కుంటలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఆమె సూచించారు.

## అట్టహాసంగా యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు

**-సమాజ నిర్మాణంలో విశ్వకర్మల పాత్ర కీలకం**

**-ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్-17(విజన్ ఆంధ్ర) : సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ ఉత్సవ వేడుకలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, డిసిపి రాంరెడ్డి లతో కలిసి విశ్వకర్మ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ,సమాజ నిర్మాణంలో విశ్వకర్మల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రాచీన కాలం నుంచి తమ నైపుణ్యం, శ్రమ, సృజనాత్మకతతో సమాజ అభివృద్ధికి విశ్వకర్మలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశ్వకర్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విరాట్ విశ్వకర్మను దైవస్వరూపంగా భావిస్తూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రాచీన కాలం నుంచే విశ్వకర్మలు తమ అద్భుతమైన నైపుణ్యంతో కళలు, వృత్తులు, నిర్మాణ రంగాలకు విశిష్ట సేవలు అందించారని తెలిపారు. వారి నైపుణ్యం, కృషి, సేవలను భావితరాలకు తెలియజేసేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని అన్నారు. విశ్వకర్మ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విశ్వకర్మ కుల సంఘ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో ఘనంగా మెగా రక్తదాన శిబిరం



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రత్యేక మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డా. కొత్తపల్లి శ్రీనివాస్ హాజరై కేక్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన రక్తదాతలకు జీవన్‌ధార స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని అన్నారు. మనం చేసే చిన్న సహాయం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఒకరి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా సమాజానికి ఎంతో విలువైన సేవ అందించినట్లవుతుందని తెలిపారు. రక్తదాతల సేవాభావాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత, బీజేపీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎలగాతి సుచిత్, ఆర్మీ శివ, కౌన్సిలర్ రవి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలందరికీ, కిమ్స్ హాస్పిటల్ సిబ్బందికి, కార్యక్రమ నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని కోరారు.

## పాంచజన్యసంకల్ప సభను విజయవంతం

**- ఈ నెల 20న కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో బహిరంగ సభ.**



నారాయణపేట, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర నాయకులు, గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గంగొళ్ల రంజిత్ కుమార్, నారాయణపేట జిల్లా అధ్యక్షులు, నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గవినొళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సభకు పార్టీ అధ్యక్షురాలు కవిత అక్క ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ ప్రజలకు పార్టీ సిద్ధాంతాలు, ఆలోచనలు, భవిష్యత్ కార్యాచరణను వివరించనున్నట్లు వారు తెలిపారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉద్యోగఉపాధి కల్పన, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం తదితర అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ పాంచ జన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు.తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని, పార్టీ అధ్యక్షురాలు కవిత అక్కను ముఖ్యమంత్రి చేసే లక్ష్యంతో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సభకు నారాయణపేట జిల్లా ప్రజలు, కొడంగల్ నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని గంగొళ్ల రంజిత్ కుమార్, గవినొళ్ల శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిబాబు, పల్లెబండ నర్సిములు, దామరగిద్ద మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ కాందేనపల్లి జి. శ్రీనివాస్ గౌడ్, మొగలమడక అనిల్ కుమార్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యం

**- ప్రతి రోజూ ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించాలి**

**- జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా 'ప్రజాపాలన దినోత్సవం'**

**- జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్పీ సునితారెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర) : ప్రజల రక్షణ, నిరంతర సేవలందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని వనపర్తి జిల్లా ఎస్పీ సునితారెడ్డి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ ప్రజాపాలన స్ఫూర్తిని చాటాలని, బాధితుల సమస్యలను సానుభూతితో విని చట్టపరంగా పరిష్కరించాలని సూచించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ, అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. శాతవాహనులు, కాకతీయుల పాలనతో తెలంగాణ ప్రాంతం చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ భారతదేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి అడుగుపెట్టిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ ఈ ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని తెలిపారు.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి : ప్రభుత్వ సేవలను ప్రతి పల్లెకు, ప్రతి ఇంటికీ చేరవేయడమే ప్రజాపాలన ప్రధాన లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీసులు ప్రతిరోజును ఒక సేవా దినంగా భావించి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. బాధితుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేయాలని ఆదేశించారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ సునంద, సీఐలు సుగంధ రత్నం, రమేష్, నరేష్, ఆర్ఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్, పలువురు ఎస్సైలు, పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

**- వనపర్తిలో ఘనంగా 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'**

**- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి**

**- హాజరైన కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎస్పీ సునీతారెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర) : ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి అజెండాతో ప్రజలకు బాధ్యతాయుతమైన పాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో నిర్వహించిన 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ' వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1948 సెప్టెంబరు 17న తెలంగాణ ప్రాంతం ఆపరేషన్ పోలో ద్వారా ఇండియన్ యూనియన్‌లో విలీనమై రాచరికం నుంచి ప్రజాస్వామ్యంలోకి అడుగుపెట్టిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు.

### మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 3.84 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, ఇందుకు ప్రభుత్వం రూ.161.16 కోట్లు వెచ్చించిందని తెలిపారు. రూ.500 కే గ్యాస్ సిలిండర్ పథకం కింద 85,383 మందికి 5.12 లక్షల సిలిండర్లు అందించగా, రూ.15.71 కోట్ల సబ్సిడీ భరించిందన్నారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.7.72 కోట్లు, పురపాలక పరిధిలో రూ.3.16 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రూ.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన జిల్లా మహిళా సమాఖ్య భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు.

### రైతన్నకు భరోసా – సాగునీరు

రైతు భరోసా కింద 2026 వానాకాలం సీజన్‌లో 1,82,768 మంది రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున రూ.212.32 కోట్లు జమ చేశామన్నారు. రైతు బీమా ద్వారా 702 కుటుంబాలకు రూ.35.10 కోట్లు అందించామని చెప్పారు. రూ.76.19 కోట్లతో కర్నేతండా ఎత్తిపోతల పథకం పూర్తి చేసి 4,235 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 38% లోటు వర్షపాతం నమోదైనందున ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలపై ఏఐ (ఆ×), కరపత్రాల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 90% రాయితీతో 1,127 క్వింటాళ్ల మినుములు పంపిణీ చేశామన్నారు.

### విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

రూ.200 కోట్ల అంచనాతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల భవనాలకు రూ.47.50 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచగా, జిల్లాలో జనవరి 1 నుంచి ఇప్పటి వరకు 6,816 మందికి రూ.22.14 కోట్లతో ఉచిత వైద్యం అందించామన్నారు. వనపర్తి జిల్లా ఆసుపత్రి నిర్మాణానికి రూ.203.95 కోట్లు కేటాయించామని, 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు – సంక్షేమం జిల్లాలో మంజూరైన 5,874 ఇందిరమ్మ ఇళ్లలో 92% నిర్మాణాలు పూర్తయ్యాయని (రూ.170.84 కోట్లు ఖర్చు), ఇందులో జిల్లా రాష్ట్రంలోనే 13వ స్థానంలో ఉందన్నారు. గృహజ్యోతి కింద 85,423 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ రూ.62.60 కోట్ల సబ్సిడీ ఇచ్చామని తెలిపారు. చేయూత పింఛన్ల కింద 70,342 మందికి నెలకు రూ.16.33 కోట్లు అందిస్తున్నామన్నారు. 1.83 లక్షల కార్డుదారులకు మూడు నెలల సన్నబియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి తీసుకొచ్చిన 'భూ భారతి' ద్వారా జిల్లాలో వచ్చిన 12,851 దరఖాస్తుల్లో 11,403 పరిష్కరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, వినోద్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# చేతివృత్తులకు విశ్వకర్మే ఆద్యుడు

**- శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**

**- కలెక్టరేట్‌లో ఘనంగా భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి**

**- హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్, ఎస్పీ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర) : సమస్త చేతివృత్తులకు భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మే ఆద్యుడని శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహేందర్ రెడ్డి, విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హిందూ పురాణాలతో పాటు ఋగ్వేదం, కృష్ణ యజుర్వేదంలో విశ్వకర్మను సృష్టికర్తగా పేర్కొన్నారని గుర్తుచేశారు. మానవాళి వికాసానికి, సమస్త వృత్తుల నైపుణ్యానికి ఆయనే మూలపురుషుడని కొనియాడారు. కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డిలతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు మరియు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గణనాథుల నిమజ్జనానికి పటిష్ట భద్రత

**- రంగాపూర్ కృష్ణానది తీరంలో ఏర్పాట్ల పరిశీలన**

**- పోలీసు సూచనలు తప్పనిసరిగా పాటించాలి**

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర) : వినాయక నిమజ్జనోత్సవం ప్రశాంత వాతావరణంలో, సురక్షితంగా జరిగేలా పటిష్ట ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగాపూర్ కృష్ణానది బ్రిడ్జి వద్ద నిమజ్జనం కోసం గుర్తించిన ప్రదేశాన్ని గురువారం డీఎస్పీ గిరిబాబు, ఇతర అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు. కృష్ణానదిలో నీటి మట్టం తక్కువగా ఉన్న నేపథ్యంలో, విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలు మరియు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నీటి మట్టం, నదీ తీర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర ప్రాంతాల్లోకి భక్తులు వెళ్లకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలి. విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలు నిమజ్జన ఘాట్ వరకు సులభంగా చేరుకునేలా మార్గాలను సరిదిద్దాలి. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసులు ఎప్పటికప్పుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి. భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు శాఖ జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేయాలన్నా రు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ ఓ.డి. రమేష్, పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్, శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ చట్టాలపై రైతులు అవగాహన పెంచుకోవాలి

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే. దీప**




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : ప్రతి ఒక్కరూ వ్యవసాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే. దీప సూచించారు. వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సమాజంలో ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు బాధ్యతలను కూడా క్రమం తప్పకుండా నిర్వర్తించాలని పేర్కొన్నారు. సదస్సులో భాగంగా గృహ హింస నిరోధక చట్టం, తల్లిదండ్రుల సంరక్షణ చట్టం మరియు బాల్యవివాహాల నిర్మూలన చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలతో పాటు ఏడాదికి రూ. 3 లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్న పేదలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని కార్యదర్శి తెలిపారు. అర్హులైన బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ పుష్పలత, పారా లీగల్ వాలంటీర్ బి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా నిబంధనలు పాటించని పెట్రోల్ బంకులు

**- పేరుకే సౌకర్యాలు.. కాగితాలకే పరిమితమైన నిబంధనలు**

**- గాలికొదిలేసిన నిబంధనలు - పట్టించుకోని అధికారులు**







తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 17 : ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక పెట్రోల్ బంకుల్లో ప్రభుత్వ నియమ నిబంధనలు పూర్తిగా గాలికి వదిలేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను కూడా యాజమాన్యాలు కల్పించడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

**లేని సౌకర్యాలు.. ఉన్నా నిరుపయోగం..**

నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకులో వాహనదారుల కోసం తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాలలో గాలి నింపే యంత్రాలు (ఉాఅతీ ఖీఒఎఅశ్రీఉఎ), అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. కానీ జిల్లాలోని అనేక బంకుల్లో ఈ సౌకర్యాలు కనిపించడం లేదు. కొన్ని బంకుల్లో గాలి నింపే యంత్రాలు ఉన్నా అవి పేరుకే ఉన్నాయని, అవి పనిచేయడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గాలి కొట్టించుకునేందుకు వెళితే యంత్రం పనిచేయడం లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వాపోతున్నారు. తాగునీటి సౌకర్యం కూడా చాలా బంకుల్లో అందుబాటులో లేకపోవడం గమనార్హం.

### సిబ్బందితో వెట్టిచాకిరీ

**- చులకనగా చూస్తున్న యాజమాన్యాలు**




బంకుల్లో పనిచేసే సిబ్బందితో యాజమాన్యాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పెట్రోల్ పోయడానికి నియమించిన సిబ్బందితోనే మరుగుదొడ్లు, బాత్ రూములు కడిగించడం, బంకు మొత్తం ఊడ్పించడం లాంటి పనులు చేయిస్తున్నారని తెలిసింది. ఇదే విషయంపై కొన్ని బంకుల్లో పనిచేసే సిబ్బంది తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. తమను యాజమాన్యాలు చులకనగా చూస్తున్నారని, కనీస వేతనాలు కూడా సరిగ్గా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిద్రావస్థలో అధికారులు?**

పెట్రోల్ బంకులను పర్యవేక్షించాల్సిన అధికారులు ఎవరు? జిల్లాలో సివిల్ సప్లైస్ శాఖ, లీగల్ మెట్రాలజీ, పేలుడు పదార్థాల నియంత్రణ శాఖ (ఉాజుూా), కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఈ బంకులపై ఎందుకు నిఘా పెట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పెట్రోల్ బంకుల లైసెన్సులను తనిఖీ చేయడం, సౌకర్యాలను పరిశీలించడం, నిబంధనలు పాటించని బంకులపై చర్యలు తీసుకోవడం వంటివి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.




**జిల్లా అధికారులు స్పందించాలి**

నిబంధనలు పాటించని పెట్రోల్ బంకులపై జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# తార్నాకలో ఘనంగా తెలంగాణ లిబరేషన్ డే వేడుకలు..!




కాప్రా/సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : :తార్నాక చౌరస్తాలో తెలంగాణ లిబరేషన్ డే సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తిక చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ విముక్తి కోసం ఎంతోమంది చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని పేర్కొన్నారు. ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, వీరన్న, సంపత్, రాధాకృష్ణ, సత్తిరెడ్డి, సుబ్బారావు, రామచంద్రారెడ్డి, కిరణ్ గౌడ్, టెంపుల్ సాయి, శివారెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

**- కొత్తకోటలో బీసీ బాలికల హాస్టల్ మంజూరు చేయాలి**

**- జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్**





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర) : బీసీ హాస్టల్ విద్యార్థులకు తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు గురువారం కొత్తకోటలోని బీసీ కళాశాల బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ... హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనమే లభిస్తున్నప్పటికీ, గదుల కొరత తీవ్రంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని కూల్చివేసి కొత్తది నిర్మించడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యపై ప్రత్యేక దృష్టి సారించి మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూతన భవన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయించాలని కోరారు. అలాగే కొత్తకోటలో బీసీ బాలికల వసతి గృహం లేకపోవడంతో నిరుపేద విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తక్షణమే ప్రీ-మెట్రిక్ బాలికల హాస్టల్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి వి.వి. గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, నాయకులు కృష్ణప్రసాద్, ధర్మేంద్ర సాగర్, యశ్వంత్ గౌడ్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటం వర్గ పోరాటమే.. మత పోరాటం కాదు

**- సీపీఎం మాజీ ఎంపీటీసీ జి. బాలయ్య**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 17 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మతోన్మాదులు ప్రచారం చేస్తున్నట్లు మతాల మధ్య జరిగిన గొడవ కాదని, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన మహోజ్వల వర్గ పోరాటమని సీపీఎం మాజీ ఎంపీటీసీ జి.బాలయ్య అన్నారు. సెప్టెంబరు 17 తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విలీన ముగింపు సభను పెబ్బేరు మండల కేంద్రంలోని హమాలీ సంఘం భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. హమాలీ సంఘం అధ్యక్షుడు అంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాలయ్య ముఖ్యవక్తగా మాట్లాడారు. దేశవ్యాప్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే కుట్ర జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహత్తర పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని, నాటి విప్లవంతో మతోన్మాదులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పటేల్ సైన్యం, నిజాం రజాకార్లు, భూస్వాములు అణచివేసింది మన మట్టి మనుషులనేనని గుర్తుచేశారు. దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటంలో చిట్యాల ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, రావి నారాయణరెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం, షేక్ బందగి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ వంటి వీరులు ఎందరో ప్రాణాలర్పించారన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే 3,500 గ్రామాల్లో గ్రామస్వరాజ్యాలు ఏర్పడి, 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ అయిందని తెలిపారు. ఈ విప్లవంలో 4,000 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు అమరులయ్యారని పేర్కొన్నారు. ఇటువంటి చారిత్రక ఘట్టాన్ని 'విమోచన', 'విద్రోహ' దినాల పేరిట దారిమళ్లించడం సరికాదని, ఇది కచ్చితంగా 'విలీన దినమే'నని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై భవిష్యత్తులోనూ సమసమాజ స్థాపన కోసం ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బిసన్న, గంగాధర్, రాజు, నరసింహ, రామస్వామి, పటేల్‌గారి రాజు తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి.



గద్వాల సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో) : శిల్పులు, చేతి వృత్తిదారులు, కార్మికులు, తదితర వృత్తుల్లో నైపుణ్యంతో పనిచేస్తున్న వారందరికీ భగవాన్ విశ్వకర్మ ప్రత్యేకగా నిలుస్తారని న్యూఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. భగవాన్ విశ్వకర్మ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి ఆవరణలో విశ్వకర్మ చిత్రపటానికి ముఖ్య అతిథితోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకతతో సమాజ అభివృద్ధికి సేవలందిస్తున్న శిల్పులు, చేతివృత్తిదారులు, కార్మికుల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. భారతదేశంలో తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ చేతివృత్తులు మన సాంస్కృతిక వారసత్వంలో ముఖ్యమైన భాగమని తెలిపారు. వడ్రంగులు, కమ్మర్లు, స్వర్ణకారులు, చేనేత కళాకారులు, కుమ్మరులు, శిల్పులు, మేస్త్రీలు, చెప్పుల తయారీదారులు, తదితర వృత్తుల ద్వారా అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ శ్రమకు, నైపుణ్యానికి, వృత్తిపట్ల అంకితభావానికి గౌరవం ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలంపూర్ శాసనసభ్యులు విజేయుడు, గొర్రెలు మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మంజుల, విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# నవ భారత నిర్మాత ప్రధాని నరేంద్ర మోదీ

**- స్నేహ సొసైటీలో ప్రధాని పుట్టిన రోజు వేడుకలు.**

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...**



నిజామాబాద్ సెప్టెంబర్17:(విజన్ ఆంధ్ర )నవభారత నిర్మాత, దేశ ప్రగతి దార్శనికులు ప్రధాని నరేంద్ర మోదీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా స్పష్టం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని నగరంలోని గంగస్థాన్లో గల స్నేహ సొసైటీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 13 సంవత్సరాలు సీఎంగా, 12 ఏళ్లు ప్రధానిగా సేవలందిస్తూ దేశాన్ని ప్రగతి పథంలో తీసుకెళు _న్నారన్నారు. ప్రపంచంలోనే దేశాన్ని విశ్వ గురువుగా నిలబెడుతున్నారని కొనియాడారు. అన్నివర్గాల ప్రజలకు సమ న్యాయం చేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రతి ఒక్కరూ " ఆశీర్వాద దీపం" కూడా వెలిగించారన్నారు. ప్రజాసేవ కోసం ఆయన జీవితం అంకితం చేశారని తెలిపారు. సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందని, ప్రధాని మోడీ పుట్టిన రోజుతో పాటు తెలంగాణ విమోచన దినం, విశ్వ కర్మ జయంతి కూడా ఉందని గుర్తుచేశారు. నిజాం రాచరిక పాలన నుంచి విముక్తి పొందిన రోజన్నారు. ప్రధాని పుట్టిన రోజును పురస్కరించుకొని స్నేహ సొసైటీ లోని విద్యార్థులతో కలిసి వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య. ప్రిన్సిపల్ జ్యోతి. నాయకులు మారావార్ కృష్ణ, బాబీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.ం

# భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞం మహోత్సవం



నిజామాబాద్, సెప్టెంబర్ 17 : (విజన్ ఆంధ్ర )భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమం ఐడిఓసి కార్యాలయం నందు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు హాజరై, భగవాన్ శ్రీ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. విశ్వ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, విశ్వకర్మ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డిజిటల్ చెల్లింపులపై ఛార్జీల గందరగోళం




మంచిర్యాల టౌన్ సెప్టెంబర్ 17 విజన్ ఆంధ్ర ఇటీవలి కాలంలో యూపీఐ , డిజిటల్ లావాదేవీలపై అదనపు ఛార్జీలు పడతాయనే వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవ్వడంతో సాధారణ వినియోగదారులు, వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిత్యం జరిపే డిజిటల్ చెల్లింపులకు కూడా డబ్బులు కట్ అవుతాయేమోనని గందరగోళం నెలకొంది.

ప్రజలు, వ్యాపారుల్లో నెలకొన్న అనుమానాలు: సాధారణ యూపీఐ లావాదేవీలు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా తోటివారికి డబ్బులు పంపినా లేదా దుకాణాల్లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రూ.2,000 లోపు చెల్లించినా రుసుములు పడతాయేమోనని సాధారణ ప్రజల భయపడుతున్నారు.

వ్యాపారుల ఆందోళన: క్యూఆర్ (ఇ=) కోడ్ ద్వారా వినియోగదారుల నుంచి డబ్బులు స్వీకరిస్తే బ్యాంకులు కమీషన్ రూపంలో కట్ చేసుకుంటాయేమోనని చిన్న వ్యాపారుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్నాయి.

ప్రభుత్వం, ఎన్ పి సి ఐ ఇచ్చిన స్పష్టత: సాధారణ వినియోగదారులకు ఉచితం గా వ్యక్తుల మధ్య జరిగే (పర్సన్ టు పర్సన్) సాధారణ బ్యాంక్-టు-బ్యాంక్ లావాదేవీలన్నీ పూర్తిగా ఉచితం.

రూ.2,000 లోపు వ్యాపార లావాదేవీలు ఉచితం: దుకాణాలు, కిరాణా షాపులలో రూ.2,000 లోపు చేసే చెల్లింపులపై (పి టు ఎం) ఎలాంటి ఛార్జీలు వర్తించవని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది.

చిన్న వ్యాపారులకు మినహాయింపు: నెలకు రూ.1 లక్ష వరకు క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ పేమెంట్లు స్వీకరించే చిరు వ్యాపారులపై ఎటువంటి ఛార్జీల భారం ఉండదు.

ఎవరికి వీఱ= వర్తిస్తుంది?: అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎం డి ఆర్ 0.4%) నిబంధనలు కేవలం రూ.2,000 కంటే ఎక్కువ విలువైన కొన్ని పెద్ద మర్చంట్ (పి టు ఎమ్) వ్యాపార చెల్లింపులకే పరిమితం. ఈ ఎండిఆర్ అనేది కూడా వ్యాపార సంస్థలకు సంబంధించినదే తప్ప, కొనుగోలు చేసే సాధారణ కస్టమర్ల నుంచి బ్యాంకులు ప్రత్యక్షంగా వసూలు చేయవు.


వినియోగదారులు పాటించాల్సిన సూచనలు: సోషల్ మీడియాలో వచ్చే అరకోర, తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మవద్దు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్.బి.ఐ లేదా ఎన్పీసీఐ జారీ చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని ఆర్బీఐ అధికారులు సూచిస్తున్నారు డిజిటల్ ఇండియా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు మాత్రమే నిర్దిష్ట పెద్ద వ్యాపార రంగాలకు ఎమ్డీఆర్ నిబంధనలు తెచ్చారు తప్ప, సామాన్యుల ఉచిత యూపీఐ సేవలకు ఎలాంటి భంగం కలగదని అధికారులు స్పష్టం చేశారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**- పాల్గొన్న ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 17,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిళ పాల్గొన్నారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ప్రభుత్వ విప్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గేయం, జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను విప్ వివరించారు. ఉద్యానవన పంటల అభివృద్ధికి కృషి చేసిన మండల వ్యవసాయ అధికారులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారు పుట్ట సుమన్‌కు మంజూరైన ఎలక్ట్రిక్ ట్రాలీ ఆటోను ప్రభుత్వ విప్ వేముల వీరేశం, కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్వో రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# లికలెక్టరేట్లో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు.



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 17,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ జయంతి వేడుకలలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, బిసి, ఎస్సీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, ఇతర అధికారులు, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో గణనాథునికి కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రత్యేక పూజలు



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 17,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి పూజలు చేసి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారులు కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాథోడ్ రమేష్, కార్యాలయ పర్యవేక్షకులు ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**- ముఖ్య అతిథిగా హాజరైన మైనారిటీ వెల్ఫేర్ మరియు పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ శాఖ మంత్రివర్యులు అజాహారుద్దీన్**

**జిల్లా ప్రగతి నివేదికను ఉపన్యాసించిన మంత్రి**





జగిత్యాల, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో): గురువారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మైనారిటీ వెల్ఫేర్ మరియు పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ శాఖ మంత్రివర్యులు అజాహారుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్, జిల్లా అదనపు కలెక్టర్లు బి.ఎస్ లత, బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వై ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ పాల్గొన్నారు.

*ఈ సందర్భంగా మంత్రి అజాహారుద్దీన్ మాట్లాడుతూ*

గౌరవనీయులైన ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, జగిత్యాల జిల్లా ప్రజలందరికీ నా హృదయపూర్వక తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతం నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్య భారతదేశంలో అంతర్భాగమైన చారిత్రాత్మక రోజు ఈ రోజు. ఈ చారిత్రక ఘట్టానికి 78 సంవత్సరాలు పూర్తై, 79వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా ఘనంగా నిర్వహించుకుంటున్నాం. నాటి తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాటాలు, స్వాభిమాన ఆకాంక్షలు మనకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజా పాలన అందించడం, ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని, ప్రతి ప్రాంతానికి అభివృద్ధిని చేరవేయడం మనందరి బాధ్యత. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడి సెప్టెంబర్ 1 నాటికి 1000 రోజుల ప్రజాపాలనను పూర్తి చేసుకుంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం, మౌలిక వసతుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అనేక కీలక కార్యక్రమాలను అమలు చేస్తోంది. రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడం, విద్యా ఉద్యోగ అవకాశాలను విస్తరించడం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలకు బాటలు వేయడం, భవిష్యత్తు తెలంగాణకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించింది. రాష్ట్రంలోని ప్రజలందరికీ పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూర్చే పథకాల అమలుతో పాటు కొత్త చట్టాలు, కొత్త విధానాలు, కొత్త సంస్థలు, కీలక పరిపాలనా సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన అంటే కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమైన పాలన కాదు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపే పాలన. పారదర్శకత, జవాబుదారీతనం, సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం అనే నాలుగు ప్రధాన స్తంభాలపై ప్రజా ప్రభుత్వం తన పాలనను కొనసాగిస్తోంది. రాష్ట్రాన్ని భవిష్యత్ తరాలకు మరింత బలమైన, అభివృద్ధి చెందిన, ఆర్థికంగా శక్తివంతమైన తెలంగాణగా తీర్చిదిద్దేందుకు 'తెలంగాణ రైజింగ్2047' దార్శనిక పత్రాన్ని రూపొందించాం. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం ఈ విజన్ ప్రధాన లక్ష్యం. గ్రామీణ తెలంగాణను బలోపేతం చేస్తూనే పట్టణ ప్రాంతాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయడం ద్వారా సమతుల్య ప్రగతిని సాధించాలన్నది ప్రజా ప్రభుత్వం లక్ష్యం. అభయహస్తం హామీలను దశలవారీగా అమలు చేయడంతో పాటు, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా, ప్రతి గ్రామం మరియు పట్టణం అభివృద్ధి చెందేలా ప్రజలకు చేరువైన పాలనను అందిస్తోంది. రైతులకు రైతు భరోసా, పంటలకు మద్దతు, మహిళలకు మహాలక్ష్మి, గృహజ్యోతి ద్వారా కుటుంబాలకు ఉపశమనం, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నిరు పేదలకు సొంతింటి కల, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, పేదలకు మెరుగైన వైద్య సేవలు, యువతకు ఉద్యోగాలునైపుణ్యాభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలతో ప్రజా ప్రభుత్వం సంక్షేమంఅభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోంది. ఈ 1000 రోజుల ప్రజాపాలనలో రాష్ట్ర ప్రగతితో పాటు జగిత్యాల జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. ప్రజల భాగస్వామ్యంతో జగిత్యాల జిల్లాను అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మీ ముందుంచుతున్నాను.

*చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం :*

పురాతన దేవాలయాల అభివృద్ధిలో భాగంగా ధర్మపురి శ్రీ ఉగ్ర నరసింహ ఆలయ పునర్నిర్మాణానికి 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని రూ. 200 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఇటీవలే గౌరవ ఉప ముఖ్యమంత్రి గారిచే శంకు స్థాపన పనులు నిర్వహించడం జరిగినది. అర్హులందరికీ

*నూతన స్మార్ట్ రేషన్ కార్డులు :*

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన నూతన స్మార్ట్ కార్డు లలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్దిదారులకు 3 లక్షల 53 వేల 682 మందికి అందించడం జరుగుతుంది.

*నూతన చేయూత పెన్షన్లు:*

జగిత్యాల జిల్లాలో వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎ×ఎ౯ూ×ణూ, ఫైలేరియా, దయాలసిస్ బాధితులు తదితర 11 కేటగిరీలకు చెందిన 2,14,076 మంది లబ్ధిదారులకు ప్రతి నెల సుమారు రూ.46 కోట్ల 26 లక్షల పెన్షన్లు అందిస్తున్నాం. నూతన పెన్షన్ల మంజూరీ కొరకు అన్ని రకాల పెన్షన్ దారుల నుండి 15 వేల 432 దరఖాస్తులు స్వీకరించనైనది.

*మహిళా ఆర్థిక సాధికారత:-*

జిల్లాలో ఇప్పటి వరకు 285 కోట్ల 68 లక్షల వడ్డీ లేని రుణాలను అందించడం జరిగింది. వడ్డీ మాఫీ కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి 32 కోట్ల 58 లక్షల వడ్డీ మాఫీ నిధులను అందించడం జరిగింది. స్త్రీ నిధి సంస్థ ద్వారా మహిళలకు 2026-2027 ఆర్థిక సంవత్సరంలో 28 కోట్ల 30 లక్షల రుణాలు ఇవ్వడం జరిగింది.

*వనమహోత్సవం :*

12 వ విడత వనమహోత్సవంలో భాగంగా 2026 -27 సంవత్సరమునకు జిల్లాలోని 380 గ్రామ పంచాయితీలలో నర్సరీలు ఏర్పాటు చేయడం జరిగినది. 52 లక్షల మొక్కలు మొక్కలు పెంచడం జరిగినది. ఇంటి ఆవరణలో మొక్కలు నాటుటకు 21 లక్షల 78 వేల మొక్కలు పంపిణీ చేయడం జరిగినది. అవెన్యూ ప్లాంటేషన్, ఈత ప్లాంటేషన్ మరియు కమ్యూనిటీ స్థలాలలో 8 లక్షల 66 వేల మొక్కలు నాటడం జరిగినది.

*మహాలక్ష్మి పథకం :*

జిల్లాలో ఉచిత బస్సు రవాణా సౌకర్యాన్ని 77 కోట్ల 72 లక్షల మంది మహిళలు వినియోగించుకున్నారు. 328 కోట్ల 56 లక్షల రూపాయల లబ్ధి పొందారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటి వరకు 14 లక్షల 10 వేల 844 గ్యాస్ సిలిండర్లను 500 రూపాయలకే సరఫరా చేయడం జరిగింది. దీనికి 44 కోట్ల 79 లక్షల రూపాయల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది.

*గృహజ్యోతి :*

200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే వినియోగదారులందరికీ జీరో బిల్లులు జారీ చేస్తోంది. జిల్లాలో 2 లక్షల 0 4 వేల 293 సర్వీసులకు గాను 80 కోట్లు 32 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది.

*ఇందిరా మహిళా శక్తి :*

జిల్లాలో 22 వ్యక్తిగత యూనిట్లకు 4 కోట్ల 12 లక్షల రూపాయలు లక్ష్యంగా నిర్దేశించగా, 65 మహిళా సంఘాల వ్యక్తిగత యూనిట్లకు ఈ ఏడాది 1 కోటి 81 లక్షల రుణాలు ఇప్పించడం జరిగింది. జిల్లాలోని (5) మున్సిపాలిటీలలో 18 వేల 310 వీధి వ్యాపారులను గుర్తించి, 13 వేల 202 వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా 36 కోట్లు 8 0 లక్షల రూపాయల రుణాలను మంజూరు చేసినాము.

*మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖ :*

జిల్లాలో 1 వెయ్యి 65 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 11 వేల 86 మంది గర్భిణీ, బాలింతలకు, 29వేల 587 టీ.హెచ్.ఆర్. చిన్నారులకు, 13 వేల 123 మంది పిల్లలకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పోషకాహారం అందజేస్తున్నాము.

**ఇందిరమ్మ ఇండ్లు :**

ప్రతి పేదవాడి కళ సొంత ఇల్లు. ఈ సొంత ఇంటి కళను సాకారం చేసేందుకు జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా, దరఖాస్తు చేసుకున్న 10 వేల 365 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగింది. ఇప్పటికే 9 వేల 18 ఇండ్ల నిర్మాణాలలో 2 వేల ఐదు వందలా 22 ఇండ్లు పూర్తి కాబడినవి దీనికి గాను 246 కోట్ల 93 లక్షల రూపాయలు చెల్లించడం జరిగింది.

*వ్యవసాయ శాఖ :*

జిల్లాకు పచ్చి రొట్ట విత్తనాలు ( జీలుగ) 12 వేల 500 క్వింటాళ్లు, జనుము 900 ల క్వింటాళ్లు కేటాయించగా ఇప్పటి వరకు 10 వేల 913 క్వింటాళ్లు, 892 లక్షల రూపాయల సబ్సిడీతో జిలుగు విత్తనాలను 792 క్వింటాళ్లు 61 లక్షల 50 వేల రూపాయలతో సబ్సిడీతో రైతులకు జనుము విత్తనాలను రైతులకు అందజేయడం జరిగినది. రైతు బీమా ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో వివిధ కారణాలతో మరణించిన రైతు కుటుంబాలకు 5 వేల 707 మందికి 285 కోట్ల 35 లక్షల రూపాయల ఆర్థిక చేయూత కల్పించడం జరిగింది.

*విద్యాశాఖ :*

రాష్ట్ర ప్రభుత్వం మన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో బోధన అందించేందుకు జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలో YOUNG INDIA INTEGRATED RESIDENTIAL SCHOOLS, గాను ప్రతి నియోజకవర్గమునకు 200 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగింది. కేంద్రీయ విద్యాలయ పాఠశాల నిర్వహణకై భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకుని, ప్రస్తుతం జిల్లా కేంద్రం లోని తాత్కాలిక భవనంలో అడ్మిషన్లు పూర్తి అయినవి. ప్రాథమిక విద్యా వ్యవస్థ బలోపేతానికై ఖీూచీ డిస్ట్రిక్ట్ సెల్ ప్రారంభించబడింది. జిల్లాలోని పిల్లలు అందర్నీ 80 శాతం సామర్థ్యాలు సాదించేలా కార్యాచరణ చేపట్టడం జరిగినది.

*సంక్షేమ వసతి గృహాలు :*

షెడ్యూల్డ్ కులాలు, గిరిజన, వెనుకబడిన, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో వసతి గృహాలు నిర్వహిస్తున్నాం. అక్టోబర్-2024 నుండి విద్యార్థులకు 200 శాతం డైట్ ఛార్జీలు, 40 శాతం కాస్మొటిక్ ఛార్జీలు పెంచారు. మరియు కామన్ డైట్ మెనూ అమలు చేస్తున్నారు.

*మైనారిటీ సంక్షేమం :*

జిల్లాలో మైనారిటీ మహిళలకు 598 కుట్టుమిషన్లు, 150 మంది యువతకు స్కిల్ డెవలప్మెంట్, రేవంత్ అన్న క సహారా 15 మంది లబ్ధిదారులకు 15 లక్షలు, ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా 76 మంది లబ్ధిదారులకు 38 లక్షలు మంజూరు చేయడం జరిగినది.

*వైద్య ఆరోగ్యశాఖ :*

వైద్య ఆరోగ్య రంగంలో జగిత్యాల జిల్లా గణనీయమైన ప్రగతి సాధించింది.జిల్లాలో 102 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, 6 బస్తీ దవాఖానాలు, 17 ూఎజలు, 5 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 3 జఎజలు, మాతా శిశు కేంద్రం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ద్వారా సేవలు అందుతున్నాయి. ఏప్రిల్‌సెప్టెంబర్ -10- 2026 వరకు జిల్లాలో జరిగిన 4 వేల 324 ప్రసవాల్లో 1865 ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తూ, ఈ ఏడాది 10 వేల 72 చికిత్సలకు గాను రూ.30 కోట్ల 20 లక్షలు ఖర్చు చేశాము.

*పంచాయితీ రాజ్ శాఖ :*

తెలంగాణ ప్రభుత్వం ూఖీజ నిధుల నుండి గ్రామ పంచాయతిలలో పని చేస్తున్న 1547 మంది పారిశుద్ధ్య కార్మికులకు మరియు 385 మంది గౌరవ సర్పంచులకు గౌరవ వేతనములను ప్రతి నెల 1 వ తేదీన అందించడం జరుగుతుంది.

*కార్మిక శాఖ:*

జిల్లాలో ఒక లక్షా 8 వేల 566 మంది నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకోగా వివిధ పథకాల క్రింద 16 వేల 659 కార్మికులకు గాను 62.4 కోట్ల ప్రయోజనం కల్పించడం జరిగినది. చీూజ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్స్ ద్వారా 6 వేల 761 మంది కార్మికులకు వివిధ రంగాలలో శిక్షణ అందించి 3 కోట్ల 73 లక్షల విలువ గల స్టైపెండ్ అందించడం జరిగినది.

*భూభారతి :*

జిల్లాలో భూ భారతి చట్టంలో భాగంగా నక్ష లేని 20 గ్రామాలు ఎంపిక జరిగింది. ఇట్టి గ్రామలలో సర్వే పనులు శర వేగంగా జరుగుతుంది.

*మత్స్య శాఖ :*

జిల్లాలో 100% సబ్సిడీపై 763 చెరువులలో ఒక కోటి 69 లక్షల చేప పిల్లల పంపిణీ చేయడం జరుగుతుంది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా 150 మందికి 35 వేల రూపాయల చొప్పున మార్కెటింగ్ వివిధ బ్యాంకులు ఋణాలు మంజూరు చేయడం జరిగినది.

*మున్సిపల్ శాఖ :*

జగిత్యాల పురపాలక సంఘమునకు 15వ ఆర్థిక సంఘం నిధుల క్రింద 13 కోట్ల 23 లక్షలు మంజూరు కాగా పారిశుద్ధ్య వాహనముల కొనుగోలు, ూజెవీ, నీటి సరఫరాకు సంబందించిన పనులు చేపట్టనైనది. అమృత్ 2.0 పథకం క్రింద 38 కోట్ల 48 లక్షలు మంజూరు కాగా ట్యాంక్ నిర్మాణములు 19 కిలోమీటర్ ల పైప్లైన్ పనులు, 2767 గృహాలకు నల్లా కనెక్షన్లు మంజూరు చేయనైనది. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్తున్న గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారికి, జగిత్యాల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం, సూచనలు అందిస్తున్న గౌరవ పార్లమెంటు సభ్యులకు, గౌరవ శాసన మండలి సభ్యులకు, గౌరవ శాసన సభ్యులకు, గౌరవ స్థానిక ప్రజా ప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు, పోలీస్ సిబ్బందికి, న్యాయాధికారులకు, ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు, జిల్లా ప్రజలకు, ప్రతి ఒక్కరికీ పేరు పేరునా.. హృదయపూర్వక వందనం తెలియజేస్తున్నాను.

*జై హింద్.. జై తెలంగాణ....*

ఈ కార్యక్రమం లో జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని గణేష్ మండపాలను జియో ట్యాగింగ్ అనుసంధానం

**సి.సి కెమెరాల నిఘాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు గణేష్ నిమజ్జనానికి పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లుచేశాము పోలీస్ కమీషనర్ వెల్లడి**



నిజామాబాద్ సెప్టెంబర్17:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు వరిధిలోని నిజామాబాద్ ఆర్మూర్, బోధన్ డివిజన్ వరిధిలో గణేష్ మండపాల పై పోలీసుల నిఘా వ్యవస్థ పటిష్టంగా కొనసాగుతుందని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ శ్రీ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్.తెలియజేశారు. గత నాలుగు రోజుల క్రితం ప్రారంభమయిన గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాలతో పాటు వాటి పరిసరా ప్రాంతాల్లోను ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు కార్యచరణ ప్రణాళికతో పోలీస్ కమీషనరేటు వరిధిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలకు పోలీస్ భద్రత కల్పించడం జరుగుతుందని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ తెలియజేశారు.నిజామాబాద్ కమీషనరేటు వరిధి లో మొత్తం 5681 గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో నిజామాబాద్ డివిజన్ వరిధి లో 2545 విగ్రహాలు. ఆర్మూర్ డివిజన్ వరిధిలో 1959 విగ్రహాలు, బోధన్ డివిజన్ పరిధిలో 1177 విగ్రహాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలకు భద్రత కల్పించడం కోసం వ్యూహాత్మకమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది.

*ఆన్ లైన్ ద్వారా గణేష్ మండపాల రిజిస్ట్రేషన్*

ఫ్రెండ్లీ పోలీసింగ్ లో భాగంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించే దిశగా విగ్రహాల ఏర్పాటుకు అవసరమయిన పోలీస్ అనుమతుల కై గణేష్ నవరాత్రి నిర్వాహకులు సంబంధిత పోలీస్ స్టేషన్ వెళ్లకుండా ఆన్లైన్ విధానం ద్వారా ధరఖాస్తు చేసుకున్న గణేష్ నవరాత్రి నిర్వాహకుల కు విగ్రహా ఏర్పాటుకు స్థానిక పోలీసులు అనుమతులను మంజూరు చేయడం జరిగిందని అన్నారు.

*ప్రతి గణేష్ విగ్రహాన్ని జియో ట్యాగింగ్ కు అనుసంధానం*

పోలీసులు గణేష్ మండపాలకు కల్పించడంలో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ వరిదిలో ఏర్పాటు చేసిన ప్రతి గణేష్ విగ్రహాన్ని జియో ట్యాగింగ్ కు అనుసంధానం చేయడం జరుగుతుంది. ఇందుకోసం పోలీస్ స్టేషన్ వరిధిలో సెక్టార్ ల వారి పెట్రోలింగ్ నిర్వహించే బ్లూకోర్ట్స్ సిబ్బంది తమ సెక్టార్ వరిధిలోని గణేష్ నవరాత్రులు నిర్వహించే గణపతి మండపాలను క్షేత్ర స్థాయిలో నందర్శించి వారి వద్దనున్న ట్యాబ్ ల ద్వారా సంబంధిత గణేష్ మండపాల చిత్రాలను తీసుకోవడంతో పాటు మండపాల నిర్వహాకులకు నంబందించి వూర్తి నమాచారాన్ని సేకరించి పోలీస్ వెబ్ అప్లికేషన్ ద్వారా క్షేత్ర స్థాయిలో జియో ట్యాగింగ్ కు అనుసంధానం చేయడం జరుగుతుంది. ఇప్పటి వరకు నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు వరిధిలో మొత్తం 5681 గణేష్ విగ్రహాలను జియో ట్యాగింగ్ కు అనుసంధానం చేయడం జరిగింది. ఇందులో నిజామాబాద్ డివిజన్ వరిధిలో 2545 , ఆర్మూర్ డివిజన్ వరిదిలో 1959, బోధన్ డివిజన్ వరిధిలో 1177 విగ్రహాలను జియో ట్యాగింగ్ చేయడం జరిగింది. ముఖ్యంగా ఈ జియో ట్యాగింగ్ చేయడం ద్వారా పోలీస్ స్టేషనుల వారిగా స్టేషన్ అధికారులు , సిబ్బందికి విగ్రహాల సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో వుండటంతో పాటు గణేష్ మండపాల వద్ద ఏదైనా నమస్య తలేత్తినప్పుడు సంఘటన స్థలానికి స్థానిక పోలీసులు త్వరితగతిన చేరుకునేందుకు అవసరమైన మార్గాలను గుర్తించడం నులభం అవుతుంది.


*24 గంటలు బ్లూకోర్ట్స్ సిబ్బంది పర్యవేక్షణ*

ఏర్పాటు చేసిన గణేష్ మండపాలకు కల్పిస్తున్న భద్రతలో భాగంగా సేక్టార్ వారిగా విధులు నిర్వహించే బ్లూ కోర్ట్ మరియు పెట్రో కార్ సిబ్బంది ప్రతిరోజు మూడు షిఫ్టుల వారిగా మూడు పర్యాయాలు మండపాలను సందర్శించి అక్కడి పరిస్థితులపై అధ్యాయం చేస్తూ భద్రత విషయంలో నిర్వాహకులకు సూచనలు చేస్తూ మండపాల వారిగా జారీ చేసినా పాయింట్ బుక్కు లో సెక్టార్ పోలీసు సిబ్బంది సంతకము చేయడం జరుగుతుంది.

*నిమజ్జనానికి సి.సి కెమెరాల ఏర్పాట్లు*

నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు వరిధిలోని ముఖ్యమైన ప్రాంతాలలో సి.సి కెమోరాల ఏర్పాటు చేయడం జరిగింది. నిజామాబాద్ లో ప్రధానంగా గణేష్ నిమజ్జనం రూట్ లో దాదావు 100 సి.సి కెమెరాల ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కెమెరాలు ఐ.పి టెక్నాలజీ తో రూపోందించడం జరిగింది. ఈ కెమెరాలు పూర్తిగా పోలీస్ కమీషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేయడం జరిగింది. ఈ సి.సి టివిలు 24 ౹ 7 ప్రకారంగా పూర్తిగా సిబ్బంది వర్యవేక్షణలో ఉంటుంది.

# "మెగాసిటీ నవకళా వేదిక" ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్మారక పురస్కారాల ప్రధానం



హైదరాబాద్ సెప్టెంబర్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : వృత్తినే దైవంగా భావించి సమాజ నిర్మాణానికి, అభివృద్ధికి తమవంతు బాధ్యతగా అంకితభావంతో విలువైన సేవలు అందిస్తూ, రాష్ట్రం, దేశం పురోగతి చెందడానికి విశేషంగా కృషి చేస్తున్న ఇంజనీర్ లను అభినందించడం, గౌరవించడం ఎంతో మహాభాగ్యంగా భావిస్తున్నామని అతిథులు అభిప్రాయపడ్డారు. ప్రముఖ సాంస్కృతిక, సేవా సంస్థ "మెగాసిటీ నవకళా వేదిక", "మదర్ ఫౌండేషన్" వ్యవస్థాపక అధ్యక్షుడు అంకేనపల్లి మల్లికార్జున రావు సారధ్య నిర్వహణలో, దేశం గర్వించదగ్గ మహా పురుషుడు ఇంజనీర్ "భారత రత్న" సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 166వ జయంతి వేడుకలు, పలు విభాగాలలో విశేష సేవలు అందిస్తున్న ఇంజనీర్ లకు విశ్వేశ్వరయ్య స్మారక పురస్కారాలు -2026 ప్రధాన కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య కన్నుల పండుగగా జరిగింది. బుధవారం సాయంత్రం తెలంగాణ సారస్వత పరిషత్, బొగ్గులకుంట, అబిడ్స్ హైదరాబాద్ లో విశేషంగా ఏర్పాటు చేసిన ఈ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్మారక పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, పూర్వ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి , గౌరవ అతిథులుగా మాజీ చైర్మన్ డాక్టర్. వకుళాభరణం కృష్ణ మహాన్, వైద్యుడు సాయికిరణ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్. టి. ఆనంద మూర్తి, వైద్యుడు కోర్ వెల్ క్లినిక్ డాక్టర్ పొన్నాల, తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రామయ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా అడ్వకేట్ రాపోలు భాస్కర్ నేత, సేల్స్ సపోర్ట్ మేనేజర్ "శ్రీ నిధి సెక్యూర్ ప్రింట్ ప్రైవేట్ లిమిటెడ్" కంజర్ల ఈశ్వర్ చారి ,న్యాయవాది మిర్యాలగూడ సిహెచ్. రఘురామారావు హాజరై, రిటైర్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి, తెలంగాణ వి. వెంకటేశ్వరరావు, ఇంజనీర్ నరసింహ కుమార్ అలాగే వివిధ విభాగాలలో విశేష సేవలందిస్తున్న ప్రముఖ ఇంజనీర్లు సుమారు 20 మందికి విశ్వేశ్వరయ్య స్మారక పురస్కారాలను ప్రధానం చేసి అభినందించి ఘనంగా సత్కరించారు.

# ప్రజాస్వామ్యానికి పరాకాష్ట

- జటప్రోలు గ్రామంలో మహిళ సర్పంచ్ తో పాటు... జాతీయ జెండా ఎగరవేసిన భర్త !
- జటప్రోలులో నిలువునా దహనమైన ప్రోటోకాల్ కార్యదర్శి ప్రేక్షక పాత్ర

కొల్లాపూర్ /పెంట్లవెల్లి సెప్టెంబర్ 17 :(విజన్ ఆంధ్ర) స్థానిక సంస్థల్లో మహిళలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు ఎంతటి అపహాస్యానికి గురవుతున్నాయో చెప్పడానికి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జటప్రోలు గ్రామపంచాయతీలో జరిగిన ఘటన ఒక ప్రత్యక్ష ఉదాహరణ. ప్రజలు ఓట్లేసి గెలిపించింది మహిళను అయితే, అధికార పీఠంపై తిష్టవేసి పెత్తనం చెలాయిస్తోంది మాత్రం ఆమె భర్త. తాజాగా 'ప్రజాపాలన దినోత్సవం' వేళ జాతీయ జెండా ఆవిష్కరణలోనూ ఈ 'ప్రాక్సీ' పాలన బరితెగింపు పరాకాష్టకు చేరింది.

**చట్టంపై గౌరవం లేదు... ఫ్లాగ్ కోడ్ అంటే లెక్కే లేదు!**

గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే సర్వహక్కులు చట్టప్రకారం ఎన్నికైన సర్పంచ్ మహిళకే ఉంటాయి. అయితే జటప్రోలులో మాత్రం సర్పంచ్ గారితో పాటు ఆమె భర్త కూడా జాతీయ జెండా తాడు పట్టుకుని ఉమ్మడిగా ఎగురవేయడం స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇది కేవలం ప్రభుత్వ ప్రోటోకాల్ ఉల్లంఘన మాత్రమే కాదు, జాతీయ జెండా కోడ్‌ను బహిరంగంగా ధిక్కరించడమే. ఇంతటి అక్రమం జరిగాక భయపడాల్సింది పోయి, భార్యాభర్తలిద్దరూ కలిసి జెండా ఎగరేస్తున్న ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకుని వికృతానందం పొందడం వారి అజ్ఞానానికి , చట్టాలంటే ఉన్న అలక్ష్యానికి అద్దం పడుతోంది. గ్రామంలో ఏ పని జరగాలన్నా కొన్ని సందర్భాల్లో సర్పంచ్ కనిపించరని, భర్తే అన్నీ తానై వ్యవహరిస్తారనే విమర్శలకు ఈ జెండా ఆవిష్కరణ ఘటనే సజీవ సాక్ష్యంగా నిలిచింది.

**కార్యదర్శి మౌనం... దౌర్జన్యానికి తలొగ్గడమేనా?**

ప్రభుత్వ నిబంధనలను, ప్రోటోకాల్‌ను కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత కలిగిన జటప్రోలు గ్రామపంచాయతీ కార్యదర్శి కళ్లముందే ఈ నాటకం నడిచినా నోరు మెదపకపోవడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శికి ఫ్లాగ్ కోడ్, ప్రభుత్వ రూల్స్ తెలియవా? పంచాయతీ కార్యదర్శి కి ఫ్లాగ్ కోడ్ ప్రభుత్వ రూల్స్ తెలియవా లేక సర్పంచ్ భర్త రాజకీయ ఒత్తిళ్లకు, బెదిరింపులకు తలొగ్గి మూగ ప్రేక్షక రాలుగా ఉండిపోయారా? బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అక్రమాన్ని అడ్డుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది అని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

**ఉన్నతాధికారులు నిద్రపోతున్నారా? గ్రామస్తుల ఆగ్రహం**

నాగర్ కర్నూల్ జిల్లాలో ఎక్కడ ప్రోటోకాల్ ఉల్లంఘనలు, నిధుల దుర్వినియోగం జరిగినా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకుంటున్నా, జటప్రోలులో సాగుతున్న ఈ భర్త 'ఆగడాలు' అధికారుల దృష్టికి రాకపోవడం శోచనీయం. జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ), జిల్లా కలెక్టర్లు ఈ రకమైన ప్రాక్సీ పాలనపై ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలతో పాటు గ్రామ పౌరులు ప్రశ్నిస్తున్నారు.




**జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలి**

జాతీయ జెండా కోడ్‌ను, ప్రభుత్వ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించిన సర్పంచ్ ఆమె భర్త పై తక్షణమే చట్టపరమైన చర్యలను చేయాలి గ్రామస్తుల డిమాండ్. ప్రోటోకాల్ మార్చిన పంచాయతీ కార్యదర్శులు వెంటనే సస్పెండ్ చేయండి రాజ్యాంగబద్ధమైన హోదాను అవమానిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్‌ను పదవి నుంచి తొలగించాలి. అక్రమాన్ని నిరోధించకుండా నిశ్శబ్దంగా సహకరించిన పంచాయతీ కార్యదర్శిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారంపై ఊరురుకున్నేది లేదని, త్వరలోనే జిల్లా 'ప్రజావాణి'లో కలెక్టర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాడతామని జటప్రోలు గ్రామస్తులు తెగేసి చెప్పారు.

**ఈ విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా**

జటప్రోలు గ్రామ సర్పంచి పద్మమ్మ నే జాతీయ జెండాను ఎగరవేశారని ఆమెకు ఎలా ఎగరవేయాలో తెలియక పోవడంతో ఆమె భర్త కృష్ణయ్య ఆమెకు సహాయం చేశాడని జటప్రోలు గ్రామపంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు.

# ములుగులో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

- జాతీయ జెండా ఎగురవేసిన మంత్రి సీతక్క



ములుగు, సెప్టెంబర్ 17, విజన్ ఆంధ్ర ప్రతినిధి: ములుగు జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల సముదాయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మహోన్నత ఘట్టమని, నాటి పోరాట స్ఫూర్తే నేటి ప్రజాపాలనకు మార్గదర్శకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, మహాలక్ష్మి ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ములుగు జిల్లాలో ఇప్పటివరకు 5,201 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి 1,850 పూర్తి చేశామని, మహాలక్ష్మి పథకం ద్వారా 2.33 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసి రూ.172 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్, ఎస్పీ సుధీర్, మార్కెట్ చైర్మన్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటాన్ని భారతీయ జనతా పార్టీ వక్రీకరిస్తోంది.

- జి చంద్రయ్య వామపక్ష నాయకులు.



మల్లంపల్లి, సెప్టెంబరు 17 విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణ సాయుధ పోరాటం ముసల్మానులు, హిందువుల మధ్య జరిగిన కొట్లాట కాదని, అది నిజాము, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన ప్రజల పోరాటమని, ఆ చరిత్రను భారతీయ జనతా పార్టీ నాయకులు వక్రీకరిస్తున్నారని మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య అన్నారు. ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలోని అంబేద్కరు విగ్రహం వద్ద తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ సభ జంగిలి సుధాకర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ 1946 నుండి 51 వరకు ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో భూస్వాముల వెట్టిచాకిరి, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఈ పోరాటం సాగిందన్నారు. ఇసునూరి రామచంద్రారెడ్డి, ములుగు ఉమర్ ఖాన్ వంటి దొరలు లక్షల ఎకరాలు లాక్కొని ప్రజలతో 'బానిస దొర' అంటూ వెట్టి పనులు చేయించేవారని తెలిపారు. చిట్యాల ఐలమ్మ పంటను దొరలు ఎత్తుకుపోతే సహచరుడు భీంరెడ్డి, మల్లు స్వరాజ్యం దళాలు తిరిగి ఆమెకు అందించాయని, ఆ పోరాటంలోనే దొడ్డి కొమురయ్య అమరుడయ్యాడని గుర్తుచేశారు. ఎర్రజెండా నాయకత్వంలో ప్రజలు భూస్వాముల భూములు పంచుకుని రజాకార్లను ఊర్ల నుంచి తరిమికొట్టారన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ చరిత్రను హిందూ-ముస్లిం కోణంలో చూపుతూ విమోచన దినంగా ప్రచారం చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘని రాజన్న, మాదాసు ఆదిరెడ్డి, కోట సాంబయ్య, ఆరెపల్లి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం


- రూ.22.50 కోట్ల రుణ చెక్కుల పంపిణీ



ములుగు, సెప్టెంబర్ 17:విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో భాగంగా ములుగు జిల్లాలోని 265 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.22 కోట్ల 50 లక్షల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క పంపిణీ చేశారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి మంత్రి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతి మహిళా సంఘానికి రూ.20 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణం ఇస్తున్నామని, వడ్డీ లేని రుణ పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. మహిళలు స్థానిక వనరులతో స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, అందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇప్పపూవు లడ్డు స్టాల్ ను మంత్రి పరిశీలించారు.

# భర్తీపూర్‌లో బాబా మళ్లీ కార్యకలాపాలు

- సంతానం పేరుతో అమాయక దంపతులే టార్గెట్
- గతంలో కేసు నమోదైనా.. మళ్లీ అదే వ్యవహారం
- అధికారుల నిఘా ఎక్కడ?






మెట్‌పల్లి, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం భర్తీపూర్ గ్రామంలో ఓ వ్యక్తి మరోసారి 'బాబా' అవతారం ఎత్తినట్లు ప్రచారం జరుగుతుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అమాయక ప్రజల నమ్మకాలను ఆసరాగా చేసుకుని, ముఖ్యంగా సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతులను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక పూజలు, పరిహారాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? అసలు అక్కడ ఏం జరుగుతోంది? అనేది అధికారుల సమగ్ర విచారణతోనే తేలాల్సి ఉంది.

*దేవుడు వస్తాడు.. దయ్యం పోతుంది అంటూ ప్రచారం?*

గతంలో ఇదే వ్యక్తి 'దేవుడు వస్తాడు.. దయ్యం పోతుంది' అంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చినట్లు స్థానికంగా ప్రచారం ఉంది. ముఖ్యంగా సంతానం లేని దంపతుల బలహీనతను ఆసరాగా చేసుకుని ప్రత్యేక పూజలు చేస్తే సంతానం కలుగుతుందని నమ్మించేవారనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. ఈ వ్యవహారంపై గతంలో పత్రికల్లో కథనాలు రావడంతో పాటు, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ దంపతుల ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. గతంలో పోలీసు కేసు వరకు వెళ్లడంతో కొద్ది రోజులు తన కార్యకలాపాలు నిలిపివేసి వ్యవహారం సద్దుమణితో మళ్లీ ప్రారంభించినట్లు సమాచారం. వ్యవహారం ప్రస్తుతం మళ్లీ కొనసాగుతున్నట్లు వస్తున్న ఆరోపణల్లో నిజమెంత? గతంలో నమోదైన కేసులో పోలీసుల దర్యాప్తు ఏం తేల్చింది? కేసు పరిస్థితి ఏమిటి? అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. సంతానం కలగక మానసికంగా ఇబ్బంది పడుతున్న దంపతులను లక్ష్యంగా చేసుకుని పూజలు, మంత్రాలు, పరిహారాల పేరుతో లక్షల్లో డబ్బులు తీసుకుంటున్నారా? ఒక్కో దంపతుల నుంచి ఎంత మొత్తంలో వసూలు చేస్తున్నారు? డబ్బులు చెల్లిస్తే సంతానం కలుగుతుందని హామీలు ఇస్తున్నారా? ప్రజలను భయపెట్టేలా 'దేవుడు', 'దయ్యం' పేర్లను ఉపయోగిస్తున్నారా? అనే అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

*గతంలో కేసు.. అయినా మళ్లీ ఇదే వ్యవహారమా?*

ఇదే తరహా ఆరోపణలపై గతంలో కేసు నమోదైనట్లు సమాచారం ఉన్నప్పటికీ, ఇప్పుడు మళ్లీ ఇలాంటి ప్రచారం తెరపైకి రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో పోలీసులు తీసుకున్న చర్యలు ఏమిటి? ఆ కేసులో ఎలాంటి ఆధారాలు లభించాయి? ప్రస్తుతం జరుగుతున్నట్లు చెబుతున్న వ్యవహారానికి గత ఘటనతో ఏమైనా సంబంధం ఉందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

*అధికారుల నిఘా ఎక్కడ?*

ఒకవైపు ప్రజలను మూఢనమ్మకాల నుంచి బయటకు తీసుకురావాలని అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటే.. మరోవైపు గ్రామాల్లో ఇలాంటి ప్రచారాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. భర్తీపూర్‌లో జరుగుతున్నట్లు చెబుతున్న వ్యవహారంపై స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే అమాయక ప్రజలను నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నారా? లేక ప్రచారంలో ఉన్న ఆరోపణలకు వాస్తవ ఆధారాలు లేవా? అనే విషయాన్ని అధికారులు సమగ్రంగా విచారించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది. గతంలో కేసు నమోదైనట్లు చెబుతున్న నేపథ్యంలో ఆ కేసు వివరాలు, ప్రస్తుత పరిస్థితిపై కూడా స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

**విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**

**ఎస్ ఐ నవీన్ కుమార్ ఇబ్రహీంపట్నం**




విషయమై ఎస్ఐ నవీన్ విజన్ ఆంధ్ర విలేఖరి వివరణ కోరగా గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు భర్తీపూర్ బాబా సొంటి మోహన్ యోగి పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినాము. మళ్లీ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపినారు.

# శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు..!

- గణనాథుడికి విద్యార్థులు ప్రత్యేక నైవేద్యాలు..!






కాప్రా/సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : శ్రీ చైతన్య టెక్నో స్కూల్ చెంగిచెర్ల శాఖలో గురువారం వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. యూకేజీ, 5, 7వ తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల నైవేద్యాలను పాఠశాలలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడికి సమర్పించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ప్రసాదాలను అందరికీ పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రసాదం పంపిణీ చేశారు. పాఠశాల చైర్మన్ బుచ్చి రెడ్డి, డైరెక్టర్ సాయిరాం రెడ్డి, ప్రిన్సిపాల్ కేథరిన్ రెడ్డి మార్గదర్శకత్వంలో కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు భవాని, పి.సంధ్య, స్టెఫీ, అఫ్రీన్, గాయత్రి, దివ్య, అమిత, శ్రావ్య, నందిని, అలియా పర్వీన్, అబ్దుల్ అఫీజ్, ఉమాదేవి, తహెరా సుల్తానా, నాగమణి, కె.స్వాతి, దామోదర్ హిందీ, మనీషా కంప్యూటర్, అపర్ణ జీకే, అనిత ఫ్రంట్ ఆఫీస్, నవ్య టీచర్, ఫణి కరాటే తదితరులు పాల్గొన్నారు.

# విమోచన దినోత్సవానికి - మహిళా కౌన్సిలర్ల డుమ్మా!

- 14 మంది మహిళా కౌన్సిలర్లలో ఒక్కరే హాజరు..
- మిగతా 13 మంది ఎక్కడ?
- అధికారిక కార్యక్రమానికి మహిళా ప్రజాప్రతినిధుల గైర్హాజరుపై చర్చ..!
- ఆహ్వానం అందలేదా? వ్యక్తిగత కారణాలా? అసలు కారణమేంటి?



మెట్‌పల్లి డివిజన్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని మెట్‌పల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అయితే ఈ అధికారిక కార్యక్రమంలో మున్సిపాలిటీలో ఉన్న 14 మంది మహిళా కౌన్సిలర్లలో కేవలం ఒక్క మహిళా కౌన్సిలర్ మాత్రమే హాజరు కావడం, మిగిలిన 13 మంది మహిళా కౌన్సిలర్లు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. 14 మందిలో ఒక్కరే.. ఎందుకు? మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలనే ఉద్దేశంతో స్థానిక సంస్థల్లో మహిళా ప్రజాప్రతినిధులకు కీలక బాధ్యతలు కల్పించారు. అలాంటి ప్రజాప్రతినిధులు జాతీయ, రాష్ట్ర ప్రాధాన్యత కలిగిన అధికారిక కార్యక్రమాలకు హాజరై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అయితే తెలంగాణ విమోచన దినోత్సవం వంటి అధికారిక కార్యక్రమానికి 14 మంది మహిళా కౌన్సిలర్లలో 13 మంది గైర్హాజరు కావడం పలు ప్రశ్నలకు తావిస్తోంది.

*ఆహ్వానం అందలేదా? కారణం ఏమిటి?*

మహిళా కౌన్సిలర్లకు కార్యక్రమానికి సంబంధించిన సమాచారం, ఆహ్వానం అందలేదా? అందినా వారు వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేదా? లేక మున్సిపాలిటీలోని అంతర్గత పరిస్థితులే ఇందుకు కారణమా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే గైర్హాజరైన మహిళా కౌన్సిలర్ల వ్యక్తిగత కారణాలను నిర్ధారణ లేకుండా చెప్పడం సరికాదు. వారు ఎందుకు హాజరు కాలేదన్న దానిపై సంబంధిత మహిళా కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. మహిళా ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంపై ప్రశ్నలు ప్రజా సమస్యల పరిష్కారంలో మహిళా కౌన్సిలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాంటి ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీ నిర్వహించే ముఖ్యమైన అధికారిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటే ప్రజల్లో మరింత భాగస్వామ్యం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. 14 మంది మహిళా కౌన్సిలర్లలో ఒక్కరే హాజరు కావడం వెనుక అసలు కారణం ఏమిటి? మిగిలిన 13 మంది కౌన్సిలర్లు ఎందుకు రాలేదు? వారికి అధికారికంగా సమాచారం, ఆహ్వానం అందిందా? ఈ ప్రశ్నలకు మున్సిపల్ యంత్రాంగం, సంబంధిత మహిళా కౌన్సిలర్లు ఇచ్చే సమాధానాలపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

## ప్రధానికి అండగా ఉందాం...భారత్ ను విష్వగురు చేద్దాం

**- రాష్ట్ర నాయకులు ఎన్ వి సుభాష్**




నారాయణపేట సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : అలుపెరగని ప్రధాని నరేంద్రమోడీ కి అందరం అండగా నిలిచి భారత్ ను విశ్వాగురు చేసేందుకు సహకరిద్దామని రాష్ట్ర బిజెపి నాయకులు ఎన్.వి.సుభాష్ కోరారు.గురువారం నారాయణపేట జిల్లా బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర నాయకులు నాగు రావు నామాజీ,కే. రతంగ్ పాండురెడ్డి,కొండయ్య,జిల్లా బిజెపి అద్యక్షుడు సత్య యాదవ్ తో కలిసి మాట్లాడుతు ప్రధాని నరేంద్రమోడీ ఇప్పటి వరకు 13 ఏళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా 12 ఏళ్లుగా ఇప్పటికీ దేశ ప్రధాని గా కొనసాగుతూ దేశ వ్యాప్తంగా అలుపు లేకుండా భారత్ ను విశ్వ గురు గా నిలిపేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.ఆయన లక్ష్యం నెరవేరాలంటే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ను ప్రతి నాయకుడు కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని కోరారు.రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 18 వేల కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు.తెలంగాణ రాష్ట్రానికి స్వాతంత్రం వచ్చిన విమోచన దినోత్సవం కాంగ్రెస్,బి ఆర్ ఎస్ పార్టీలు ఒక వర్గం మెప్పుకోసం ఇప్పటి వరకు అధికారికంగా నిర్వహించ డం లేదన్నారు.ప్రధానికి అండగా నిలవాలని కోరారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయదవ్,రఘు రామయ్య గౌడ్,లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్,వెంకట్ రెడ్డి,తిరుపతి,బంటు రమేష్ కృష్ణ,మహబూబ్ అలీ,సాయిబాన్న,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిజ్ఞానం లేని రోజుల్లో గొప్ప శిల్పి విశ్వకర్మ ...

**- మండల డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17: (విజన్ ఆంధ్ర) : సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని రోజుల్లో గొప్ప నిర్మాణాలు చేసిన శిల్పి విశ్వకర్మ అని మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు గురువారము కలెక్టరేట్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ జిల్లా అధికారి అబ్దుల్ నదీమ్ అధ్యక్షతన నిర్వహించిన విశ్వకర్మ జయంతికి జిల్లా కలెక్టర్ హరిత, జిల్లా ఎస్పీ నీతిక పంత్, స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్లా మంగ, మున్సిపల్ చైర్మన్ ఆకాష్,వైస్ చైర్మన్ హైమద్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప వ్యక్తులను నిత్యం స్మరించుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని రోజుల్లో గొప్ప నిర్మాణాలు చేయడం విశ్వకర్మకు దక్కిందన్నారు. అటువంటి గొప్ప వ్యక్తులు నేటి టెక్నాలజీలో కూడా ఆదర్శప్రాయులని కొనియాడారు. కష్టపడేతత్వానికి, సృజనాత్మకతకు, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీక వంటి వాడని అన్నారు. భారత నిర్మాణ శాస్త్రమైన వాస్తు శాస్త్రం ఆయన అందించినదేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మంగ, కౌన్సిలర్ వెంకన్న, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీమంతుల వేణుగోపాల్, తూమోజు సురేష్ చారి, భాస్కరాచారి,గద్దలపల్లి సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## తిర్యాణి ఆకాంక్షిత మండల సమగ్ర అభివృద్ధికి సి.వై.డి.ఓ.తో ఒప్పందం..- జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17,( విజన్ ఆంధ్ర) : జిల్లాలోని తిర్యాణి ఆకాంక్షిత మండలంలో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేసేందుకు సి.వై.డి.ఓ. సంస్థతో ఒప్పందం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి సి.వై.డి.ఓ. ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత మండల అభివృద్ధిలో భాగంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రాథమిక మౌలిక వసతులను బలోపేతం చేయడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను అర్హులైన ప్రజలకు సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సి.వై.డి.ఓ. సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఎంపిక చేసిన 20 గ్రామాలలో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, పోషకాహారం తదితర కీలక రంగాలలో అవసరాలను గుర్తించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, ఆరోగ్య సేవల బలోపేతం, సురక్షిత తాగునీటి లభ్యత, సాగునీటి వసతుల అభివృద్ధి, పోషకాహార స్థాయిల పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ఎంపిక చేసిన గ్రామాలలో ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కల్పించే విధంగా కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రవీణ్ జాదవ్, జాయింట్ డైరెక్టర్ డా. నాగేశ్వర్, సి.వై.డి.ఓ. ప్రాజెక్ట్ మేనేజర్ సాయి నితీష్, నీతి ఆయోగ్ కో-ఆర్డినేటర్ డా. బాలరాజు రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్యను అందించాలి...

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17,( విజన్ ఆంధ్ర): విద్యార్థులకు కేవలం విద్యాబోధన మాత్రమే కాకుండా విలువలతో కూడిన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఎం. గార్డెన్‌లో తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి




సచ్చిదానంద చారి, ట్రస్మా రాష్ట్ర ప్రతినిధి శివరాత్రి యాదగిరి లతో కలిసి హాజరై జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలలో ఉత్తమ విద్యా సేవలు అందించిన ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యను కేవలం వ్యాపారంగా కాకుండా సేవా దృక్పథంతో నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత వంటి మంచి లక్షణాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు బోధన కొనసాగించాలని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదులలోనే ఆవిష్కృతమవుతుందని, ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో విధులు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులలో ప్రతిభను వెలికితీస్తూ, వారిని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రతినిధులు యాదగిరి శేఖర్ రావు, కిషన్ రావు, భూషణం, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని షేడ్‌పై టౌన్ ప్లానింగ్ ఉక్కుపాదం...

**- ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన అధికారులు..**
**- గాయత్రి హిల్స్‌లో కూల్చివేత....**
**- అక్రమ నిర్మాణాలపై ఉపేక్షించేది లేదు**
**: డిప్యూటీ కమిషనర్ ఏ.శైలజ**

బోడుప్పల్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని జనవాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అనుమతి లేని షెడ్‌పై బోడుప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. గాయత్రి హిల్స్ ప్రధాన రహదారిలో అనుమతి లేకుండా షెడ్ నిర్మిస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాన్ని కూల్చివేశారు.

**ఫిర్యాదుపై తక్షణ స్పందన**

జనవాసాల మధ్య అనుమతి లేని నిర్మాణాలు చేపడితే స్థానికులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో అధికారులు ఫిర్యాదును పరిశీలించి వెంటనే చర్యలు తీసుకున్నారు. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించిన అనంతరం షెడ్‌ను తొలగించినట్లు అధికారులు తెలిపారు.

**జనవాసాల మధ్య నిర్మాణాలపై నిఘా**



కాలనీల్లో అనుమతులు లేకుండా షెడ్‌లు, ఇతర నిర్మాణాలు చేపట్టడం వల్ల రాకపోకలు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అనుమతి లేని నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నారు.

**చర్యలతో స్థానికుల్లో హర్షం**

జనవాసాల మధ్య అనుమతి లేని షెడ్‌పై ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు స్పందించి కూల్చివేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే తరహాలో బోడుప్పల్ పరిధిలోని ఇతర ప్రాంతాల్లోనూ అనుమతి లేని నిర్మాణాలు, షెడ్‌లను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగితే అనుమతి లేని నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**
**: డిప్యూటీ కమిషనర్ ఏ.శైలజ**



బోడుప్పల్ పరిధిలో అనుమతి లేని నిర్మాణాలు, షెడ్‌ల విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండదని డిప్యూటీ కమిషనర్ ఏ.శైలజ హెచ్చరించారు. నిర్మాణదారులు ముందుగా నిబంధనలను, అవసరమైన అనుమతులను పరిశీలించుకుని మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఫిర్యాదులతో సంబంధం లేకుండా అధికారుల పరిశీలనలో గుర్తించిన మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న జోగులాంబ గద్వాల జిల్లా

**- జిల్లా కలెక్టరేట్లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం వేడుకలు**
**- ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన**
**- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి**

గద్వాల సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో) : సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజా రంజక పాలన సాగిస్తున్నట్లు న్యూఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. గురువారం ఐడిఓసి ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యూఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఏపీ జితేందర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు బొకేలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి అనంతరం గాంధీజీ, అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. తెలంగాణ, వందేమాతరం గీతాలను ఆలపించిన అనంతరం ముఖ్య అతిథి జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రసంగిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందని, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఆడపడుచులకు ఉచిత ప్రయాణ పథకములో భాగంగా జిల్లాలో ఇప్పటివరకూ సుమారు 3.36 కోట్ల మంది మహిళలు ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారన్నారు. దీని ద్వారా మహిళలకు రూ.129.03 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడంతో పాటు, ఈ పథకం క్రింద పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో, రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఈ పథకంలో భాగముగా ఇప్పటి వరకు 18,431 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించామని తెలిపారు. ఇందుకు గాను రూ.53.29 కోట్ల వ్యయము చేయడము జరిగిందన్నారు. ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన కేవలం ఎనిమిది నెలల కాలంలో జిల్లాలో 58,113 రైతులకు సంబంధించి రూ.513.99 కోట్ల పంట రుణమాఫీ చేసి రుణ విముక్తులను చేయడం జరిగిందన్నారు. రైతుకు పెట్టుబడి సాయం పెంచి, రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.12వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలలో నగదు జమచేయడం జరిగిందన్నారు. వివిధ పథకాలలో ఉత్తమ పని తీరు ర్యాంకింగ్ లో జోగుళాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలో 5వ స్థానముతో ప్రతిభ చాటిందని తెలిపారు. ఈ సంవత్సరం ఆగష్టు నుంచి అక్టోబర్ 2026కు గాను జిల్లాలో 1,90,671 రేషన్ కార్డుదారులలో 6,76,293 మందికి మూడు నెలలకు 12,110 మెట్రిక్ టన్నుల ఉచిత రేషన్ సన్న రకం బియ్యాన్ని 337 రేషన్ దుకాణాల ద్వారా లబ్దిదారులకు ముందుగానే పంపిణీ చేయడము జరిగిందని పేర్కొన్నారు. జిల్లా మొత్తం 1,89,757




స్మార్ట్ రేషన్ కార్డ్స్ ఇవ్వడము జరిగిందన్నారు. రాష్ట్రంలో మొదటి దశలో నిరుపేదలకు నియోజక వర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం జరిగిందన్నారు.రెండవ దశలో గుడిసెల్లో నివసించే వారు పక్క గృహాలు నిర్మించుకునేశీదుకు నియోజక వర్గానికి 2,000 చొప్పున ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి లబ్దిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. 500 రూపాయలకే వంట గ్యాస్ పథకం క్రింద జిల్లాలో ఇప్పటివరకు జిల్లాలో 95,754 మందికి లబ్ధి చేకూర్చడము జరిగిందని పేర్కొన్నారు. దీనికి గాను ప్రభుత్వం రూ.19.98 కోట్ల సబ్సిడీ అందజేయడము జరిగిందన్నారు. గృహజ్యోతి పథకం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకూ 88,766 కుటుంబాలకు సంబంధించిన 21,23,571 జీరో బిల్లులకు సంబంధించి రూ.57.08 కోట్ల సబ్సిడీని ఇవ్వడము జరిగిందన్నారు. సామాజిక భద్రతలో భాగముగా చేయూత పెన్షన్ పథకము క్రింద జిల్లాలో 66,548 మంది లబ్దిదారులకు ప్రతి నెల రూ.16.23 కోట్ల పెన్షన్లు పంపిణీ చేయడము జరుగుతుందన్నారు. కొత్త పెన్షన్ లకీ 16 సెప్టెంబర్ 2026 వరకు జిల్లాలోని అన్ని మండలాలలో, మున్సిపల్ కార్యాలయాలలో దరఖాస్తులను స్వీకరిండము జరిగిందన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు అట్టి దరఖాస్తులను పరిశీలించడము జరుగుతోందన్నారు. జిల్లాలో 311 గ్రామ సంఘాల పరిధిలో 8015 స్వయం సహాయక సంఘాలలో 85,633 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరములో 7222 స్వయం సంఘాలకు రూ.212.65 కోట్ల బ్యాంక్ రుణ లింకేజీ లక్ష్యంగా ఇప్పటివరకు 868 స్వయం సహాయక సంఘాలకు రూ.92.88 కోట్ల రుణాలను మంజూరు చేయడము జరిగిందన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలులో జోగుళాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానములో ఉన్నది. జిల్లాలో ఇప్పటివరకు 827 మంది లబ్ధిదారులకు రూ.1.65 కోట్ల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగముగా మొదటి విడతలో జిల్లాకు రూ.4.68 కోట్ల వ్యయముతో 13 బస్సులను కేటాయించడం జరిగిందన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచేందుకు నిర్ణయము తీసుకుంటూ మంత్రివర్గం ఆమోదము తెలిపిందన్నారు. ఇందులో భాగముగా అవసరమైన భూసేకరణకు రూ.165 కోట్ల నిధులను ప్రభుత్వము మంజూరు చేసిందన్నారు. అలాగే గట్టు ఎత్తిపోతల ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి 3.0 టీఎంసీలకు పెంచుతూ రూ.1,781 కోట్లతో ప్రాజెక్ట్ రీ-డిజైన్ కు కూడా క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణ పనులను కూడా వేగవంతం చేసి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా హామ్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.339.39 కోట్ల నిధులు మంజూరు చేయడంతో రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవలే ధరూరు వద్ద శంకుస్థాపన చేశారన్నారు. గద్వాలలో మెడికల్ కళాశాల అకాడమిక్ బ్లాక్ తో పాటు వసతిగృహాల నిర్మాణానికి రూ.128 కోట్ల నిధులు మంజూరు చేసినందున పనులు కూడా ప్రారంభ మయ్యాయని తెలిపారు. గద్వాలలో రూ. 34.20 కోట్ల నిధులతో నర్సింగ్ కళాశాల భవనాలు, రూ.23.75 కోట్ల నిధులతో క్రిటికల్ కేర్ యూనిట్ భవనాలను నిర్మించగా త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందన్నారు. గద్వాలలో నూతనంగా ఆర్డీఓ కార్యాలయ భవన నిర్మాణానికి, రెండు నియోజకవర్గాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవన నిర్మాణాలతో పాటు కేటీ దొడ్డి, ఉండవెల్లి, రాజోలి మండలాల్లో తహసిల్దార్ కార్యాలయాల భవనాలను నిర్మించేందుకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. జిల్లాలో ఎస్ఐఆర్ లో భాగముగా ప్రస్తుతము మ్యాపింగ్ కానీ, అనామలిష్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీస్ లు ఇవ్వడము జరిగిందన్నారు. హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయడము జరిగిందనీ తెలిపారు. అక్షరాస్యతలో జోగుళాంబ గద్వాల జిల్లాను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వ విద్య సంస్థలను బలోపేతము చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతి సోమవారము ప్రజావాణి కార్యక్రమమును జిల్లా స్థాయిలో, రెవిన్యూ డివిజన్ స్థాయిలో, మండల స్థాయిలో కూడా నూతనంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలములో పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం పలు విద్యాసంస్థల చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిధులు ప్రశంసిస్తూ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలంపూర్ శాసనసభ్యులు విజేయుడు, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, రాష్ట్ర గొర్రెలు మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, వాల్మీకి బోయ కార్పోరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మంజుల, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్


గద్వాల సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న భవనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, ఆసుపత్రి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాలు, వైద్య పరికరాలు, సిటీ స్కాన్, ల్యాబొరేటరీ, తదితర పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిటీ స్కాన్ సేవలను సమర్థవంతంగా వినియోగించాలని, ఇన్‌పేషెంట్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోగుల రద్దీని నియంత్రించేందుకు టోకెన్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. రోగులకు అవసరమైన చోట అదనపు కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలోని సిబ్బంది క్వార్టర్స్ లో ఖాళీగా ఉన్న గదులు, భవనాలను పరిశీలించి అవసరమైన ప్రాథమిక మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. భవనాల స్థిరత్వాన్ని ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని తెలిపారు. పిల్లలకు అందించే వైద్య



సేవలను మరింత మెరుగుపరిచేందుకు అందుబాటులో ఉన్న గదులను వినియోగించుకోవాలని తెలిపారు. అవసరమైన మేరకు ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియరల్ థెరపీ, పిల్లల ఆట స్థలం వంటి సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి ప్రధాన ప్రవేశ మార్గాన్ని రోగులకు, అంబులెన్స్‌లు, ఇతర వాహనాలకు అనుకూలంగా ఉండేలా పునఃపరిశీలించాలని ఆదేశించారు. అవసరమైన చోట వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి, పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, అవసరమైన చోట పెయింటింగ్, వైట్‌వాషింగ్, శానిటేషన్, ఇతర సుందరీకరణ పనులు చేపట్టాలని తెలిపారు. ఆసుపత్రికి అనుకూలంగా ముఖ్యంగా పిల్లలకు ఆకర్షణీయంగా ఉండే విధంగా గోడలపై ఆరోగ్య అవగాహన చిత్రాలు వేయించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి పనులకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి చేయడంలో అలసత్వం వహించడం సరికాదన్నారు. కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోతే కారణాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుని పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ఆసుపత్రి సేవలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, ఆసుపత్రి పర్యవేక్షకులు ఝాన్సీ లక్ష్మి, ఆర్ఎంవో వెంకట దాస్, ఇతర అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సవరణలు వెంటనే తెలియజేయాలి

**- ఎన్నికల అధికారి / ముఖ్య కార్యనిర్వహణ అధికారి**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17,( విజన్ ఆంధ్ర) : ఓటరు ముసాయిదా జాబితా ప్రదర్శించడం జరిగిందని, జాబితాపై అభ్యంతరాలు, సవరణలు వెంటనే తెలియజేయాలని ఎన్నికల అధికారి/ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఏవైనా సవరణలు, అభ్యంతరాలు, మార్పులు ఉన్నట్లయితే ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎన్నికల అధికారి/ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అభ్యంతరాలు, సవరణలను పరిశీలించిన పిమ్మట ఓటరు జాబితాను 19వ తేదీన ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.

# ప్రజల ఆకాంక్షలే పాలనకు ప్రాతిపదిక

**- సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**- డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్**



బోడుప్పల్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాకు వందనం చేసి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షిస్తూ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వజ్రెష్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన ప్రజాపాలనకు నిదర్శనమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలను గుర్తించి పాలన సాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే కేంద్రబిందువని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, విలువలను కాపాడుతూ పాలన సాగించాల్సిన అవసరం ఉందని వజ్రెష్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మెడ్చల్ జిల్లా బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మకు కళ్యాణ్ కుమార్, చెంగిచర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ**





ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో నిర్వహించిన రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా కళ్ల అద్దాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా రెండో విడతలో భాగంగా 750 మంది లబ్ధిదారులకు రూ. 5 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 6 వేలకు పైగా ఇళ్లు మంజూరయ్యాయని, అర్హత ఉండి ఏ ఒక్కరికీ పథకం మిస్సయినా, తక్షణమే పరిశీలించి మంజూరు పత్రం అందజేస్తామని భరోసానిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి అనేక సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నామని వెల్లడించారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో భాగంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు సైతం మంజుయ్యాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక పాలనకు నిదర్శనమన్నారు. ఆదిలాబాదు జిల్లా విమానాశ్రయం నిర్మాణంతో జిల్లా రూపురేఖలు మారనున్నాయని, జిల్లా మరింత ఆర్థిక అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి సంక్షేమ పథకాలు చేరేలా యంత్రాంగం పారదర్శకంగా పనిచేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో భాగంగా తొమ్మిది మండలాల పరిధిలో సుమారు 700 మందికి మంజూరు పత్రాలు అందజేస్తున్నామని, అలాగే స్లాబ్ రిప్లేస్‌మెంట్, మొదటి విడత పెండింగ్ బిల్లుల చెల్లింపులు సైతం ప్రక్రియల వారీగా పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో ఆరోగ్య పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు, సర్జరీలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు నిరంతరం శ్రమిస్తారని ఆయన భరోసానిచ్చారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ... సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా, నిజమైన నిరుపేదలకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. ఇళ్లు లేని పేదవాళ్లను గుర్తించి, క్షేత్రస్థాయిలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలను అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను, విద్యార్థులకు కళ్ళ అద్దాలను ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే, కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్.రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, పిడి హౌసింగ్ శంకర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డిఈఓ మాధవి, ఆత్మ చైర్మన్ సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈల గ్రీనింగ్‌కు క్లీన్‌టెక్ స్వీకరణపై సీఐఐ సదస్సు



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : నగరంలో సీఐఐ నిర్వహించిన 25వ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్-2026లో భాగంగా హెచ్ఐసీసీలో ఎంఎస్ఎంఈల గ్రీనింగ్‌పై ప్రత్యేక కార్యక్రమం జరిగిందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రీనింగ్ మార్కెట్‌ప్లేస్ పోర్టల్‌ను పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్ డి.శ్రీనివాస్ నాయక్ తోకలసి జాయింట్ డైరెక్టర్ మధుకర్ బాబు, సమ్మిట్ చైర్మన్ తేజ్‌ప్రీత్ సింగ్ చోప్రా, రిచ్ డైరెక్టర్ శ్రీనివాస్ చెర్లా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సాంకేతికత, భాగస్వామ్యాలతో ఎంఎస్ఎంఈల శక్తి సామర్థ్యం, ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచాల్సిన అవసరాన్ని ముఖ్య అతిథులు వివరించారని తెలిపారు. రాంప్ కింద రిచ్, సిఐఐ సాంకేతిక భాగస్వామ్యంతో తెలంగాణలో సుమారు 2వేల ఎంఎస్ఎంఈలకు ఆర్ఈసీపీ అంచనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఘనంగా జాతీయ పతాకావిష్కరణ చేసిన, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యఅతిథి సిరిసిల్ల రాజయ్య,



నాగర్ కర్నూల్, జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 17, ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, , అదనపు కలెక్టర్లు దేవ సహాయం, బి. చెన్నయ్య, మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ సందేశం

సోదర సోదరీమణులారా ! : నేటి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా, స్వాతంత్ర్య సమరయోధులకు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, జిల్లాలోని ముఖ్యులకు, ఉద్యోగస్తులకు, విద్యార్థిని విద్యార్థులకు, మీడియా, పత్రికా ప్రతినిధులకు, ప్రత్యేకించి జిల్లా ప్రజలకు నా యొక్క హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# అన్ని రంగాల్లో భద్రాద్రి కొత్తగూడెం అభివృద్ధికి కృషి

**- ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట**

**- విద్య, వైద్యం, మౌలిక వసతులకు ప్రత్యేక ప్రాధాన్యత**

**- రహదారి, రైల్వే, విమాన రవాణా సౌకర్యాల విస్తరణకు చర్యలు**

**- ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, పర్యాటకం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లాకు విచ్చేసిన మంత్రికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రజా పాలన దినోత్సవ సందేశాన్ని అందించారు.

**తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యత**

అనంతరం నిర్వహించిన పత్రికా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని అన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు.

ప్రజల ఆకాంక్షల మేరకు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

**విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత**

పేద ప్రజల సంక్షేమంతో పాటు విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. యువతకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా విద్యా సంస్థలు, మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీతో పాటు ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో విద్య, వైద్య రంగాల్లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన వసతులను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

**రైతుల అభివృద్ధికి చర్యలు**

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సాగునీరు, విద్యుత్, మార్కెటింగ్, రవాణా సౌకర్యాలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**సింగరేణి, విద్యుత్ రంగాల్లో కీలక జిల్లా**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విస్తృతమైన సహజ వనరులు, అటవీ సంపద, గిరిజన సంస్కృతి, బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సింగరేణి సంస్థ ద్వారా బొగ్గు ఉత్పత్తిలో, పాల్వంచ థర్మల్ పవర్ స్టేషన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిలో జిల్లా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సహజ వనరులు, మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ అభివృద్ధిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు, విద్యుత్, వ్యవసాయం తదితర రంగాలతో పాటు ఉపాధి అవకాశాల విస్తరణకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

**రైల్వే కనెక్టివిటీ బలోపేతానికి చర్యలు**

జిల్లా సమగ్ర అభివృద్ధికి రహదారి, రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. పాండురంగాపురం నుంచి మాల్కంగిరి వైపు రైల్వే మార్గం అభివృద్ధి ద్వారా భద్రాచలానికి రైల్వే కనెక్టివిటీ కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైల్వే సౌకర్యాలు మెరుగుపడితే జిల్లాలో పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి మరింత అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు.

**నాలుగు లేన్ల రహదారి అభివృద్ధికి చర్యలు**

అమరావతిజగదల్‌పూర్ జాతీయ రహదారిని కొత్తగూడెం, భద్రాచలం మీదుగా నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కొత్తగూడెంఇల్లెందుహైదరాబాద్ మార్గాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు జిల్లాలోని ఇతర ప్రధాన రహదారులను కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మెరుగైన రహదారి సౌకర్యాలు జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని పెంచడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు, పర్యాటక అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.



**విమానాశ్రయ ఏర్పాటుకు ప్రయత్నాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రహదారి, రైల్వే రవాణాతో పాటు గోదావరి నదీ మార్గం ద్వారా రవాణా అవకాశాలను అభివృద్ధి చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా జిల్లాలో పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు.

**పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం**

భద్రాద్రి జిల్లాకు ఉన్న అటవీ సంపద, గోదావరి పరివాహక ప్రాంతం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, గిరిజన సంస్కృతి వంటి ప్రత్యేకతలను దృష్టిలో ఉంచుకుని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలతో జిల్లాకు వచ్చే పర్యాటకులు, భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

**అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, పర్యాటకం, మౌలిక వసతులు తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం. విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి

**- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపు**

**- సింగరేణి భవన్‌లో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు**



కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ఇంధన అవసరాలను సమర్థవంతంగా తీర్చడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధిలో సింగరేణి తనవంతు కీలక పాత్ర పోషించాలని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలు ఉన్నందున, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును తగినంతగా సరఫరా చేస్తూ రాష్ట్ర ఇంధన భద్రతకు సింగరేణి మరింతగా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం సింగరేణి భవన్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధితో పాటు దేశ పురోభివృద్ధిలో ప్రతీ ఉద్యోగి తనవంతు బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణికి ప్రత్యేక స్థానం ఉందని సీఎండీ పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలు, దేశ పురోగతిని దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.దసింగరేణి సాధిస్తున్న విజయాల్లో కార్మికులు, ఉద్యోగులు, అధికారుల, యూనియన్ నాయకుల అందరి భాగస్వామ్యం ఉందని పేర్కొంటూ, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరింత మెరుగైన ఫలితాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈడీ(కోల్ మూవ్ మెంట్ ) బి.వెంకన్న , జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి .శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**-వెయ్యి రోజుల పాలనలో సంక్షేమం,అభివృద్ధికి ప్రాధాన్యం**

**-బస్‌డిపో,బైపాస్‌తో పెద్దపల్లికి మౌలిక వసతుల ఊతం**

**-పరిశ్రమల రాకతో జిల్లాలో ఉపాధి అవకాశాల పెంపు**

**-ప్రజాపాలన దినోత్సవంలో ప్రభుత్వ విప్ విజయరమణారావు**





పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్-17(విజన్ ఆంధ్ర) : ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం పెద్దపల్లి ఐడీఓసీలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు సంక్షేమం, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, ఆరోగ్యశ్రీ, విద్యావైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లాలో 1.19 లక్షల మంది మహిళలకు రూ.500కే 4.74 లక్షల సిలిండర్లు, 1,40,116 కుటుంబాలకు ఉచిత విద్యుత్, 5,982 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.135 కోట్ల సాయం అందించామని వివరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా 48,188 మందికి రూ.120.56 కోట్ల ప్రయోజనం కల్పించామన్నారు. మంథనిలో రూ.7.50 కోట్లతో ఏర్పాటు చేసిన కేంద్రీకృత వంటశాల ద్వారా 694 పాఠశాలలు, 17 జూనియర్ కళాశాలల్లోని 40 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి బస్‌డిపోకు రూ.8.40 కోట్లు, బైపాస్ రోడ్డుకు రూ.82 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. టీజీఐపాస్ ద్వారా 31 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చి 346 ఉద్యోగ అవకాశాలు కల్పించామని, కోకాకోలా సంస్థ రూ.700 కోట్లకు పైగా పెట్టుబడితో జిల్లాకు రానుందని, రామగిరి మండలం రత్నాపూర్‌లో పరిశ్రమ ఏర్పాటుకు భూమిని గుర్తించామని చెప్పారు. పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. నందిమేడారంలో రూ.51.28 కోట్లతో 7,682 కిలోవాట్ల సోలార్ మోడల్ ప్రాజెక్టు, పీఎం సూర్యఘర్ ద్వారా 1,517 సోలార్ కనెక్షన్లు, పీఎంకుసుమ్ కింద 9.50 మెగావాట్ల ప్రాజెక్టులకు చర్యలు చేపట్టామని ప్రభుత్వ విప్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.శ్రీరాములు, డీసీపీ రాంరెడ్డి, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, ఆర్డీఓ బి.గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, కలెక్టరేట్ ఏఓ ప్రకాష్, ఏసిపి జి. కృష్ణ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా కిట్ల పంపిణీ చేసిన బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొర్ర సుమలత.



ములుగు, సెప్టెంబర్ 17 విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా చేపట్టిన సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ములుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొర్ర సుమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందించి చదువులో ప్రోత్సాహం కల్పించడమే లక్ష్యమని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదివి దేశానికి బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా మోర్చా సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన జగిత్యాల జిల్లా పోలీసులు



జగిత్యాల సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో): తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని, ప్రజలకు మరింత చేరువగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఏ.ఓ. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, లక్ష్మీ నారాయణ, రాజ్ కుమార్, శ్రీధర్, ఆర్ఐ వేణుతో పాటు ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ మండలి అన్న ప్రసాదాన్ని పంపిణీ చేసిన ఎస్పీ రాజేష్ చంద్ర

**- భక్తి, భద్రత, బాధ్యతతో ఉత్సవాలను విజయవంతం చేయాలి**

**- శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు, నిర్వాహకులు భాగస్వాములు కావాలని పిలుపు**



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 17 (విజన్ఆంధ్ర) : గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎస్పీ అన్నదాన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం పోలీస్ అధికారులు, ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్ మరియు సిబ్బందితో కలిసి భోజనం చేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... "కామారెడ్డి జిల్లాకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇక్కడి ప్రజలలో ఉండే ఆత్మీయత, పరస్పర సహకారం, ఐకమత్యం జిల్లా ప్రత్యేకతకు అద్దం పడతాయి. అధికారులు, సిబ్బంది పరస్పరం సమన్వయంతో, అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి" అని సూచించారు. జిల్లా ప్రజలందరూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ఉత్సవాల నిర్వహణలో మండప నిర్వాహకులు పోలీస్ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలు, నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు. "భక్తి, భద్రత, బాధ్యత" అనే సూత్రాన్ని పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతమైన, ఆనందదాయకమైన వాతావరణంలో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌ఓ బి. నరహరి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు పోలీస్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ నాయకత్వంలో దేశానికి అంతర్జాతీయ గుర్తింపు

**- బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 ( విజన్ ఆంధ్ర) : ప్రధాని జన్మదినం పురస్కరించుకొని, పూజలు రక్తదాన శిబిరం ఏర్పాటుప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత గుర్తింపు, గౌరవం లభించిందని భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు.ప్రధాని మోడీ 76వ జన్మదినం,ఆయన 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకొని గురువారం వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.తెలంగాణ విమోచన దినోత్సవం పరిష్కరించుకొని జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బైరి శంకర్ ముదిరాజ్మాట్లాడుతూ..మోదీ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు,విదేశాంగ విధానాలు దేశాన్ని ప్రపంచ వేదికపై ఒక శక్తివంతమైన దేశంగా నిలిపాయని కొనియాడారు. ప్రధాని దీర్ఘాయువు, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ పూజలు జరిపించామన్నారు. సేవ పక్షంలో భాగంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. మోదీనాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, రక్షణ, సాంకేతికత రంగాలలో ఇతరదేశాలపై ఆధారపడటం తగ్గించి,స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు పడ్డాయని కొనియాడారు.కరోనా కష్టకాలం నుండి ఇప్పటివరకు పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కేంద్రంలోని మోడీ ప్రభుత్వానిది అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారివెంకట్, కసనగొట్టు సంతోష్,తుంగ కనకయ్య,ఉమారెడ్డి,బొమ్మగానిపద్మ,గుండ్ల జనార్దన్, వనజ, గందె సంతోష్ ,కొంగరపవన్,బండారం కనకరాజ్,కంది విజయ,మహేందర్ రావు,ఎర్వ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ నైపుణ్యంతో సమాజ అభివృద్ధి సాధించాలి

**- సృజనాత్మకతను ప్రదర్శించే పిల్లలను ప్రోత్సహించాలి: సీతా దయాకర్ రెడ్డి**

**- పిల్లల సంక్షేమం, విద్యకు కమిషన్ కృషి: చైర్‌పర్సన్**

**- విశ్వకర్మను పరబ్రహ్మ స్వరూపంగా భావించాలి: కలెక్టర్ హైమావతి**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి, సీపీ సాధనా రష్మీ పెరుమాళ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, కళాత్మకంగా రూపొందించే ప్రతి వస్తువులో విశ్వకర్మ పాత్ర ఉంటుందని తెలిపారు. పుట్టిన బిడ్డ నుంచి 8 సంవత్సరాల వయస్సు వరకు పిల్లల శ్రేయస్సు, విద్య కోసం కమిషన్ కృషి చేస్తోందన్నారు. వివిధ రంగాల్లో సృజనాత్మకతను ప్రదర్శించే పిల్లలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. అనాదరణకు గురైన పిల్లలకు వృత్తి నైపుణ్యాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా విశ్వకర్మ నైపుణ్య సంప్రదాయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, విశ్వకర్మ పరమాత్మ సృష్టికర్తగా భావించబడుతున్నారని తెలిపారు. కమ్మరి, కంసాలి, వడ్రంగి, శిల్పి, కాంస్యకారులు వంటి వృత్తుల అభివృద్ధిలో విశ్వకర్మకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనేక నిర్మాణాలు, వస్తువుల తయారీలో వృత్తి నిపుణుల సృజనాత్మకత కీలకమని పేర్కొన్నారు. విశ్వకర్మ దేవతలకు ఆయుధాలను తయారు చేసి అందించారని, ఆయనను పరబ్రహ్మ స్వరూపంగా భావించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ దైవాన్ని ప్రార్థిస్తూ దైవానుగ్రహం పొందాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, డీఆర్వో, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఐడీఓసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేధింపులకు చెక్.. మహిళల భద్రతకు షీ టీమ్స్ అండ

**- భయపడకుండా ఫిర్యాదు చేయాలి.. సమస్యను గోప్యంగా పరిష్కరిస్తాం**

**- రాగింగ్, టీజింగ్, బ్లాక్‌మెయిలింగ్‌పై కఠిన చర్యలు**

**- విద్యార్థినులకు షీ టీమ్ ఎస్ఐ రమాదేవి అవగాహన**




కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర) : మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని షీ టీమ్ ఎస్ఐ రమాదేవి సూచించారు. మహిళల భద్రతకు షీ టీమ్స్ ప్రత్యేకంగా పనిచేస్తున్నాయని, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, బాలికలకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపడమే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గురువారం కొత్తగూడెంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మహిళా భద్రత, షీ టీమ్స్‌పై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ.. మహిళలు, బాలికలు రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న వివిధ రకాల వేధింపులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా కళాశాలలు, బస్టాండ్లు, బస్సులు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో రాగింగ్, టీజింగ్, వెంటపడటం, అసభ్యంగా ప్రవర్తించడం, అనుచితంగా తాకడం లేదా తోయడం, బ్లాక్‌మెయిలింగ్, తప్పుడు ఫోన్ కాల్స్, అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడం వంటి ఘటనలు ఎదురైతే వాటిని నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు.

**ఫిర్యాదు చేయడానికి భయపడొద్దు**

చాలామంది మహిళలు, విద్యార్థినులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి భయపడుతుంటారని, అలాంటి వారి కోసమే షీ టీమ్స్ ప్రత్యేకంగా అందుబాటులో ఉంటాయని రమాదేవి వివరించారు. బాధితులు తమ సమస్యను షీ టీమ్‌కు నేరుగా తెలియజేయవచ్చని చెప్పారు. ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో పాటు వాట్సాప్‌లో మెసేజ్, వాయిస్ రికార్డింగ్ పంపవచ్చని, అవసరమైతే తమ సమస్యను రాతపూర్వకంగా కూడా తెలియజేయవచ్చని సూచించారు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, అవసరాన్ని బట్టి షీ టీమ్స్ బాధితుల వద్దకు చేరుకుని సమస్య పరిష్కారానికి సహకరిస్తాయని తెలిపారు. ఫిర్యాదు చేసిన మహిళ లేదా బాలిక వ్యక్తిగత వివరాలను, ఆమెకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

**సోషల్ మీడియా విషయంలో అప్రమత్తత అవసరం**

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా, మొబైల్ ఫోన్ల వినియోగం పెరిగిన నేపథ్యంలో మహిళలు, బాలికలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిచయం లేని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు పంపకూడదని, అనుమానాస్పదమైన లింకులు, మెసేజ్‌లకు స్పందించకూడదని సూచించారు. ఎవరైనా ఫోన్ ద్వారా బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం లేదా అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడం వంటి చర్యలకు పాల్పడితే ఆధారాలను తొలగించకుండా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

**మైనర్ల విషయంలో కౌన్సెలింగ్**

మైనర్లు తప్పు చేసిన సందర్భాల్లో వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులను పిలిపించి పరిస్థితిని వివరించి, అవసరమైన కౌన్సెలింగ్ అందిస్తామని తెలిపారు. అయితే నేరం తీవ్రతను బట్టి చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

**చట్టాలపై అవగాహన**

మహిళలు, బాలలు, ఇతర బలహీన వర్గాల రక్షణ కోసం అమలులో ఉన్న వివిధ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, ఎస్సీ/ఎస్టీ చట్టం, సీనియర్ సిటిజెన్స్ రక్షణకు సంబంధించిన చట్టాలు తదితర నిబంధనల గురించి వివరించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు, ఇతరులకు కూడా అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి**

మహిళలు, బాలికలు ఎలాంటి సమస్య ఎదురైనా మౌనంగా ఉండకుండా ధైర్యంగా స్పందించాలని ఎస్ఐ రమాదేవి సూచించారు. విద్య ప్రతి మహిళకు ఎంతో ముఖ్యమని, విద్యతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను మరింత ధైర్యంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. తమపై నమ్మకం పెంచుకుని, జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకుంటూ లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు.

**అత్యవసర సమయంలో 112కు కాల్**

ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని చెప్పారు. వేధింపులకు పాల్పడే వ్యక్తులను ప్రోత్సహించకుండా, ఘటనలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించడం ద్వారా మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థినులకు మహిళా భద్రత, వ్యక్తిగత రక్షణ, చట్టపరమైన హక్కులు, షీ టీమ్స్ సేవలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై వివరంగా అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు భయాన్ని వీడి సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, వారి భద్రతకు పోలీసు శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని షీ టీమ్ ఎస్ఐ రమాదేవి స్పష్టం చేశారు.

**భరోసా, సఖి టీమ్‌ల భాగస్వామ్యం**

ఈ అవగాహన కార్యక్రమంలో భరోసా టీమ్, సఖి టీమ్ సభ్యులు కూడా పాల్గొని మహిళలు, బాలికలకు అందుబాటులో ఉన్న రక్షణ, సహాయ సేవలు, సమస్యలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే వేధింపులు లేదా ఇతర సమస్యలను దాచిపెట్టకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖతో పాటు భరోసా, సఖి వంటి సేవా బృందాలు అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు, షీ టీమ్, భరోసా టీమ్, సఖి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ వృత్తులకు చేయూతనిచ్చి.. నైపుణ్యాలను కాపాడాలి

**- విశ్వకర్మ వృత్తిదారులకు ఆర్థిక సహాయం అందించాలి**

**- ప్రతి కుటుంబంలో ఒకరికి నైపుణ్య శిక్షణ ఇవ్వాలి: అదనపు కలెక్టర్ కిరణ్మయి**




మానవ అవసరాలను తీర్చిన గొప్ప శిల్పి విశ్వకర్మ: జి. మల్లేష్ యాదవ్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 17 : రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేషు రామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ కుల సంఘాల నాయకులు హాజరై విశ్వకర్మకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, జీవనోపాధికి నైపుణ్యాలు ఎంతో అవసరమని అన్నారు. పిల్లలకు విద్యతో పాటు వంటలు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ అవసరాలకు అనుగుణంగా వివిధ వస్తువుల తయారీ, వృత్తి నైపుణ్యాలను విశ్వకర్మ ముందుగానే అందించారని పేర్కొన్నారు. విశ్వకర్మ వృత్తుల్లోని వడ్రంగి, కమ్మరి, శిల్పి, కంచరి, స్వర్ణకార వృత్తిదారులు ప్రస్తుతం ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ద్వారా వారికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికైనా నైపుణ్య శిక్షణ ఇచ్చి సంప్రదాయ వృత్తులను కాపాడుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, విరాట్ విశ్వకర్మ జయంతి సృష్టికి మూలపురుషుడైన దేవశిల్పి విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలని అన్నారు. సకల శాస్త్రాలు, వేదాలకు విశ్వకర్మ మూలమని, నిర్మాణ కళకు ఆద్యుడిగా ఆయనను గౌరవిస్తారని పేర్కొన్నారు. మానవ అవసరాలను తీర్చేందుకు అనేక వస్తువులను సృష్టించిన గొప్ప ఇంజనీర్‌గా విశ్వకర్మను కొనియాడారు. స్వర్ణలంక, ద్వారకానగరం, హస్తినాపురం, ఇంద్రప్రస్థ నగరాల నిర్మాణం ఆయన శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటాచారి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ, పీసీసీ కార్యదర్శి శివకుమార్, వివిధ కుల సంఘాల నాయకులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిలీ ప్రింటర్‌తో ఏపీ విద్యార్థినికి జేమ్స్ డైసన్ అవార్డు





హైదరాబాద్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన లింగంపల్లి హిమజ రూపొందించిన వాయిస్-ఎనేబుల్డ్ బ్రెయిలీ ప్రింటర్ 'రుద్ర'కు జేమ్స్ డైసన్ అవార్డు-2026 భారత జాతీయ విజేతగా గుర్తింపు లభించింది. శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్‌కు చెందిన హిమజకు సుమారు రూ.6 లక్షల నగదు బహుమతి అందనుంది. 'వయబిలిటీ ఎక్స్'తో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, అహ్మదాబాద్‌కు చెందిన అన్వికా శెట్టి ఫస్ట్ రన్నరప్‌గా, 'ట్రెక్ 2'తో అన్నా యూనివర్సిటీకి చెందిన షకీల్ అక్తర్ ఎస్ రెండో రన్నరప్‌గా నిలిచారు. ఈ మూడు ఆవిష్కరణలు జేమ్స్ డైసన్ అవార్డు అంతర్జాతీయ రౌండ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాయి. తుది విజేతలను సర్ జేమ్స్ డైసన్ ఎంపిక చేయనున్నారు.

# ఘనంగా విరాట్ విశ్వకర్మ జయంతి



రంగారెడ్డి జిల్లా బ్యూ రో, సెప్టెంబర్ 17, ( విజన్ ఆంధ్ర ) : రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కేషు రామ్ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ కుల సంఘాల నాయకులు హాజరై విశ్వకర్మకు నివాళులర్పించారు. విరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ మనం జీవించడానికి స్కిల్ నైపుణ్యం అవసరం మనము మన పిల్లలని పాఠశాల పంపించి చదువు నేర్పించి ఏది ఏ విధంగా చేయాలో నేర్పిస్తాం అదేవిధంగా ఏ విధంగా వంటలు చేయాలి, ఏ విధంగా వ్యవసాయం చేయాలి, ఏ విధంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలి అని నేర్పిస్తాం కానీ విరాట్ విశ్వకర్మ గారు మనకు ఏమి కావాలో మానవ అవసరానికి ఏది అవసరం ఉంటుంది. ఏదైతే మన జీవన మనుగడకు అవసరమవుతుందో ఆయన ముందే అన్నియు మనకు నేర్పించారని ఆమె తెలిపారు. విశ్వకర్మలోని ఐదు భాగాలైన వడ్రంగి కమ్మరి శిల్పి కంచరి మరియు గోల్డ్ స్మిత్ వీరందరూ కూడా ఈరోజుల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీరికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించి కుటుంబంలో ఒక్కరినైనా నైపుణ్యం నేర్పించి ఈ వృత్తులని కాపాడుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ విరాట్ విశ్వకర్మ జయంతి అంటే సృష్టికి మూలపురుషుడు దేవ శిల్పి అయిన విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి వేడుక అని అన్నారు. సకల శాస్త్రాలకు సకల వేదాలకు మూలం విరాట్ విశ్వకర్మ అంతేకాకుండా విరాట్ విశ్వకర్మ అంటే గాడ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అని ఆయన కొనియాడారు. విశ్వకర్మ మానవ అవసరాలకు ఏమి కావాలను ఈ భూమి మీద మానవ మంగళ సాధించడం కోసం ప్రతి వస్తువును తయారుచేసిన గొప్ప ఇంజనీర్ అని అన్నారు. అంతేకాకుండా కృతయుగంలో స్వర్ణ లంక ద్వాపర యుగంలో ద్వారకానగరం కలియుగంలో హస్తినాపురం మరియు ఇంద్రప్రస్థ నగరాన్ని నిర్మించిన గొప్ప శిల్ప కళ నైపుణ్యానికి నిదర్శనం అని అన్నారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వెంకటాచారి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ పీసీసీ కార్యదర్శి శివకుమార్ మరియు వేద కుల సంఘాల నాయకులు బీసీ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ల పరిశీలన



కామారెడ్డి బ్యూరో (దోమకొండ) సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న చేయూత పెన్షన్ పథకంలో భాగంగా అప్లై చేసుకున్న పెన్షన్స్ లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్లో పరిశీలనలో భాగంగా స్టేట్ సెర్ప్ డైరెక్టర్ గోపాల్ రావు పరిశీలించారు . లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి వివరాలను ఆన్లైన్లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి , అదనపు డి ఆర్ డి ఓ విజయ లక్ష్మి , ఎంపీడీవో మధురిమ , డిపిఎం సురేష్ కుమార్, సుధం.వెంకటేశం , పంచాయతీ సిబ్బంది, ఏపిఎం , సిసి లు తదితరులు పాల్గొన్నారు.

# తీవ్రమైన న్యుమోనియాతో ప్రాణాపాయ శ్వాస వైఫల్యం

**- యశోదవైద్యుల విజయవంతమైన చికిత్స**

**- పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి**

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 ( విజన్ ఆంధ్ర ) : తీవ్రమైన న్యుమోనియాతో ప్రాణాపాయ శ్వాస వైఫల్యంరేషియో 115కు పడిపోయిన మధ్య వయస్సు మహిళకు శ్వాస సహాయంతోమలక్పేట్ యశోదా వైద్యుల విజయవంతమైన చికిత్స కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి అన్నారు. గురువారం హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి మాట్లాడుతూ కొన్ని రోజులుగా జ్వరం కొనసాగుతూ, దానికి తోడు ఆయాసం పెరుగుతుంటే సాధారణ ఇన్ఫెక్షన్గా భావించి నిర్లక్ష్యం చేయకూడదు. తీవ్రమైన న్యుమోనియా రెండు ఊపిరితిత్తులను ప్రభావితం చేసి రక్తంలోకి ఆక్సిజన్ చేరే ప్రక్రియను తీవ్రంగా దెబ్బతీసి, ప్రాణాపాయమైన అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ శ్వాస వైఫల్యానికి దారితీయవచ్చు.




ఇలాంటి అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో మధ్య వయస్సు మహిళ మలకేపేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా చికిత్స అందించారు. వారం రోజులుగా విడతలవారీగా జ్వరం, తలనొప్పి, రెండు రోజులుగా గ్రేడ్-3 ఆయాసం, ఒకరోజుగా నడుము పక్కభాగంలో నొప్పితో ఆమె ఆసుపత్రికి వచ్చారు. పరీక్షల్లో రెండు ఊపిరితిత్తుల్లో తీవ్రమైన కమ్యూనిటీ అక్వైర్డ్ న్యుమోనియా, రేషియో 115లో తీవ్రమైన టైప్-1 రెస్పిరేటరీ ఫెయిల్యూర్ ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో సరైన సమయంలో శ్వాస సహాయం మానిటరింగ్ సమన్వయంతో కూడిన క్రిటికల్ కేర్ చికిత్స ద్వారా అత్యంత క్లిష్టమైన దశలో రోగికి అవసరమైన సహాయం అందించగలిగామని పేర్కొన్నారు. తీవ్రమైన న్యుమోనియా కొన్ని సందర్భాల్లో వేగంగా విషమించి శ్వాస వైఫల్యం వంటి ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయవచ్చని మలక్పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది, జ్వరం తగ్గకుండా కొనసాగడం, ఆయాసం పెరగడం, వేగంగా శ్వాస తీసుకోవడం లేదా ఆక్సిజన్ సాచ్యురేషన్ తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వినయ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ వాసు కిరణ్ రెడ్డి, ప్రశాంత్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ లో ప్రజా పాలన దినోత్సవం



కాటారం డివిజన్ ప్రతినిధి సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుల ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రభుత్వం ఇంది రమ్మ రాజ్యాన్ని నడిపిస్తుందని, రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రజాపాలన ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ ప్రహ్లాదరెడ్డి, డైరెక్టర్లు పిల్లమారి రమేష్, తిరుపతిరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డి సి సి కార్యదర్శి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కుంభం రమేష్ రెడ్డి, కుంభం స్వప్న రెడ్డి, డాక్టర్ ఎలుబాక సుజాత, సిబ్బంది, రైతులు జాతీయ పతాక ఆవిష్కరణ, ప్రజాపాలన సంబరాల కార్యక్రమంలో పాల్గొన్నారు. తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ నాగరాజు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆద్దూరి బాబు తదితరులు పాల్గొని ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు.

## బాధిత కుటుంబానికి అండగా అనంతుల ప్రశాంత్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా కేంద్రంలో కొండపాక మండలం చెందిన మాజీ జెడ్పీటీసి అనంత అశ్విని ప్రశాంత్ఆదలో ఉన్న దుంపల పల్లి లక్ష్మణ్ అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అతనికి 1,50,000 ఎల్ఓసి ఇప్పించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం కంటే గొప్ప మానవత్వం మరొకటి లేదు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, అవసరమైన సమయంలో ముందుకు వచ్చి సహాయం చేయడం అనంతుల ప్రశాంత్ అన్న సేవా తత్వానికి నిదర్శనం. మాటల్లో కాదు చేతల్లో సేవచేసే ఉన్నవారికి అండగా ప్రజల కోసం నిరంతరం ముందుకు సాగే నాయకత్వం. ఈ ఎల్ఓసి అందేందుకు సహకరించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు, మాజీ మంత్రి హరీష్ రావు గారు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి గారు, వంటేరు ప్రతాప్ రెడ్డి గారు, అనంతుల ప్రశాంత్ అన్న గారికి బాధిత కుటుంబం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.

## తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**- సీపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీపీ రశ్మి పెరుమాళ్, ఐపీఎస్ ఎప్పుడుదింటి**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 ( విజన్ ఆంధ్ర) : 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం 'పురస్కరించుకుని కమిషనరేట్కార్యా లయంలో సీపీ రశ్మి పెరుమాళ్, ఐపీఎస్జాతీయ పతాకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి సీపీ మాట్లాడుతూ. "చరిత్రను పరిశీలిస్తే, ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం ఎంతోమంది పోరాటాలు, ప్రాణ త్యాగాల వల్ల మాత్రమే సాధ్యమైందనిఅర్థమవుతుంది. నాటి త్యాగధనులు సాధించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడే బాధ్యత ఎక్కువగా పోలీసు వ్యవస్థపై ఉందన్నారు. ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగాజీవించగలుగుతున్నారు అంటే పోలీస్ శాఖ ఎల్లవేళలా విధుల్లో ఉండటం వలన అని పేర్కొన్నారు, ఈ రోజు మన విధి నిర్వహణ పట్ల మనకున్న నిబద్ధతను, గౌరవాన్ని మరొకసారి గుర్తుచేస్తుందని తెలిపారు.ప్రజా హక్కులను కాపాడటంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని, విధుల నిర్వహణలో పూర్తి నిష్పాక్షికతను పాటించాలని సూచించారు. జాతీయజెండాను ఆవిష్కరించుకోవడం అనేది రాజ్యాంగం మనకు ఇచ్చిన అధికారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దుర్వినియోగం చేయకుండా, అత్యంత ఆత్మవిశ్వాసంతో, తటస్థంగా సేవలు అందిస్తామని ప్రతిజ్ఞ పూనేందుకు ఒక గొప్ప సందర్భం అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి అడ్మిన్ కుశాల్కర్ గారు, అదనపు డిసిపి (ఏఆర్) సుభాష్ చంద్రబోస్ గారు, ఇన్స్పెక్టర్ కిరణ్, రిసర్వ్ ఇన్స్పెక్టర్లు,ఆర్ఎస్ఐలు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్ రెడ్డి

**- నూతనంగా నియమితులైన సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి**



బోడుప్పల్,సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర) : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా అలుగువెల్లి సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డిని బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ భవిష్యత్తులో మరింత రాజకీయ ఉన్నతిని సాధించాలని వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో మేడిపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రాల వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ సంబురాలు..



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి .. ఈ సందర్భంగా జాతి నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి తదనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు అత్యంత ప్రాముఖ్యత కలిగిన చారిత్రక దినమని అన్నారు. నిజాం పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం, చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి నిర్ణయాత్మక నాయకత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిందని పేర్కొన్నారు. తెలంగాణ విమోచన చరిత్ర కేవలం ఒక తేదీ కాదని, అది ప్రజల పోరాటం, త్యాగం, స్వాభిమానం, జాతీయ సమైక్యతకు ప్రతీక అని అన్నారు. ఈ చరిత్రను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రెండేళ్ల ప్రజా పాలన ప్రస్థానంలో..గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి తెలంగాణను దేశానికే దిక్సూచిగా నిలబెట్టిందన్నారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవాన్ని అందించి ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ గ్రేడ్ సెక్షన్ ఆఫీసర్ విట్టల్, మార్కెట్ కమిటీ పాలక వర్గ సభ్యులు, డైరెక్టర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**ఎస్పీ క్యాంపు కార్యాలయం నందు మరియు పోలీసు ముఖ్య కార్యాలయం నందు జాతీయ పతాకాన్నీ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ**



ఆదిలాబాద్ జిల్లా ( విజన్ ఆంధ్ర బ్యూరో)తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని పోలీసు కార్యాలయాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈరోజు ఉదయం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం నందు మరియు జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజలకు, సిబ్బందికి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మొదటగా ప్రముఖుల చిత్రపటాలకు నివాళు లర్పించి పోలీసు గౌరవ వందనాల నడుమ జాతీయ పతాకాన్ని సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించడం జరిగింది. సిబ్బందికి మిఠాయిలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని దానికి, ప్రతి ఒక్కరూ మరింత కృత నిశ్చయంతో విధులను నిర్వర్తించి దేశంలోని తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉండే విధంగా గెలిచేందుకు కృషి చేయాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం ఒకప్పటి హైదరాబాద్ రాష్ట్రం 1948 సెప్టెంబర్ 17వ తారీఖున భారత యూనియన్ నందు విలీనమైన సందర్భంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ సాధించడానికి కృషి చేసిన మహనీయులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు పి మౌనిక ఐపీఎస్, బి సురేందర్ రావు, ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది డిపిఓ కార్యాలయం ఏవో శివ కుమార్, సూపర్డెంట్లు సులోచన, సంజీవ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ భవన్‌లో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17( విజన్ ఆంధ్ర ) : జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల దశాబ్దాల నిరంకుశ పాలన నుంచి విముక్తికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సెప్టెంబర్ 17వ తేదీ నిదర్శనమని పేర్కొన్నారు. సాయుధ పోరాట యోధుల వీరోచిత త్యాగాలు, అమరవీరుల బలిదానాల పునాదులపైనే నేడు తెలంగాణలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని అన్నారు.గత పాలకుల హయాంలో ప్రజల గొంతుకలను అణచివేసే ప్రయత్నాలు జరిగాయని ఆమె విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు చేరువగా 'ప్రజాపాలన' అందిస్తోందని తెలిపారు.నాడు సోనియా గాంధీ ఇచ్చిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు ద్వారా ప్రజల వద్దకు తీసుకెళ్తోందని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వానికి తలుపులు తెరిచి పనిచేస్తున్నామని పేర్కొన్నారు.వరంగల్ పార్లమెంట్ సభ్యురాలిగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్‌రావు, లైబ్రరీ చైర్మన్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి, జిల్లా చైర్మన్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఆర్‌జీపీఆర్ఎస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజాపాల దినోత్సవం

**- జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన బీసీ మహిళ కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద**



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 17(విజన్ఆంధ్ర) : ప్రజా పాలనలో పారదర్శకత, అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంనిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన చారిత్రక రోజు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ముఖ్య అతిథి నేరెళ్ల శారదకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించారు.ముఖ్య అతిథి నేరెళ్ల శారద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమెతో పాటు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అధికారులు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాన్ని ప్రతిబింబించేలా వివిధ కళారూపాలను ప్రదర్శించారు. దేశభక్తి గీతాలు, తెలంగాణ జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. కళాకారుల ప్రదర్శనలను ముఖ్య అతిథి, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఆసక్తిగా తిలకించి అభినందించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీమతి నేరెళ్ల శారద మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం రాష్ట్ర చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని పేర్కొన్నారు. నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకోవడంతో పాటు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ప్రజా పాలనలో పారదర్శక పాలన, అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక సమానత్వం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం కామారెడ్డి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ముఖ్య అతిథి వివరించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, సాంస్కృతిక కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యాలకు పెద్దపీట వేయాలి

**- ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ శాఖల ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్**



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)సమాజ అభివృద్ధిలో వృత్తి నైపుణ్యాలు కలిగిన విశ్వకర్మల పాత్ర ఎంతో కీలకమని, వారి సంక్షేమానికి ప్రభుత్వం సముచిత ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. గురువారం ఆదిలాబాదు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో శ్రమకు, సాంకేతికతకు రూపమిచ్చిన విశ్వకర్మ సేవలు చిరస్మరణీయమని, వారి అభ్యున్నతికి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాల ద్వారా భవిష్యత్ తరాలకు వారి సేవలు తెలియజేయవచ్చని, తద్వారా యువత మంచి మార్గాన్ని ఎంచుకునే ఆస్కారం ఉందన్నారు. ప్రతి ఒక్కరు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సమాజానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న చేతివృత్తుల వారిని అన్నివిధాలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. జిల్లాలో విశ్వకర్మ వంశీయుల అభ్యున్నతికి, ప్రభుత్వ పథకాలు అర్హులైన అందరికీ అందేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశ్వకర్మ రుణాలను సైతం అందించడం జరుగుతుందని, యువత వారి వృత్తిగత నైపుణ్యాలను మెరుగుపరచుకొని ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ.. కులవృత్తులను నమ్ముకుని జీవిస్తున్న వారి సంక్షేమం కోసం అందరం ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ముందుగా అతిథులందరూ కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్.రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత కుమారీ, ఈడీ మనోహర్, వివిధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి, జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలోనే కొనసాగిందని తెలిపారు. కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం ప్రజాస్వామ్య పాలనలో ప్రజల సంక్షేమం, పారదర్శకత, జవాబుదారీతనం ఎంతో కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా ప్రజాపాలన వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ప్రజల భద్రతకు పోలీసుల కృషి శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ పోలీసుల ప్రధాన బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయు తంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**- అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులు**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.అంతకుముందు హనుమకొండ అదాలత్ సర్కిల్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఎంపీ డాక్టర్ కడియం కావ్య అమరవీరులకు నివాళు లర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ రవి, కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, డీఆర్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చేప పిల్లల పంపిణీకి సిద్ధం

కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 17 విజన్ ఆంధ్ర ) : కామారెడ్డి జిల్లా లో చేప పిల్లల పంపిణీకి ఆదేశాలు రావాల్సి ఉందని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని, జిల్లా వ్యాప్తంగా 786 చెరువులు ఉండగా రెండు కోట్ల 86 లక్షల చేప పిల్లలను ప్రజా నిధులు, సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు, హెడ్ ఆఫీస్ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

## ఘనంగా విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 17 (విజన్ఆంధ్ర) : కామారెడ్డి ఐడీఓసీలో విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్.వై. గిరి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవి తేజ తదితరులు విరాట్ విశ్వకర్మ భగవాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడంతో పాటు ప్రత్యేక పూజలు, యజ్ఞ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, సోదరభావం, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంతో పాటు సాంప్రదాయ విలువలు, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విశ్వకర్మ భగవాన్‌ను సృష్టి, నిర్మాణం, శిల్పకళకు ప్రతీకగా భావిస్తూ నిర్వహించే ఈ యజ్ఞ మహోత్సవానికి విశ్వబ్రాహ్మణ సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి పి. నర్సయ్య, బీసీ నాయకులు శివరాములు, నాగరాజు, కొత్తపల్లి మల్లయ్య, విశ్వబ్రాహ్మణ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**- జాతీయ జెండాను ఆవిష్కరించిన ఉపసర్పంచ్ వీరయ్య**

అడ్డగూడూరు, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర ) : మండల పరిధిలోని లక్ష్మీదేవికాల్వ గ్రామపంచాయతీ వద్ద తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కంబాల వీరయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు అత్యంత చరిత్ర కలిగిన దినమని, నిజాం పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం, చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పొన్నాల లక్ష్మి, చిగుళ్ల గంగరాజు, కత్తుల సతీష్, ఆకుల రేణుక, గ్రామస్తులు వల్లంభట్ల రవీందర్ రావు, పనుమటి బిక్షం, మాధ వెంకన్న, బండి నాగరాజు, చేతల రవి, కన్నెబోయిన ప్రవీణ్, గ్రామపంచాయతీ సిబ్బంది సోమయ్య, గోపయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విజన్ ఆంధ్ర కథనానికి స్పందన..

# రైల్వే బ్రిడ్జి రోడ్డుకు మరమ్మతులు




విజన్ ఆంధ్ర

సోమవారం 14 సెప్టెంబర్ 2026 | పేజీలు : 10

గుంతలమయంగా....

రైల్వే బ్రిడ్జి రోడ్డు!

మెట్‌పల్లి డివిజన్, సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర): మెట్‌పల్లి పట్టణంలోని రైల్వే బ్రిడ్జి కింద రహదారి అధ్వానంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయంపై విజన్ ఆంధ్రలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారిపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టారు. రైల్వే బ్రిడ్జి కింద రహదారి గుంతలమయంగా మారడంతో పాటు పలు చోట్ల ఇనుపచువ్వలు బయటకు తేలి ఉండటం, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారిన పరిస్థితిని కథనంలో ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకుని వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టడంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యపై స్పందనకు అభినందనలు

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రహదారి సమస్యను అధికారులు గుర్తించి తక్షణమే స్పందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత మరమ్మతులు తాత్కాలికంగా కాకుండా, భారీ వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని రహదారికి నాణ్యతా ప్రమాణాలతో శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ద్వారా అధికారులు స్పందించి పరిష్కార చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు విజన్ ఆంధ్రకు కృతజ్ఞతలు తెలిపారు. రహదారి పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, భవిష్యత్తులో మళ్లీ గుంతలు ఏర్పడకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, మత సామరస్యంతో ప్రశాంతంగా నిర్వహించాలి.

- వినాయకుడికి పూజిస్తే విఘ్నాలు తొలగి సకల శుభాలు.
- నిమర్జనం సమయంలో అప్రమత్తత అవసరం.
- డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు.
- నారాయణపేట ఎస్పీ డాక్టర్ వినీత్.

ఊట్కూర్, సెప్టెంబర్ 17 ( విజన్ ఆంధ్ర) గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించుకోవాలని నారాయణపేట ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. గురువారం ఊట్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గణేష్ మంటపాల నిర్వాహకులు ఆర్గనైజర్లు ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూగణేష్ ఉత్సవాలు ప్రజలందరికీ ఆనందాన్ని, భక్తి భావాన్ని కలిగించేలా ఉండాలని, ఉత్సవాల నిర్వహణలో పోలీస్ శాఖ తరపున నిర్వాహకులకు పూర్తి సహకారం అందిస్తామని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

**డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి...**

గణేష్ శోభాయాత్రలు, ఇతర మతపరమైన ఊరేగింపుల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. డీజే సంస్కృతికి స్వస్తి పలికి, సంప్రదాయ కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వాయిద్యాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పండుగల ఊరేగింపుల్లో డీజే వినియోగంపై నిషేధం అమల్లో ఉందని, ఈ మేరకు ఆర్డీఓ నారాయణపేట జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను నిర్వాహకులకు అందజేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నిమజ్జన సమయంలో అప్రమత్తత అవసరం..**

గణేష్ నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు, యువత, భక్తులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది, క్రేన్లు తదితర అత్యవసర సేవలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు.

ఎవరూ నీటిలోకి దిగి ప్రమాదానికి గురికాకుండా పోలీసుల సూచనలు పాటించాలని, చిన్నారులను చెరువులు, నీటి వనరుల వద్దకు ఒంటరిగా అనుమతించవద్దని సూచించారు. విగ్రహాల పరిమాణం, నీటిమట్టం, నిమజ్జన ప్రాంత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోలీస్ శాఖ సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

**పెద్ద విగ్రహాల నిమజ్జనంపై ముందస్తు సమాచారం ఇవ్వాలి....**

అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ అధికారులు, సంబంధిత



శాఖల అధికారులతో కలిసి ఊట్కూర్ చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఊట్కూర్ చెరువులో నీటిమట్టం తక్కువగా ఉన్న నేపథ్యంలో పెద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, పెద్ద విగ్రహాలను మక్తల్ ట్యాంక్ లేదా కృష్ణా నదిలో నిమజ్జనం చేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. పెద్ద విగ్రహాల నిర్వాహకులు నిమజ్జనానికి ముందుగానే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని, తదనుగుణంగా ఆయా ప్రాంతాల్లో అవసరమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

**మత సామరస్యానికి ప్రతీకగా ఉత్సవాలు నిర్వహించాలి.....**

అనంతరం ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో జిల్లా ఎస్పీ శాంతి సమావేశం నిర్వహించారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని ఊట్కూర్ లో మత సామరస్యాన్ని, సోదరభావాన్ని చాటేలా ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకోవాలని ఎస్పీ కోరారు. గణేష్ శోభాయాత్రలు జరిగే మార్గాల్లోని మసీదులు, ప్రార్థనా మందిరాల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎలాంటి అపోహలకు, వదంతులకు తావివ్వకుండా ప్రజలు సంయమనం పాటించాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. హిందూ, ముస్లిం మత పెద్దలు పరస్పరం సహకరించుకుంటూ ఊట్కూర్ ప్రాంతంలో శాంతి, సామరస్యాన్ని కాపాడేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గణేష్ ఉత్సవాలు భక్తికి, నిమజ్జన కార్యక్రమాలు క్రమశిక్షణకు, ఊట్కూర్ ప్రజల ఐక్యత మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలన్నారు . ప్రతి ఒక్కరి సహకారంతో ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకుందామన్నారు. అంతకుముందు వివిధ వినాయక మండపాల వద్ద ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేశ్, సీఐ రామ్ లాల్, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్సైలు రమేష్, భాగ్యలక్ష్మి రెడ్డి, తహసిల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో పావని, సర్పంచ్ ఎం రేణుక భరత్, హిందూముస్లిం మత పెద్దలు, గణేష్ మండపాల నిర్వాహకులు, ఆర్గనైజర్లు, యువత తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రపంచ బ్యాంకు సహకారం

- వరంగల్ నగరంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటన

వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్17(విజన్ ఆంధ్ర); హనుమకొండ కుడా కార్యాలయంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో సమావేశమైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్ పాయి, జిడబ్ల్యుఎంసీ కమిషనర్ వెంకన్న, ఇతర అధికారులు నగర అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులపై చర్చ వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పూనం అహ్లువాలియా ఖనిజో, అపూర్వ సెన్వి, నేహా ప్రవాస్ కుమార్ మిశ్రా, వెంకటరావు భయాన సమావేశమయ్యారు. గురువారం హనుమకొండ లోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ,వరంగల్ జిల్లాలో కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తేజావత్ వెంకన్న, ఇతర అధికారులు వరంగల్ నగర అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులపై సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్న ప్రాంతాల్లో ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు పర్యటించారు. ఈ సమావేశంలో వరంగల్ నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల ప్రాజెక్టు వివరాలపై చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు కలెక్టర్లు, అధికారులు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 300 మిలియన్ అమెరికన్ డాలర్ల రుణ ప్రతిపాదనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రపంచ బ్యాంకుకు ప్రతిపాదనలు సమర్పించగా, ప్రపంచ బ్యాంకు సూత్రప్రాయంగా రుణానికి ఆమోదం తెలిపిన నేపథ్యంలో జిల్లాలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణం కింద చేపట్టేందుకు అర్హత కలిగిన ప్రాజెక్టులు, ప్రాజెక్టుల ప్రతిపాదనలు ఏ విధంగా ఉండాలి, డీపీఆర్‌లను ఏ గడువులోగా సమర్పించాలి, తదితర అంశాలపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్లు, అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ రుణ సహాయంలో 70 శాతం ప్రపంచ బ్యాంకు రుణంగా, మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఉండే విధంగా ప్రతిపాదన రూపొందించినట్లు అధికారులు వివరించారు. వరంగల్ నగరానికి ప్రతిపాదించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే సిద్ధంగా ఉన్న పలు



అభివృద్ధి ప్రతిపాదనలను ప్రపంచ బ్యాంకు బృందానికి అధికారులు వివరించారు. ఇందులో ముఖ్యంగా అశోక జంక్షన్, భద్రకాళి ఆలయం ప్రాంతాల్లో మల్టీ లెవల్ కారు పార్కింగ్, సెంట్రల్ ప్లాజా పునర్నిర్మాణ పనులు, రోప్‌వే, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి, సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థ తదితర ప్రాజెక్టులు ఉన్నాయి. ఇప్పటికే డీపీఆర్ సిద్ధంగా ఉండి, టెండర్లు పూర్తయి అవార్డు దశకు చేరుకున్న ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యత లభించే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా రెండో దశలో డీపీఆర్‌లు సిద్ధమవుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను సమర్పిస్తే, వాటిని పరిశీలించి అర్హత ఆధారంగా రుణ సహాయానికి పరిగణించే అవకాశం ఉందని బృందం ప్రతినిధులు వివరించారు. వరంగల్ నగరవ్యాప్తంగా సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే సిద్ధంగా ఉన్నందున, ఈ ప్రాజెక్టును మొదటి దశలోనే ప్రపంచ బ్యాంకు రుణ సహాయానికి ప్రతిపాదించే అవకాశం ఉందని, మిగతా ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన సిద్ధం చేసి తదుపరి దశలో సమర్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు తెలిపారు. దీనిపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం స్పందిస్తూ వరంగల్ చారిత్రక, వారసత్వ ప్రాధాన్యత కలిగిన నగరంగా ఉన్నందున హెరిటేజ్, పర్యాటక రంగాల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నగరంలోని చారిత్రక ప్రాంతాలను పరిరక్షిస్తూ పర్యాటక, మౌలిక వసతులను అభివృద్ధి చేసే విధంగా ప్రాజెక్టులను రూపొందించాలని సూచించారు. హెరిటేజ్ ప్రాజెక్టుల పరిధిలో చేపట్టనున్న పనులు, వాటిలో చేర్చాల్సిన వివిధ అంశాలపై కూడా ప్రపంచ బ్యాంకు బృందం ప్రతినిధులు అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతిపాదనలు, డీపీఆర్‌లను సిద్ధం చేసి సమర్పించడం ద్వారా వరంగల్ నగరంలో మౌలిక వసతులు, రవాణా, డ్రైనేజీ, పర్యాటకం, హెరిటేజ్ పరిరక్షణ, పట్టణ సుందరీకరణ తదితర రంగాల్లో సమగ్ర అభివృద్ధికి బాటలు వేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఇతర అధికారులతో పాటు కన్సల్టెంట్ ప్రతినిధి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## అయిజ ప్రభుత్వ కార్యాలయాలలో ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం వేడుకలు




అయిజ సెప్టెంబర్ 17 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలో జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎన్. జ్యోతి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్, ఎంఈఓ కార్యాలయంలో మండల విద్యాధికారి రాములు, మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్, సింగిల్ విండో కార్యాలయంలో అధ్యక్షుడు పోతుల మధుసూదన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిన చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ సమగ్రత, ఐక్యత, సౌభ్రాతృత్వం, ప్రజల మధ్య సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర); తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని చాటిన వీరుల త్యాగాలను స్మరిస్తూ తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పర్వతగిరి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు హార్కవత్ వినోద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కూడికల శ్రీధర్ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాటోత్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కుల కోసం ఎంతోమంది త్యాగాలు చేశారని, వారి స్ఫూర్తిని నేటి తరాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, తెలంగాణ రాష్ట్రం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు బత్తిని దేవేందర్, జాటోత్ రవి నాయక్, మండల ఉపాధ్యక్షుడు తొర్రి లక్ష్మణ్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి సుధాకర్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ముంజాల రాజ్‌కుమార్, ఐటీ సెల్ ఇన్‌చార్జి పెండ్యాల వంశీకృష్ణ, పర్వతగిరి బీజేవైఎం అధ్యక్షుడు గొల్లపల్లి సంతోష్, సీనియర్ నాయకులు విరారపు పిచ్చిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, సాంబయ్య, బొల్లం రాజారామ్, చీమల చంద్రయ్య, వడ్లకొండ నవీన్, పాయిలి యాకయ్య, తోట రాజు, దేవేందర్, గొర్ల రాములు, దేసు రామ్, ఇర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17(విజన్ ఆంధ్ర) : జిల్లా బి . సి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ బంగ్లా సమీపంలోని విశ్వకర్మ దేవాలయంలో నిర్వహించిన భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశ్వకర్మ చేతివృత్తులు, కళలు, శిల్పకళ, వాస్తుకళ, నైపుణ్యాలకు ఆద్యుడని అన్నారు. తరతరాలుగా తమ వృత్తి నైపుణ్యాలను కొనసాగిస్తూ సమాజానికి సేవలందిస్తున్న చేతివృత్తిదారులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత సంప్రదాయ వృత్తుల్లోని నైపుణ్యాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. చేతివృత్తిదారుల సంక్షేమం, వృత్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ జి. మమత, జిల్లా బి.సి సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి విష్ణునందన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విలీన దినోత్సవం చారిత్రక ఘట్టం

- డీసీసీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆత్రం సుగుణ..



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17: (విజన్ ఆంధ్ర) తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం డీసీసీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. తెలంగాణను భారత యూనియన్‌లో విలీనం చేసిన సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యత కలిగిన రోజని అన్నారు. తెలంగాణ ప్రజల పోరాటం, త్యాగాలను స్మరించుకుంటూ ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, హక్కులు, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్,నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, ఆసిఫాబాద్ అర్బన్, రూరల్ అధ్యక్షులు రాపర్తి మురళి, ఇమ్రాన్ హాస్మి, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ఈ నెల 27న బీసీ ఎస్సీ ఎస్టీ, మైనార్టీ బహిరంగ పంచాయితీ సభ

- 'మన వంతు మన కులాల వాటా, సామాజిక న్యాయం, రాజ్యాధికారమే లక్ష్యం'
- హాజరుకానున్న విద్యావేత్తలు, వివిధ సంఘాల నాయకులు
- కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపు

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 17 ( విజన్ ఆంధ్ర ) :

ఈ నెల 27వ తేదీ (ఆదివారం) ఉదయం 11:30 గంటలకు హన్మకొండ హంటర్ రోడ్డులోని డి కన్వెన్షన్ హాల్ నందు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ బహిరంగ పంచాయితీ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం రోజున హన్మకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

**సభ ప్రధాన ఉద్దేశం**




"మన వంతు మన కులాల వాటా, సామాజిక న్యాయం, రాజ్యాధికారమే లక్ష్యం" అనే నినాదంతో ఈ సభను నిర్వహిస్తున్నామని, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మేధావులు, విద్యార్థులు, మహిళలు, అన్ని బీసీ కుల సంఘాల నాయకులు, ప్రజాతంత్రవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**ముఖ్య అతిథులుగా**

ఈ బహిరంగ సభకు జాక్ (జేఏసీ) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్, తెలంగాణ విశ్రాంత జడ్జి ఈశ్వరయ్య, జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాఘవేంద్ర ముదిరాజ్ లతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాటె పగడాల ఏసుబాబు (బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ), డా. చందా మల్లేశం (వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ ఎస్టీ ఎస్సీ జేఏసీ ఛైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్), బండి పుల్లయ్య (సలహాదారు, మాజీ ఎమ్మెల్యే), పంగిల సాయిబాబు (కార్యదర్శి), మేకల సమ్మయ్య (కో-ఆర్డినేటర్)లతో పాటు ప్రముఖ నాయకులు పైదం రవి, గంగారపు ఎల్లస్వామి, నాగరాజు, రాజేందర్, నెమిలకొండ రమేష్ నాయక్, మాధాసి కలహస్తినాథ్, కొల రమేష్ గౌడ్, బాబ్జీ నాగరాజు, హరిదాస్ శ్రీ-సురేష్, ఉమేష్ బాబు, విష్ణువర్ధన్ రాజు, అనిల్, ముద్దసాని తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.